
సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి!



# లోకాయత
# చార్వాక


సామాజిక చైతన్య త్రైమాసపత్రిక



సంపుటి : 2 సంచిక : 1 అక్టోబర్–డిసెంబర్ 2025, జనవరి–మార్చి 2026

## 34వ జాతీయ నాస్తికమేళా దృశ్యములు





టెలిస్కోప్ ద్వారా 'అంతరిక్ష వీక్షణం', వివరిస్తున్న రవిరాజా పోతినేని (A.S.T.R.O వ్యవస్థాపకులు)



ఖగోళ విజ్ఞానం పై ఉపన్యసిస్తున్న రఘునందన్

ప్రచురణ :
చార్వాకాశ్రమం
స్థాపితం : 1973

నాస్తిక సమాజం చార్వాక ఆశ్రమం

నిర్వహణ :
నాస్తిక సమాజం
స్థాపితం : 1968

# లోకాయత - చార్వాక

అక్టోబర్ - డిసెంబర్, 2025
జనవరి - మార్చి, 2026



గౌరవ సంపాదకులు : **డా॥ భాను ప్రసాద్**

ప్రధాన సంపాదకులు : **బి. సుధాకర్**

సహాయ సంపాదకులు :
**జంజనం సత్యనారాయణ**
**సత్య నిర్ధారణ్**
**యం.యన్. బుద్ధ**
**వి.వి.డి.ఎస్. ప్రసాద్**
**లతీఫ్**
**నాస్తిక్ శ్రీకాంత్**



రచనలు, అభిప్రాయాలు, విరాళాలు
పంపవలసిన చిరునామా :
**బి. సుధాకర్**
**చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),**
**మంగళగిరి (మండలం)**
**గుంటూరు జిల్లా - 522 240.**
**సెల్ : 9290619550, 9440101814**
Google Pay, Phone Pay : 9290619550
voiceofcharwaka@gmail.com


శాస్త్రీయ స్పృహను
మానవ వాదాన్ని, పరిశీలనాతత్వాన్ని,
సంస్కరణను పెంపొందించటం
ప్రతి భారతీయ పౌరుని విధి,
భారత రాజ్యాంగం
ఆర్టికల్ 51(A)(H) రూల్ IV A.


**పత్రికలో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. పత్రిక యాజమాన్యం వారి అభిప్రాయాలతో ఏకీభవించనవసరం లేదు.**

**For Internal Circulation only**
**Not for Sale**


**ఈ సంచికలో...**


| | | |
|---|---|---|
| 1. | ప్రశ్నించే తత్త్వమే శాస్త్రీయతకు పునాది | 3 |
| 2. | ఆనాటి సనాతన ధర్మం-ఈనాడు పరమ అధర్మం | 5 |
| 3. | ప్రాణుల లక్షణాలు, భౌతిక ప్రేరణలు | 8 |
| 4. | వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి హోమియోపతి | 10 |
| 5. | సామాజిక విప్లవ తత్త్వవేత్త డా॥ అంబేడ్కర్ | 15 |
| 6. | బైబిల్ బాగోతం | 18 |
| 7. | మతం గుప్పిట్లో మహిళ | 22 |
| 8. | ఆరాధనలు, ప్రార్థనలు జీవావసరాలేనా | 24 |
| 9. | మేలుకొలుపు | 26 |
| 10. | సమాజం- మూఢనమ్మకాలు - వాస్తవాలు | 29 |
| 11. | తప్పిపోయిన మనుష్యులను వెతుకుదాం | 32 |
| 12. | ఘనంగా జరిగిన 34వ నాస్తిక మేళా | 35 |
| 13. | అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం | 36 |
| 13. | మాట దాటవేసిన ప్రొఫెసర్ | 38 |
| 14. | మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తేవాలి! | 40 |
| 15. | మార్చి-8 మహిళలకు స్ఫూర్తి కావాలి! | 41 |


1931 మార్చి 23 రాత్రి, భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులను బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీయడానికి తీసుకెళ్లిన గల్లాస్ వైపు భయంతో కాదు, ధైర్యంతో, చిరునవ్వులతో "ఇంక్విలాబ్ జిందాబాద్!" అని నినదిస్తూ నడిచారు.

పంజాబ్ రాష్ట్రంలోని ఫిరోజ్‌పూర్ సమీపంలోని హుసున్‌వాలా జాతీయ అమరవీరుల స్మారక చ్నిహం వద్ద ఈ ముగ్గురు వీరుల దహన సంస్కారాలు జరిగాయి. భారత్ విభజన సమయంలో ఈ స్థలం పాకిస్తాన్‌లోకి వెళ్లింది. తరువాత 1961లో 12 గ్రామాల మార్పిడి ద్వారా ఇది మళ్లీ భారతదేశానికి వచ్చింది.


నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి, గుంటూరు జిల్లా - 522 240.
ఫోన్ : 91777 21588, https://charvaka.co.in/

# ప్రశ్నించే తత్త్వమే శాస్త్రీయతకు పునాది

– డా॥ దేవరాజు మహారాజు
– సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్

**ఎం**దుకు కొందరు దేవుడి వైపు, ఆధ్యాత్మికత వైపు, మూఢవిశ్వాసాల వైపు మొగ్గు చూపుతారు? ఎందుకు మరికొందరు అందుకు విరుద్ధంగా ఉందామంటారు? సమాజంలో హేతుబద్ధత పెంచుతూ, జీవపరిణామాన్ని మానవ విజయాల్ని పరిగణనలోకి తీసుకుని, మానవీయ విలువలతో బతుకుదామంటారూ? మనుషులందరికీ ఆలోచించే మెదడు ఒకటే కదా? మానవ మేధస్సులో అనాదిగా ఈ అంతర్యుద్ధం ఎందుకు జరుగుతోంది? ఈ సంఘర్షణ కొనసాగుతూ ఉండాల్సిందేనా? – అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకడం కోసం ఇటీవల కొన్ని పరిశోధనలు జరిగాయి. కొన్ని వందల మంది స్త్రీ, పురుషుల మెదడ్లు స్కాన్ చేసి అధ్యయనం చేశారు. వివరాలు PLOS ONE సంస్థ ప్రచురించింది. పరిశోధనల వల్ల శాస్త్రవేత్తలు తెలుసుకున్నదేమంటే, మెదడు నిర్మాణంలో కొన్ని తేడాలుండడం వల్ల మనుషులు ఇలా భిన్నంగా ప్రవర్తిస్తున్నారని! – ఇది ఒక కారణమైతే, మెదడును పనిచేయించే విధానం, లేక ఉపయోగించే తీరునుబట్టి కూడా వారు ఎన్నుకునే దారులు వేరైపోతున్నాయన్నది – మరొక కారణం! ఇవికాక, మరొక ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఏదో ఒక శక్తిని, ఒక దేవుడిని, దేవతను నమ్మేవారు తమ మెదడులోని విజ్ఞతను, వివేకాన్ని, జిజ్ఞాసను అణచివేస్తున్నారని! సమాజాన్ని, పరిసరాల్ని, దైనందిన జీవితాన్ని నిరంతరం విశ్లేషించుకుంటూ ఉండే లక్షణాన్ని వారు మెదడు పొరల్లోనే పాతేస్తున్నారని!!

మెదడు నేల మీద కొత్త మొక్కలు మొలిచే అవకాశమే లేకుండా 'విశ్వాసమనే' గచ్చు చేసుకుని, జీవితం హాయిగా ఉందనుకుంటూ భ్రమలో బతికేస్తున్నారని!! టూకీగా పరిశోధకులు చెప్పిన కారణాలు ఇవి – సాంకేతిక పదజాలం తీసేసి, నేనిక్కడ సారాంశం మాత్రమే ఇస్తున్నాను. ప్రతి మెదడులో ఈ రెండు ధోరణులకు వీలుంది. ఆధ్యాత్మికత భావనలకు, మతపరమైన నమ్మకాలకు చోటును మెదడులోనే మరోవైపు ప్రశ్నించే తత్వం విశ్లేషించే నేర్పూ ఉన్నాయి! ఆ మనిషి దేవుడి వైపు మొగ్గు చూపితే అతను / ఆమె భక్తులవుతారు. అంటే, భక్తి పారవశ్యంలో తేలిపోయే భక్తుడు తన మెదడులోని ఇంగిత జ్ఞానాన్ని సమాధిచేసి పైకి లేస్తాడు. అదే ఒక హేతువాది తన నేపథ్యంలో, వారసత్వంగా, కొన్ని శతాబ్దాలుగా ప్రవహిస్తూ వస్తున్న మూఢ భక్తికి అడ్డుకట్టవేసి లోకంలో కొత్త వెలుగు రేఖలు చూస్తాడు. తనలోని వివేచనను బావుటాలా పైకెత్తి ఛాందసపు చీకట్లను పారదోలుతాడు.

కేస్ వెస్టరన్ రిజర్వులో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టోనీ జాక్, అతని వైజ్ఞానిక బృందం వందల మంది మెదడ్లు ఎఫ్.ఎం.ఆర్.ఐ స్కాన్ చేశారు. వచ్చిన ఫలితాల్ని వారివారి అభిప్రాయాలతో, దృక్పథాలతో అనుసంధానం చేసి పరిశీలించారు. అంతిమంగా వచ్చిన సారాంశాన్ని ప్రజలకు

తెలియజేశారు. మెదడులో వేర్వేరు న్యూరాన్ నెట్‌వర్క్‌లు ఉన్నాయని, మనిషి ఏ నెట్‌వర్క్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటాడో అతని భావాలు ఆ దిశలోనే ఉంటాయని ఆ బృందం చెప్పింది. సామాన్యంగా అయితే, ఏదో ఒక నెట్‌వర్క్ చురుకుగా పనిచేస్తుంది. మరో నెట్‌వర్క్ పని చేయకుండా ఉంటుంది. అందుకే సమాజంలో దేవుడున్నాడనే వారో, లేక లేడనే వారో ఉంటున్నారు. మరికొందరు ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో ఉంటున్నారు కదా? దానికేమిటి సమాధానం? లేదా కొంతమంది పేరుమోసిన శాస్త్రవేత్తలే ఆధ్యాత్మికతలో మునిగి తేలుతున్నారు కదా అని అంటే, అలాంటి వారిలో ఆ రెండు రకాల నెట్‌వర్క్‌లు కొంత కొంత పనిచేస్తున్నాయన్న మాట! అందుకే కదా వారు సంశయాలతో బతుకుతూ తమ విలువ తగ్గించుకుంటున్నారు? దీనికి దేశ మాజీ రాష్ట్రపతులే గొప్ప ఉదాహరణ! అబ్దుల్ కలాం రాకెట్ సైంటిస్టుగా ఖ్యాతిపొంది, పుట్టపర్తి సాయిబాబా లాంటి ఎంతోమంది ముందు మోకరిల్లారు. అంతేకాదు – ఈ విశ్వంలోని గ్రహాలన్నీ పుట్టపర్తి సాయిబాబా చుట్టూ పరిభ్రమిస్తున్నాయని కూడా వ్యాఖ్యానించారు. ఆయన బలహీనతలు ఆయనకు ఉండొచ్చుగాక, దేశ ప్రథమ పౌరుడి హోదాలో ఉండి, ఈ దేశ గౌరవం, దేశ పౌరుల ఆత్మవిశ్వాసానికి భంగం కలగకుండా ప్రవర్తించాల్సిన బాధ్యత ఆయనకు ఉండింది కదా?

కొన్ని శతాబ్దాలుగా దైవ భావనను సమాజంలో ప్రతిష్టించాలని అన్ని ప్రయత్నాలు జరిగాయి. ఇప్పటికీ దైనందిన జీవితంలోని సంభాషణల్లో దేవుడి ప్రసక్తి ఉండకుండా ఉండదు. పురాణాలు, హరికథలు, భజనలు, గుళ్ళు, సంగీతం, నాట్యం – వీటన్నింటి ధ్యేయం ఒకటే కదా? దేశాలు, మతాలు, భాషలు వేర్వేరు కావొచ్చు కానీ దైవభావన నిలుపడానికి అంతా ఒక్కుమ్మడిగా ప్రయత్నిస్తూ వచ్చాయి. ప్రయత్నిస్తూనే ఉన్నాయి. పైగా ప్రశ్నిస్తూ వైజ్ఞానికంగా ఎదుగుతూ వచ్చిన శాస్త్రజ్ఞుల్ని, వైజ్ఞానిక కార్యకర్తల్ని, అభిమానుల్ని, ఉపాధ్యాయుల్ని మతపెద్దలు చిత్రహింసలు పెట్టారు. భారతీయ సంస్కృతిలో దేవుణ్ణి ప్రశ్నించిన చార్వాకులు, నిరీశ్వరవాదులు, హేతువాదులూ కూడా ఉన్నారన్న విషయం మరిచారు. మరిచినట్టు నటించారు. ఇంకా నటిస్తున్నారు.

పుట్టి పెరిగిన సమాజ నేపథ్యం, కుటుంబ నేపథ్యం వగైరాల ప్రభావం మనిషి మీద కొంత ఉన్నా – ఈ భేదాలు రావడానికి ప్రధాన కారణం... మెదడును చురుకుగా పనిచేయించడం, ప్రశ్నిస్తూ జవాబుల కోసం అన్వేషిస్తూ ఉండడం, ఆలోచనల్ని సమాహారంగా తీర్చిదిద్దుకుని తమకై తాము ఒక దృక్పథం ఏర్పరుచుకోవడం మీద ఫలితం ఉంటుందని పరిశోధనల్లో తేలింది. పరమఛాందస కుటుంబంలో పుట్టిన వాడైనా.. కమ్యూనిస్ట్‌గా, హేతువాదిగా తయారు కావొచ్చు. నాస్తికవాద వాతావరణంలో పుట్టి పెరిగినా, కొంతమంది ఆ ధోరణిని ముందుకు తీసుకుపోకుండా, అలసత్వంతో జాతకాల్ని నమ్ముతూ కాలం వెళ్ళబుచ్చే వాళ్ళుగా కావొచ్చు. అందువల్ల ఛాందసవాదమా? హేతువాదమా! ఎటువైపు మన పయనం అనేది వ్యక్తులుగా ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిన విషయం! ఒక్కటి మాత్రం నిజం! పౌరులుగా బాధ్యతగల వాళ్ళంతా వైజ్ఞానిక స్పృహ వైపే ప్రయాణిస్తారు!! •

# ఆనాటి సనాతన ధర్మం - ఈనాడు పరమ అధర్మం

(గత సంచిక తరువాయి)

– కొత్తపల్లి రవిబాబు

**ఈ** కర్మలలో ఆఖరిది 'అంత్యేష్టి' అంటే మనిషి చనిపోయిన తర్వాత చేసే కర్మకాండ. దీనినే శ్రాద్ధకర్మ అంటారు. దీని తతంగంలో బ్రాహ్మణుడికి ఎన్నో దానాలు చేయాలి. చీము, నెత్తురుతో ప్రవహించే వైతరణి నదిని జీవాత్మదాటి ఉన్నత లోకాలలోకి వెళ్ళాలంటే ఇక్కడ కర్మకాండ చేసే పురోహితునికీ ఎన్నో దానాలు చేయాలి. జీవాత్మ తన ప్రయాణంలో కాళ్ళు కాలకుండా, ముళ్ళు గుచ్చుకోకుండా వుండటానికి చెప్పులు, ఎండకు, వానకు రక్షణగా గొడుగు, దారిలో విశ్రాంతి తీసుకోడానికి మంచం, వైతరణి నదిని దాటడానికి సహాయంగా ఒక ఆవు (ఆ ఆవు తోకపట్టుకుని దాటుతుంది జీవాత్మ) ఇలా సవాలక్ష దానాలు ఇవ్వాలని సనాతనధర్మం చెబుతోంది. కాని ఇప్పుడు ఇవన్నీ తూతూ మంత్రంగా చేస్తున్నామంటే సనాతనాన్ని వర్జించి ఆధునికాన్ని అవలంబిస్తున్నట్లే కదా!

మరో విషయం. ఉపనయనం చేయడం బ్రాహ్మణులలో ఒక ఆచారం. ఆ సందర్భంగా పూర్వకాలంలో "పరమపవిత్రమైన" ఒక రహస్య మంత్రం – అదే గాయత్రీ మంత్రాన్ని వడుగు సమయంలో ఆ వటువు చెవిలో చెబుతారు. దీనిని శూద్రులు వినగూడదు. ఎన్నో శతాబ్దాల పాటు బ్రాహ్మణులకే పరిమితమైన ఈ రహస్యమంత్రం ఈనాడు బట్టబయలై మైకుల ద్వారా మన చెవులను బ్రద్దలు గొడుతోంది. సనాతనధర్మం అంటే 'ఎప్పుడూ ఒకేరకంగా వుండేది – మార్పుకు లోనుకానిది' అని అనేవారు ఈ గాయత్రీ మంత్రం బహిరంగం కావడం గురించి ఏం చెబుతారు?

మనిషి తల్లి గర్భంలో పిండంగా ప్రాణం పోసుకున్న సమయం నుంచీ, మరణించేవరకూ ప్రతి ముఖ్యదశలోనూ పురోహితుని ప్రమేయం వుండేట్లు చేసి వారికి జీవనాధారం కల్పించింది సనాతనం. అంతేగాని ఈ షోడశకర్మలలో పవిత్రత ఏమీలేదు. వాటిని 'ధర్మం' నిర్దేశించిన ప్రకారం చేయకపోతే ఏమీకాదు. ఈనాడు పలువురు మరణానంతరం తమ దేహాలను ఖననంగానీ, దహనంగానీ చేయకుండా వైద్య విద్యార్థుల విద్యకు ఉపయోగించే విధంగా వైద్య కళాశాలలకు దానం చేస్తున్నారు. జీవాత్మ తన పూర్వజన్మకర్మల ఆధారంగా పునర్జన్మ పొందుతున్న సిద్ధాంతం ఎక్కడా ఋజువు కాలేదు. పూర్వజన్మకు సంబంధించి కొన్ని కథనాలు అడపాదడపా వస్తుంటాయి. కాని అవన్నీ అవాస్తవాలే.

ఈ పూర్వజన్మ, పునర్జన్మ సిద్ధాంతం రెండువైపులా పదునువున్న కత్తి. 'నేనెందుకు పేదవానిగా వున్నాను" అని అడిగితే "పూర్వజన్మలో పాపాలు చేసి వుంటావు, కనుక ఈ జన్మలో కష్టాలు అనుభవిస్తున్నావు" అని సమాధానం ఇచ్చి, 'ఈ జన్మలో మంచి పనులు చేస్తే వచ్చే జన్మలో సుఖాలు అనుభవిస్తావు" అని హామీ ఇస్తారు. ఈ సిద్ధాంతంతో ప్రజలు తమ సమస్యలకు వాస్తవంగా కారణమైన , సామాజిక పీడన గురించి అర్థం చేసుకోకుండా చేసి, సంఘటితపడి ఈ వ్యవస్థకు ఎదురు తిరగకుండా నిష్క్రియాపరులను, నిశ్చేతనులను చేస్తోంది 'సనాతనం'. ఎదురు తిరిగిన దేశాలలో ప్రజలు సమానత సాధించి ఈ జన్మలోనే తమ సమస్యలను పరిష్కరించుకున్న ఉదాహరణలు మన కళ్ళ ముందే వున్నాయి. 'నీ ప్రస్తుత స్థితి నీ పూర్వజన్మ ఫలితం' అనే కర్మసిద్ధాంతాన్ని మన రాజ్యాంగం అంగీకరించడం లేదు. వేలాది సంవత్సరాలుగా సామాజికంగా అణచిపెట్టబడిన బడుగు వర్గాల సామాజిక ప్రయోజనాలను రాజ్యం కాపాడాలి అంటూ వారికి కొన్ని ప్రత్యేక రాయితీలు రాజ్యాంగం కల్పించింది. ఇది రాజ్యాంగధర్మం.

రాజ్యాంగంపై ప్రమాణం చేసి ముఖ్యమంత్రులుగా, ఉపముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, శాసనసభ్యులుగా అధికారం చెలాయిస్తున్న వారు పాటించాల్సింది రాజ్యాంగధర్మమా? అసమానతలను, అశాస్త్రీయ అంశాలను ప్రోత్సహించే సనాతన ధర్మమా? వారికి సనాతన ధర్మమే ముఖ్యమనుకుంటే రాజ్యాంగం ఇచ్చిన పదవులు వదలుకొని, కాషాయ వస్త్రాలు ధరించి 'సనాతన ధర్మ పరిరక్షణ' కోసం పీఠాలు స్థాపించి కృషి చేసుకోవచ్చు.

రాజ్యాంగం అనేది సనాతనధర్మంలాగా శిలా సదృశం కాదు. 1950 నుండి 2024 సెప్టెంబరు వరకు సామాజిక, ఆర్థిక, నైతికపరమైన అవసరాల రీత్యా రాజ్యాంగానికి 106 సవరణలు చేసుకున్నాం. సెప్టెంబరు 2023లో చేసిన 106వ సవరణ ప్రకారం మహిళలకు లోకసభలోనూ, రాష్ట్ర శాసనసభల్లోనూ మూడవ వంతు రిజర్వేషన్లు లభించాయి.

రాజ్యాంగం విద్యార్హతనుబట్టి వృత్తులను చేసుకోవడం ప్రోత్సహిస్తోంది. కాని సనాతనధర్మం వర్ణాన్నిబట్టి కులవృత్తులు చేసుకొమ్మంటోంది. అంటే పుట్టుకతో వచ్చిన కులం ఏ వృత్తిలో వుందో ఆ వృత్తిలోనే తరతరాలుగా మ్రగ్గిపోవాలి. అందుకే శూద్రులకు చదువు నిషేధించారు. వేదాలు వింటే ఆ శూద్రుల చెవుల్లో సీసం కరిగించి పోసే శిక్ష విధించారు. సనాతన ధర్మాన్ని ఈ కాలంలో పాటిస్తే? రాజ్యాన్ని కాపాడవలసిన క్షత్రియుల స్థానంలో వివిధ కులాలకు చెందిన సైనికులు సైన్యంలో వుండకూడదు. మంత్రులుగా వుండాల్సిన బ్రాహ్మణుల స్థానంలో శూద్రకులాలకు చెందిన బి.సిలు ప్రధానమంత్రిగా, ముఖ్యమంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా వుండకూడదు. కనుక 'సనాతనధర్మం పరిరక్షణ బోర్డు' వుంటే దాని ఆవశ్యకత గురించి మైకులు బద్దలుకొట్టే వారికే ప్రమాదం.

సనాతనధర్మాన్ని ప్రబోధించే వేదాలను బహుజన దృక్పథంతో పరిశీలిస్తే, ఈనాటి అనేక సామాజిక అవ్యవస్థలకు మూలాలు వాటిలో చూస్తాం. క్లుప్తంగా చెప్పాలంటే, నిచ్చెనమెట్ల కులవ్యవస్థ (వర్ణవ్యవస్థ); యజ్ఞయాగాలు, కర్మకాండలు; స్త్రీలు, శూద్రుల బానిసత్వం మొదలగునవి. ఇవన్నీ పాటించాలా? ఇందుకేనా సనాతన ధర్మం పరిరక్షణ?

ఆర్.ఎస్.ఎస్ అధినేత మోహన్‌భగవత్ 'సనాతనధర్మం' అనేది భారతదేశానికి పర్యాయపదం అంటున్నాడు. శాశ్వతమైనది, ఏనాటికీ మారనిది అని చెప్పే సనాతన ధర్మానికి భారతదేశానికి పర్యాయపదం అంటే ఎలా అంగీకరిస్తాం?

మనం ఈనాడు మనుస్మృతిని ధిక్కరించి, కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నాం. ఇవి విరివిగా చేస్తే కులం లేని సమాజం భవిష్యత్తులో ఏర్పడుతుంది.

ప్రజలను నిరంతరం ఏదో ఒక ద్వేషపూరిత ఉన్మాద వాతావరణంలో వుంచి వారి మధ్య అనైక్యతలను సృష్టిస్తూ పాలక ప్రభువులు దోపిడీని యధేచ్ఛగా సాగించుకోవటం వలస పాలన కాలం నుండీ జరుగుతున్నదే. వాస్తవాలను దాచి ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రజల మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతూ హిందూత్వ ఓటు బ్యాంకును సుస్థిరం చేసుకోవాలని భాజపా మత విద్వేషాన్ని సృష్టించటమే రాజకీయంగా నడిపిస్తుంది.

హిందూ విలువలు పేరుతో పరమత ద్వేషాన్ని రగుల్కొల్పుతున్నారు. నేడున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభ పరిస్థితుల్లో పాలక ప్రభువర్గాన్ని గట్టెక్కించటానికీ, ప్రజలను మూఢత్వంలో నింపుతూ నిస్తేజంగా నిలిపే పనిని సనాతన ధర్మకర్తలమంటూ భుజాలపై ఎత్తుకున్నారు.

ప్రజల పక్షాన ప్రశ్నించిన స్టాన్ స్వామి, జె.ఎన్. సాయిబాబాలను ఏళ్ళ తరబడి నిర్బంధించి శిక్షించిందీ, నరేంద్ర ధబోల్కర్, గౌరీలంకేష్ హత్య చేసిన నిందితులకు బెయిల్ ఇవ్వడం, బిల్కిస్‌బానో సంఘటనలో దోషులకు బెయిలివ్వటం, విడుదలైన నిందితులను ఊరేగింపులతో,

సన్మానాలతో సత్కరించిందీ సనాతనధర్మవాదులే. బాబా వేషంలో వున్న నేరస్థుడు డేరాబాబాకు అనేకసార్లు బెయిలిచ్చిందీ సనాతన ధర్మకర్తలే. నేరాలూ ఘోరాలూ చేస్తున్నదీ అఘోరాల సంస్కృతిని వ్యాప్తి చేస్తున్నదీ సనాతన ధర్మమే. సనాతన ధర్మం ప్రజల ప్రజాస్వామిక విలువలను కాలరాస్తుంది.

దోపిడీ వర్గ సమాజంలో పీడించబడుతూ అణచివేయబడుతూన్న ప్రజానీకం సమానత్వం కోసం, సమసమాజం కోసం పోరాడుతూ, ఆ పోరాటాల క్రమంలో సాధించుకున్న ప్రజాస్వామిక హక్కులను, జీవించే హక్కును కూడా కాలరాస్తూ పాలకులు అనుసరిస్తూన్న సనాతన ధర్మం పేరిట కాలం చెల్లిన ఫ్యూడల్ విలువలను కాపాడుతూ వున్న విధానాల నిజస్వరూపాన్ని ప్రజలకి తెలియచేద్దాం. నిర్భంద చట్టాల పేరుతోనూ, భావజాల పరంగా మతాచారాల పేరుతోనూ ప్రజలపై సాగుతున్న అణచివేతకు, మత విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజల్ని సంఘటితపరుద్దాం.

**"ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి వున్నాయో తెలుసుకోనంతకాలం ప్రజలు మోసపోతూనే వుంటారు" - లెనిన్** •

---

## స్వాతంత్ర్ర ఉద్యమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పాత్ర అద్వితీయం...

**భా**రత స్వాతంత్ర్ర ఉద్యమంలో విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల పాత్ర అద్వితీయం అని తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగయ్య తెలిపారు. విశాఖపట్నంలోని సిపిఐ కార్యాలయంలో 29.3.26 ఆదివారం నాస్తిక సమాజం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభ ఘనంగా జరిగింది. సభలో "స్వాతంత్ర్ర ఉద్యమం భగత్‌సింగ్ చేసిన నిర్మాణాత్మక కృషి - నేటి ఆవశ్యకత" అనే అంశంపై అంబటి నాగయ్య మాట్లాడుతూ - ఆనాడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు నినదించిన విప్లవం వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి వంటి నినాదాలు ఇప్పటి పాలకులకు వ్యతిరేకంగా ఉన్నాయని, అందుచేతనే ప్రశ్నించే వారందరిని విప్లవకారుల పేరుతో చంపుతున్నారన్నారు. సామ్రాజ్యవాదులకు దేశ సంపదను అప్పగిస్తూ, కార్మిక చట్టాలను వారికి అనుకూలంగా మార్చి కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ భగత్‌సింగ్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ మహాద్ చెరువు పోరాటం, మనుస్మృతి దహనం వంటివి భగత్‌సింగ్ పై ప్రభావం చూపించాయని, అందుచేతనే అంటరానితనం లేని సమాజం రావాలని కోరుతూ ఉరికి ముందు దళిత మహిళ వండిన ఆహారం తిని భగత్‌సింగ్ ఉరికంభం ఎక్కారని తెలిపారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా హిందూ మతోన్మాదంపై జరుగు పోరాటంలో భాగస్వామ్యం కావడమే భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. రెండవ సెషన్‌లో సామ్రాజ్యవాదం - యుద్ధం అనే అంశంపై రిటైర్డ్ ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె. విజయకుమార్ మాట్లాడుతూ - సామ్రాజ్యవాదం అంటే ఆధిపత్యం అని, అందుకోసమే ఇజ్రాయిల్, అమెరికా కలిసి ఇరాన్‌పై దాడిచేస్తూ చిన్నపిల్లలని చూడకుండా హత్యలు చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించే వారిని లేకుండా మార్చి 31 కల్లా దేశంలో విప్లవకారులను చంపి శాంతి నెలకొల్పుతామని అమిత్‌షా చెప్పుతున్నారన్నారు. దేశంలో నెలకొని ఉన్న ఆకలి, నిరుద్యోగం, అందరికి ఆరోగ్యం, విద్య వంటి సమస్యలు పరిష్కరించడంతోనే శాంతి నెలకొల్పడం జరుగుతుందని స్పష్టం చేశారు. నాస్తిక సమాజం జిల్లా నేత ఎం.ఎన్. బుద్ధ అధ్యక్షతన జరిగిన సభలో భౌతికవాది రాం ప్రభు, భారత నాస్తిక సమాజం అధ్యక్షులు జీడి సారయ్య, చార్వాక ఆశ్రమం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణుల లక్షణాలు, భౌతిక ప్రేరణలు

– డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్

**భ**గవంతుడి సృష్టి గురించి ఆలోచించడం మానేస్తే, ప్రపంచంలో ఇన్ని రకాల ప్రాణులెందుకు పుట్టాయో, వాటికి ఇన్ని రకాల శరీర లక్షణాలు ఎలా ఏర్పడ్డాయో ఊహించుకోవచ్చు. తొలిసారిగా ఆవిర్భవించినప్పటి నుంచీ జీవపదార్థమూ, జీవరాశీ ఎప్పుడూ భౌతిక పరిస్థితులకు అనుగుణంగానే మారుతూ ఉండేవి. భౌతిక కారణాలూ, ప్రేరణలూ లేకుండా ఏ మార్పూ జరగలేదు. 'దైవశాసనాలు' అమలైనట్టు దాఖలాలు లేవు. చిన్న చిన్న విషయాల్లో కూడా ఇది స్పష్టమౌతుంది. పైనున్న వీపు భాగం ముదురు రంగుతోనూ, కింది పొట్ట తేలిక రంగుతోనూ అనేక రకాల చేపలు కనబడతాయి. ఇందుకు కారణం పైన ఎగిరే పక్షులకు ముదురురంగులో నీటిలో ఈదుతున్న వాటిని గుర్తించడం కష్టం. వాటికి ఎర అయే చిన్న చేపలకూ కింద ఈదుతున్నప్పుడు తేలిక రంగు గుర్తించడం కష్టం. యాదృచ్ఛికంగా జన్యుపరమైన మ్యుటేషన్ల వల్ల ఒక్కొక్క తరంలోనూ ఎన్నో రకాల రంగులున్న చేపలు పుడతాయి. వీటిలో మిగిలేవి ఎటువంటివో నిర్దేశించేవి బాహ్య పరిస్థితులే. ఒకరకమైన శరీర లక్షణాలు ఏర్పడ్డాక అవే వాటి సంతానానికి సంక్రమించే అవకాశం ఎక్కువ. తమను తాము అపాయం నుంచి కాపాడుకుంటూ, తమకు అవసరమైన ఆహారాన్ని తేలికగా సంపాదించుకుంటూ బతకడానికి అవసరమైన రంగులు ఆ చేపలకు దక్కాయి. ఇలాంటిది లేని చేపలు అంతరించిపోయాయి.

కొన్ని సంఘటనల్లో ఇలాంటి మార్పులకు మనిషి ప్రమేయం కూడా ఉంటుందని చెపుతూ కార్ల్ సేగన్ ఒక విషయం ప్రస్తావించాడు. జపాన్ దీవుల్లో ఒక చోట వీపు మీద సామురాయ్ యోధుల మొహాల డిజైన్ కలిగిన ఎండ్రకాయలు విరివిగా దొరుకుతాయట. సామురాయ్ యోధులంటే అక్కడివారికి ఎంతో గౌరవం కనక అలాంటివి దొరికినప్పుడల్లా జాలర్లు వాటిని చంపకుండా మళ్ళీ సముద్రంలో వదులుతారట. ఎండ్రకాయల వీపు మీద ఉండే మచ్చలు జన్యువుల నిర్మాణాన్ని బట్టి రకరకాలుగా రూపుదిద్దుకుంటాయి. వాటిలో కొన్నిటికి యాదృచ్ఛికంగా సామురాయ్ యోధుల మొహాల డిజైన్ ఏర్పడడంతో వాటి ప్రాణాలు దక్కాయి. ఇతర డిజైన్లున్న పీతలన్నీ ఆహారం అయిపోయాయి. ఆ విధంగా ఎంతో కాలంగా జరుగుతూండటంతో ఈ మార్కు పీతల జనాభా ఎక్కువగా పెరిగి ఆ లక్షణాలు బలపడే అవకాశం కలిగింది. ప్రకృతిలో ఈ మచ్చల రూపం అనేక రకాలుగా మారుతూ ఉంటుంది.

మనిషి తన స్థానిక సంస్కృతిని బట్టి మంచీ, చెడూ అనుకుంటూ ఆ మార్పుల్లో జోక్యం కలిగించుకున్నాడన్నమాట.

ఇంగ్లండ్లో పారిశ్రామిక యుగం మొదలు కానప్పుడు తెల్లని బెరడున్న చెట్లమీద తెల్లని సీతాకోక చిలకలు వాలుతూ ఉండేవట. వాటిని తినే పక్షులకు వాటిని గుర్తించడం కష్టం అయేది. బొగ్గు, ఆవిరియంత్రాలు రావడంతో త్వరలోనే ఇంగ్లండ్ పరిసరాలన్నీ మసిబారడం, చెట్లన్నీ నల్లబడడం జరిగిందట. ఈ విప్లవం వల్ల ఎవరికి మేలు జరిగినా తెల్లని సీతాకోక చిలకలన్నీ పక్షులకు బలైపోయాయి. ఇక మిగిలినవి నల్లనివి మాత్రమే. తెల్లనివాటి స్థానంలో నల్లనివి ప్రత్యక్షం కావడం ఆనాటి శాస్త్రవేత్తలు కళ్ళారా చూసి పరిణామవాదాన్ని అర్థం చేసుకోగలిగారు. పైన చెప్పిన పీతల్లాగే ఇది కూడా మనిషి జోక్యం వల్ల కలిగిన మార్పు.

మనిషి జంతువులని మచ్చిక చేసుకోవడమూ, వ్యవసాయమూ మొదలు పెట్టాక ప్రకృతిలో జోక్యం చేసుకోవడం మొదలయింది. ఈనాడు క్లోనింగ్ గురించి ఆందోళనపడి హడావిడి చేస్తున్నవారు ఈ విషయాలు కూడా గుర్తుంచుకోవాలి. మొదట కుక్కలనూ, తరువాత మేకలు, పశువులనూ మచ్చిక చేసుకున్న ఆదిమానవులు వాటిలో మంచివీ, సౌమ్యంగా ఉండే జాతులను ఎంచుకున్నారు. పొగరుబోతులనూ, 'తిరుగుబాటు' లక్షణాలను కలిగినవాటిని చంపేస్తూ వచ్చారు. మిగిలినవాటి సంతతికి అవే లక్షణాలు వచ్చాయి. ఈ విధంగా మనుష్యులకు అనువైనవీ, పనికివచ్చేవీ మాత్రమే పెంపుడు జంతువులయాయి. వ్యవసాయానికి ముందు ఏరుకుతినే దశలో మైదానాల్లో మొలిచే గింజలనే మనుష్యులు తిన్నారు. వ్యవసాయం మొదలయాక వాటిలో మంచివాటిని ఎంపికచేసి "నారు" పొయ్యడం ప్రారంభమైంది. ధాన్యాలేకాదు, కూరగాయలూ, తినడానికి పనికొచ్చే జంతువులూ అన్నీ ఎంపిక చెయ్యబడ్డాయి. దీనికీ, క్లోనింగూ పెద్దగా తేడా లేదనుకోవాలి. ఈ ఉదాహరణలన్నీ ప్రకృతిలో జరిగే పోటీలకు మనుష్యులు అడ్డుపడిన సంఘటనలే.

ఎన్ని కోట్ల సంవత్సరాల క్రితమైన ప్రాణుల శారీరక లక్షణాలు ఇటువంటి పోటీతత్వం వల్లనే మార్పులు చెందుతూ వచ్చాయి. కొన్ని వేల సంవత్సరాల కొకసారి వచ్చే హిమయుగాలూ, ఆకస్మాత్తుగా ఎగిసిపడే అగ్ని పర్వతాలూ స్థానికంగా ఎంతో ఉత్పాతాన్ని కలిగించాయి. ఉష్ణోగ్రతలోనూ, తేమలోనూ కొద్దిపాటి మార్పులు జరిగినా తట్టుకోలేని చిన్న జీవాలూ, క్రిమికీటకాలూ ఎన్నో వాటిని తింటూనో, వాటి మీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడే పెద్ద జంతువులు అంతరించిపోయే ప్రమాదం ఎల్లప్పుడూ ఉండేది. ప్రకృతిలోనూ, ఇతర ప్రాణులతోనూ ఎప్పటికప్పుడు పోటీపడుతూ తట్టుకోవడానికి అనుగుణమైన లక్షణాలున్న జీవాలు బతికాయి. ఇది చెట్ల విషయంలోనూ కనబడుతుంది. పెద్ద చెట్టు ఏ తుపానువల్లనో పడిపోయాక దాని నీడలో ఇంతకాలము ఎదగలేని గడ్డి, పిచ్చి మొక్కలూ ఎండ తగిలి ఏపుగా పెరుగుతాయి. మొక్కలు మనిషితోనూ పోటీపడగలవు. వాడకుండా పాడుపెట్టేసిన ఇళ్ళలోకి మొక్కలూ, తీగలూ పెరిగి అల్లుకోవడం మనకు తెలిసినదే.

భూమిమీద ప్రాణులు ఎలాంటి పరిణామాలకు లోనయాయి? దీనికి స్పష్టమైన సమాధానం లేదు. ఉన్నదల్లా శిలాజాల సాక్ష్యమే. ఉదాహరణకు మొప్పలున్న చేపల గురించి బోలెడు సమాచారముంది. అలాగే కాళ్ళున్న తొండలవంటి ఉభయచరాల గురించీ తెలిసింది. మరి బురద నీరు ఎండిపోవడంతో తప్పనిసరి అయి నేలమీద అడుగు పెట్టిన మొదటి కాళ్ళున్న చేప మాట ఏమిటి? అరుదైన దాని శిలాజం ఈ మధ్యనే దొరికిందట. •




34వ జాతీయ నాస్తికమేళాలో 'మనిషితనం తప్ప ఏమీ తెలియని ఒట్టి చేతల మనిషి' పుస్తకావిష్కరణ దృశ్యం

చర్చ:

# వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి-హోమియోపతి

(గత సంచిక తరువాయి)

**– మంజీర**

**శ**రీరతత్వం అని చెప్పుకుంటున్నప్పుడు, దాని ప్రాముఖ్యత అర్థం చేసుకోవలసినదే. మలేరియా దోమలు ఏ ప్రాంతంలో వుంటే, ఆ ప్రాంతంలో అందర్నీ కరుస్తాయి. కాని అందరికీ మలేరియా రాదు. కొందరికి ఎన్ని దోమలు కరచినా మలేరియా రాదు. మలేరియా క్రిములు వారి శరీరంలో ప్రవేశించక కాదు, ప్రవేశించినా అవి ఏమీ చేయలేవు. ఎప్పుడూ జ్వరం రాని వారు కొందరైతే, ప్రాంతాలు మారడం వల్ల రావడం, లేదా రాకపోవడం జరిగేవారు కొందరు. అమీబియాసిస్, టైఫాయిడ్, టిబి వంటి అన్ని విషయాలలో దీనిని గుర్తించవచ్చు. కాబట్టి క్రిముల వల్లనే జబ్బులొస్తాయనేది కాక, వ్యాధికి జీవశక్తి లొంగిపోయిన సందర్భాల్లోనే జబ్బు లొస్తాయని అర్థం చేసుకోవాలి. గత 10 సం॥లలో విరోచనాలపై ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) చేసిన పరిశోధనలు ఈ విషయాన్నే నిర్ధారించాయి. పిల్లల డయేరియాకి  కారణమని భావించే 26 రకాల బాక్టీరియా, వైరస్ క్రిములను WHO పరిగణనలోకి తీసుకోలేదు. చిన్న ప్రేగులకు గల ప్రత్యేక వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడమే వ్యాధికి కారణంగా అభిప్రాయపడ్డారు. వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోవడంతో మామూలుగా చిన్నప్రేగుల ద్వారా స్వీకరించే లవణాలను, చక్కెరలను శరీరం స్వీకరించలేకపోతున్నది. ఇదే విరోచనాలకు కారణం. నోటి ద్వారా సోడియం లవణం, గ్లూకోజ్ నీటినిచ్చి, దేహానికి సహజమైన వ్యాధి నిరోధక శక్తిని పెంచి – విరేచనాలను నివారించ గలుగుతున్నారు. ఇది సులభమైన పద్ధతి. ఈ పద్ధతి ప్రచారంలోకి వచ్చాక ఆసుపత్రికి వచ్చే డయేరియా కేసులు బాగా తగ్గిపోయాయి. వ్యాధులకు కారణం క్రిములు కాదు. సహజమైన వ్యాధి నిరోధక శక్తి తగ్గి జీవశక్తి లొంగిపోవడమే వ్యాధికి మూలకారణమని రెండు శతాబ్దాల క్రితమే డా॥ హానిమన్ సిద్ధాంతీకరించి హోమియోపతి వైద్యాన్ని ప్రవేశపెట్టారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ పరిశోధన ఫలితాలు చివరికి డా॥ హానిమన్ వాదాన్నే సమర్థిస్తున్నాయి. శరీరతత్వం గురించి ఇంకా చెప్పాలంటే, కొందరికి నీటిలో తడిసినప్పుడు జలుబు చేస్తుంది. కొందరికి చలిగాలి పడదు. కొందరు ఎన్ని పచ్చిమిరప కాయలైనా తింటారు. కొందరికి ఒకటి తిన్నా విరేచనాలు అవుతాయి. ఆదివాసీ ప్రాంతాలకు పోతే చిన్నా పెద్దా అందరూ పొగాకు తింటారు. అక్కడ కూడా కొందరికి పొగాకు వాసన అంటేనే గిట్టదు. ఇలా అనేక రకాల శరీర తత్వాలున్నాయి. దీనిని బట్టే జీవశక్తి ప్రతిస్పందన కూడా వుంటుంది.

ఈ విషయం రోగులను పరిశీలించినపుడు అర్థమవుతుంది. ఒకే వ్యాధి, వ్యాధిగ్రస్తులలో వేర్వేరు లక్షణాలతో కనిపిస్తుంది. మలేరియా అందరిలో ఒకే లక్షణాలతో వుండదు. అలాగే అందరికీ ఒకే పీరియడ్‌లో రాదు. 15, 30, 60 రోజులకు వచ్చేవారు, ఏడాదికోసారి వచ్చే వారు వున్నారు. కొందరిలో రోజూ జ్వరం వస్తే, కొందరిలో రోజు విడిచి రోజు వస్తుంది. తలనొప్పి ఒకటే, కాని అందులో నడినెత్తిన వచ్చే తలనొప్పి, నుదుటిలో వచ్చేది, తలవెనుక

వచ్చేది, ఒక వైపు వచ్చేది, ఉదయం వచ్చేది, సాయంత్రం ఇందులో కొందరికి పడుకుంటే ఉపశమనం వుంటే, కొందరికి చల్లనీళ్ళతో ముఖం కడిగితే ఉపశమనం వుంటుంది. ఇలా చెప్తూ పోతే ఎన్నెన్నో, ప్రత్యేకతలు. ఈ నిర్దిష్టతలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటేనే సరైన మందు కనుక్కోగలమనేది హోమియోపతి పద్ధతి. ఈ లక్షణాలతో సారూప్యమైన మందే రోగాన్ని సత్వరంగా, సురక్షితంగా, శాశ్వతంగా, సున్నితంగా నిర్మూలించగలుగుతుంది. హోమియోపతి వైద్యుడు ఈ ప్రత్యేకతలు తెలుసుకోడానికి ఆరాటపడతాడు. అవి తెలిస్తేనే సరైన మందు ఎంపిక చేయగలననుకుంటాడు. సరిగ్గా ఇక్కడే – అలోపతి వైద్యుడు రోగి చెప్పినా గాని ఇటువంటి లక్షణాలను పట్టించుకోడు. తెలుసుకున్నా వాళ్ళకు అవి నిరుపయోగమైనవే. అందుకనే అలోపతి డాక్టరుకు తలనొప్పి రోగి మాత్రమే వుంటాడు. అదే హోమియోపతి డాక్టరుకు తలనొప్పి రోగులలో బ్రయోనియా, బెల్లడోనా, జెల్సీమియం ఇలా వేర్వేరు రకాల రోగులు వుంటారు. అలోపతి లాగ హోమియోపతి కాటలాగ్ వైద్యం కాదు.

ఈ ప్రత్యేకతల గురించి మరికొన్ని విషయాలు చెప్పవలసి వుంది. కొందరికి పడుకోగానే చెమట పట్టడం లేదా ఊపిరి అందకపోవడం వుంటుంది. కాని లేచికూర్చుంటే మామూలుగానే వుంటుంది. చల్లదనం గిట్టని వ్యక్తికి తలనొప్పి వచ్చినప్పుడు, తల చల్లదనాన్నే కోరుకోవచ్చు. కాస్టికం రోగికి దగ్గినప్పుడు మూత్రం బయటికి వస్తుంది. స్ట్రామోనియం రోగి అతిగా, ఆపకుండా మాట్లాడుతాడు. బెల్లడోనా రోగికి తలనొప్పికి ముందు కళ్ళు చీకట్లు కమ్ముతాయి. ఇలా కొట్టొచ్చినట్లు కనపడే లక్షణాలను 'కీనోట్స్' అంటారు. ఇటువంటి వాటికి, మిగిలిన లక్షణాలతో పని లేకుండానే మందు ఇచ్చి చూడవచ్చు. ప్రత్యేక లక్షణాలను బట్టి ఎంపిక చేసిన మందు తప్ప, మరేమందు ఆ వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించజాలదు.

హోమియో వైద్యులు ఒకే మందు అందరికీ యిచ్చే సందర్భాలు కూడా వుంటాయి. ఎపిడమిక్స్ వ్యాపించినప్పుడు, మెజారిటీ లక్షణాలు ఒకే విధంగా వుంటాయి. అప్పుడు ఆ లక్షణాల ఆధారంగా మందు ఎంపిక చేసి ఆ ప్రాంత మంతటా పంచవచ్చు. అప్పుడు కూడా కొన్ని ప్రత్యేక కేసులు వుంటాయన్నది వైద్యుల దృష్టిలో వుండాలి. పిచ్చివాళ్ళ కేసులలో 1/3వంతు కేసులను విరేత్రం ఆల్బం ద్వారా తగ్గించవచ్చు అని డా॥ హానిమన్ చెప్పాడు. అలాగే కారణం ఒకటే అయినప్పుడు కూడా ఒకే మందు ఇవ్వవచ్చు. ఎండాకాలం మూత్రం మంట సాధారణం. అప్పుడు అందరికీ కేంథారిస్ ఇవ్వవచ్చు. సీజన్లలో వచ్చే జబ్బులకు మందు ఎంపిక చేసి అందరికీ ఇవ్వవచ్చు. గాయాలు, ప్రమాదాలు, విష పురుగుల కాట్లు మొదలైన వాటన్నిటికీ ఒకే మందు ఇవ్వవచ్చు. తలపై దెబ్బ తగిలి, తలనొప్పి రావచ్చు, పిచ్చిరావచ్చు, బ్రెయిన్‌డెత్ కావచ్చు. ఈ మూడు సందర్భాలలో కారణం ఒకటే కాబట్టి ఒకే మందు ఇవ్వవచ్చు. ఈ రకంగా వందలమంది ప్రాణాలను సులభంగా రక్షించవచ్చు. ముఖ్యంగా కలరా వంటి వ్యాధుల్లో హోమియోపతి రికార్డులు నెలకొల్పింది. 1836 వరకు ఆస్ట్రియాలో హోమియోపతిపై చట్టరీత్యా నిషేధం వుండేది. ఆ సం॥లో కలరా వ్యాధి సోకి, హోమియోపతి చికిత్స పొందినవారు, అలోపతి వైద్యం ద్వారా చికిత్స పొందిన వారికన్నా చాలా తక్కువ మంది మరణించడంతో, చట్టాన్ని మార్పుచేసి, హోమియోపతిని అనుమతించారు.

ప్రత్యేకతలను పరిగణనలోకి తీసుకునే మందే శాస్త్రీయమైనది. అది ఒక్క సారూప్య పద్ధతిలోనే సాధ్యమవుతుంది. హోమియోపతి శాస్త్రీయ దృక్పథానికి ఇది మరో నిదర్శనంగా వుంటుంది.

## ఆరోగ్యవంతులపై మందుల నిరూపణ ఒక ప్రత్యేకత

వ్యాధి నిర్ధారణకు మానసిక, శారీరక లక్షణాలనన్నిటినీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు వాటికి సారూప్యమైన మందును కనుగొనడం ఎలా అన్న సమస్య ఇప్పుడు మన ముందుకు వస్తుంది. మందు కనుగొనడమన్నది ఎక్కడైనా ముందుగా జరిగే పరిశోధనల వల్లనే సాధ్యం. అయితే అందుకు హోమియోపతి పద్ధతి ఏమిటన్నదే మనం తెలుసుకోవలసినది.

"వ్యాధిలో తారట్లాడుతున్న ప్రేరేపక కారణాన్ని గాని, వర్తమాన కారణాన్ని గాని తొలగించే పనిలేదు కాబట్టి, రోగిలో మనం గమనించడానికి లక్షణాలు తప్ప మరేమీ దొరకవు. వ్యాధి నివారకమైన ఔషధాన్ని పట్టుకోడానికి ఉపకరించేది ఈ లక్షణ సముదాయం. ఈ లక్షణ సముదాయం వ్యాధి అంతర్గత స్వభావానికి అంటే బాధలకు లోనైన ప్రాణశక్తికి ప్రతిబింబం, ఇదే వ్యాధి రూపం. ఇదే నివారక ఔషధాన్ని తెలుసుకోడానికి ఏకైక సాధనం అయితీరాలి." – సూత్రం 7, ఆర్గనాన్, డా॥ హానిమన్.

"మందులు నివారక శక్తి కలిగియున్నవి కనుకను, తత్ఫలితముగ ఆరోగ్యవంతులందును, వ్యాధి పీడితులందును మార్పును కలిగించగల శక్తి గలిగియున్నవి కనుకను అవి ఆరోగ్యవంతుల మీద పనిచేయుటలో చాలా లక్షణములను, వ్యాధి సంబంధమగు బాధలను, ఆరోగ్యస్థితి నుండి విభిన్నమగు మార్పులను తప్పక కలిగించవలయును." – డా॥ హానిమన్

రోగలక్షణ సముదాయం అన్నది జీవశక్తి పరిభాష, తనకు ఎటువంటి మందు కావాలో జీవశక్తి మనస్సు, శరీరం ద్వారా ప్రకటించినప్పుడు, ఏది మందుగా సరిపోతుందో తిరిగి అదే జీవశక్తిని అడగాలి. ఇది సులభంగా అర్థం కావడానికి డా॥ హానిమన్ మొదట కనుగొన్న పద్ధతిని చూద్దాం. తన కాలం నాటికి వున్న వైద్య విధానాన్ని అనాగరికంగా వుందని వదలిపెట్టిన డా॥ హానిమన్ జీవనం కొరకు తనకున్న వివిధ భాషల పాండిత్యం వలన వైద్యగ్రంథాల అనువాదకునిగా మారాడు. ఆ క్రమంలో ఒక 'వస్తు గుణదీపిక' లో సింకోనా బెరడు కషాయం అన్నకోశానికి టానిక్‌లా పనిచేస్తుందని రాసిన విషయాన్ని పరిశీలించడానికి, తానే స్వయంగా సింకోనా బెరడు కషాయం తాగడం ప్రారంభించాడు. కొన్ని రోజులకు ఆయనకు మలేరియాను పోలిన జ్వరం వచ్చింది. కషాయం తాగడం ఆపగానే తగ్గిపోయింది. ఆరోగ్యవంతునిలో మలేరియాను కలిగించిన సింకోనా బెరడు అప్పటికే మలేరియాకు మందుగా వాడబడుతున్నది కూడా. ఈ సింకోనా బెరడు ప్రయోగం డా॥ హానిమన్‌లో ఒక మెరుపులాంటి ఆలోచన కలిగించింది. సింకోనా బెరడు ఆరోగ్యవంతునిలో మలేరియాను కలిగిస్తే, మలేరియా రోగిలో దానిని నిర్మూలిస్తుంది. ఇటువంటి ప్రయోగం అనేక పదార్థాలపై నిర్వహించిన తర్వాత డా॥ హానిమన్ ఒక సూత్రాన్ని రూపొందించాడు. "ఒక మందు ఆరోగ్యవంతులలో ఏ లక్షణాలనైతే కలిగిస్తుందో, అవే లక్షణాలు కలిగిన రోగిలో వాటిని నిర్మూలిస్తుంది కూడా". దీనినే సారూప్యౌషధ సూత్రం అంటారు.

చెట్టు నుండి రాలిన యాపిల్ న్యూటన్‌కు గురుత్వాకర్షణ సూత్రాలు నేర్పినట్లుగా, చర్చిలో వేలాడే లాంతరు గెలీలియోకు లోలక సూత్రాన్ని ప్రబోధించిన విధంగా, సింకోనా ప్రయోగం డా॥ హానిమన్‌కు సారూప్యౌషధ సూత్రాన్ని ప్రబోధించింది. వివేక యుగమైన 18వ శతాబ్దంలో సకల శాస్త్రాలు విప్లవాత్మక మార్పులకు గురవుతుండగా, వైద్యశాస్త్రం ఇంకా అంధకారంలోనే మునిగి వుండింది. వైద్య విజ్ఞానానికి శాస్త్రీయమైన, ఆధునికమైన ప్రయోగ పద్ధతిని సమకూర్చిన ఘనత డా॥ హానిమన్‌కు దక్కింది. ఆయన వివేక యుగమైన 18వ శతాబ్దం చివరి భాగంలోనూ, అభ్యుదయ యుగమైన 19వ శతాబ్దపు ప్రారంభంలోనూ జీవించి ఆ రెండు యుగాల ఉత్తమ లక్షణాలు పుణికి పుచ్చుకున్న మహావ్యక్తి. 1790 నుండి డా॥ హానిమన్ తాను కనుగొన్న సూత్రం ఆధారంగా అనేక ప్రయోగాలు, అధ్యయనాలు జరిపి 1796లో ఒక వైద్య పత్రికకు రాసిన వ్యాసంలో ఈ ఆధునిక వైద్య సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించాడు.

కాబట్టి సారూప్యమైన మందును కనుగొనాలంటే, ముందుగా ఆరోగ్యవంతులపై ప్రయోగాలు జరపాలి. నవీనమైన, శాస్త్రీయమైన ఈ పద్ధతిని డా॥ హానిమన్ స్వయంగా తన మీదనే ప్రయోగించడం ద్వారా ప్రారంభించాడు. మందుల వ్యాధి నివారకశక్తిని కనుగొనడంలో ఇది అత్యుత్తమ పద్ధతి, అత్యాధునిక పద్ధతి. డా॥ హానిమన్, ఆయన అనుచరులు మూలికలు, వనర్లు, ఖనిజాలు,. లవణాలు, విషాలు, రోగమలినాలు, లోహాలు, రసాయనాలు – ఇలా అనేక పదార్థాలు ఆరోగ్యవంతులపై ప్రయోగించి, అవి కలిగించే లక్షణాలనన్నిటినీ రికార్డు చేసారు. డా॥ హానిమన్ వాటిని 'స్వచ్ఛమైన వస్తుగుణ దీపిక' పేరుతో ప్రచురించాడు. ఇప్పటికి 3వేలకు పైగా 'మందులు నిరూపించబడి, రికార్డులో వున్నాయి. ఈ ప్రయోగాలు ఎంత విస్తృతంగా జరిగాయంటే ఎవరైనా ఒక లక్షణం చెబితే, అది కనబడకపోవడం అత్యంత అరుదైన విషయం. ఇప్పటి వరకు ఇతర వైద్య విధానాలు అవలంబిస్తున్న పద్ధతులలో మందుల వ్యాధి నివారక శక్తిని చాలా పరిమితంగానే కనుగొనగలం. హోమియోపతి పద్ధతి వల్ల మందుల వ్యాధి నివారక శక్తి ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో కచ్చితంగా, సంపూర్ణంగా నిర్ధారణ చేయగలం. ఈ పద్ధతిలో వేలాది మందులను ముందుగానే పరిశోధించి వుండడం వలన, ఇప్పటికే ఉనికిలో వున్న జబ్బులకే కాక, కొత్తగా వచ్చే మాడ్‌కీ డిసీజ్, ఎయిడ్స్ వంటి వాటికి కూడా మందును సారూప్యమైనది ఎంపిక చేయగలం. డా॥ హానిమన్ కలరాను ఎన్నడూ చూడకపోయినా, విన్నదాన్ని బట్టి మందులను సూచించాడు. ఆ మందులే నేటికీ ఉపయోగపడుతున్నాయి. హాంగ్‌కాంగ్‌లో కొన్ని సంవత్సరాల కిందట కోళ్ళ ద్వారా వ్యాపిస్తున్న వైరస్ ఫ్లూను నిర్మూలించలేక, లక్షలాది కోళ్ళను చంపారు. హోమియోపతి అటువంటి పరిస్థితిని సులభంగా చక్కదిద్దగలదు. అల్లోపతిలో ఇప్పుడు ఉనికిలో వున్న జబ్బులలోనే సగం వాటికి మందులు లేవు. హోమియోలో అన్ని జబ్బులకు మందులుండడం దాని పద్ధతి వల్లనే సాధ్యమైంది. మానవులపైనే ప్రయోగించినవి కావడంవలన హోమియో మందులు నిరపాయకరమైనవి కూడా. ఈ పద్ధతివల్ల ఏ రోగికి ఏ మందు కావాలనేది కచ్చితంగా నిర్ధారించగలం. అది మరేవైద్యంలోనూ సాధ్యంకాదు. అయితే ఇక్కడ స్వీయమానసికతకు తావులేదు. మందు సారూప్యమైనదైతేనే కచ్చితంగా, సత్వరంగా,

శాశ్వతంగా రోగాన్ని నిర్మూలిస్తుంది. సారూప్యం కానిదైతే ఉపశమనాన్నే కలుగజేస్తుంది. లేదా అసలు ప్రభావం చూపించదు. కాబట్టి హోమియో వైద్యుని అపజయం అతనిదే తప్ప, హోమియోపతి సిద్ధాంతానిదికాదు. (మార్క్సిజం ఓటమికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది కదా!) మందుల పూర్తిశక్తిని ఉపయోగించుకోవడం, హోమియోపతి పద్ధతి వల్ల మాత్రమే సాధ్యం.

**ఒకే వ్యాధి నివారకం (మందు) హోమియోపతి పద్ధతి**

వ్యాధి నిర్ధారణలో హోమియోపతి పద్ధతి మానసిక, శారీరక లక్షణ సముదాయాన్నంతటినీ పరిగణనలోకి తీసుకోవడం అని చెప్పుకున్నాం. ఒకే వ్యాధికారకం నుండి ఈ లక్షణాలన్నీ వచ్చినప్పుడు, ఈ లక్షణాలన్నిటికీ సరిపోయే ఒకే ఒక సారూప్యమైన మందును (సింగిల్ రెమిడీ) ఇవ్వాలనేది హోమియోపతి అవగాహన. అల్లోపతిలో రోగలక్షణాలకు దేనికి దానికి విడిగా మందు ఇవ్వడం జరుగుతుంది. ఈ లక్షణాలన్నీ ఒకే మూలం నుండి వచ్చినవని గుర్తించినప్పటికీ కూడా, అల్లోపతి అనుసరించే వైరుధ్యపద్ధతి వల్ల ఒక్కో లక్షణం నిర్మూలించడానికి, ఒక్కో మందు ఇవ్వడం తప్ప గత్యంతరం లేదు. ఇది అంశాలన్నింటినీ విడివిడిగా చూసి, విడిగానే నిర్మూలించే పద్ధతి. సారాంశంలో యాంత్రిక భౌతికవాద పద్ధతి. హోమియోపతి పద్ధతి విడివిడి అంశాలన్నిటినీ కలిపి చూసి, పరిష్కరించే పద్ధతి. సారాంశంలో గతితార్కిక భౌతికవాద పద్ధతి. అందువల్లనే హోమియో వైద్యంలో స్పెషలిస్టులు వుండరు. స్పెషలిస్టులు అనేది వైద్యశాస్త్రానికి సరిపడే విషయం కాదు.

అయితే హోమియోపతి, ఒక వ్యక్తికి ఒకేసారి రెండు మూలాల నుండి వ్యాధులు సంక్రమించవని చెప్పదు. అందుకు ఎప్పుడూ అవకాశం వుంటుంది. హోమియో వైద్యులు రోగిని పరిశీలించేటప్పుడు వాటిని నిర్ధారించుకోగలిగి వుండాలి. అందుకోసం అప్పుడున్న లక్షణాలకే పరిమితంకాక వ్యాధి చరిత్రను, తెలుసుకోవలసి వుంటుంది. సామాన్యంగా ఒకటి కంటే ఎక్కువ వ్యాధులు ఒక వ్యక్తిలో వున్నప్పుడు. ఒక వ్యాధి ఆధిపత్యంలో వుండి ఎక్కువ బాధించేదిగా కనబడుతుంది. ఒక వ్యాధి వుండగా మరో వ్యాధి సోకితే, మొదటి వ్యాధి తాత్కాలికంగా అణగి వుంటుంది. ఆధిపత్యంలో వున్నదానికి చికిత్స జరుగుతుండగా, అది తగ్గే క్రమంలో రెండవది పైకి వస్తుంది. అప్పుడు దానికి చికిత్స జరపాలి. అందుకే డా॥ హానిమన్ హోమియోపతిని 'వైద్యకళ (Art of Healing) అని పిలిచాడు. అల్లోపతి 'డాక్టర్ కేంద్రక వైద్యం' అయితే, హోమియోపతి 'రోగి కేంద్రక వైద్యం'. రోగికి స్వస్థత చేకూర్చడమే దాని ధ్యేయం తప్ప– వ్యాపారం కాదు. వ్యాపారం చేయాలనుకునే హోమియో వైద్యులు రోగులకు న్యాయం చేయలేరు. అంతిమంగా హోమియోపతి వైద్యశాస్త్రం ఉన్నత మానవ విలువలను ప్రబోధిస్తుంది. మహామేధావిగా పరిగణించదగిన డా॥ హానిమన్ రాసిన మహత్తర గ్రంథం "ది ఆర్గనాన్ ఆఫ్ మెడిసిన్'లో ఆయన చెప్పిన మొదటి సూత్రం "వ్యాధి గ్రస్తుల ఆరోగ్య పునరుద్ధరణే వ్యాధి నివారణ అంటారు. అదే వైద్యుని ఏకైక ధ్యేయం" అని ప్రబోధిస్తుంది. *(ఇంకావుంది)*

# సామాజిక విప్లవ తత్త్వవేత్త డా॥ అంబేడ్కర్

**– టి. రవిచంద్**

భారతదేశంలో సమకాలిక సామాజిక తత్వవేత్తలలో, విప్లవాత్మక చింతకులలో అంబేడ్కర్ అగ్రగణ్యుడు. సమకాలికులలో కనిపించే కొద్దిమంది మేధావులలో ఆయన ఒకరు. సాంఘికంగా ఆర్థికంగా కొన్ని వందల సంవత్సరాలుగా అణచబడి మూగజీవాలుగా కాలం వెళ్ళబుచ్చుతున్న ప్రజలలో సామాజిక చైతన్యాన్ని రేకెత్తించి, నిర్విరామంగా వారి హక్కుల కోసం పోరాడుతూ, వారి అస్తిత్వాన్ని వారు గుర్తెరిగే విధంగా కృషిచేసిన సాంఘిక విప్లవవాది అంబేడ్కర్ ఒక్కరే. విద్య, విజ్ఞానం, మేధాశక్తి, ఉత్తేజం, హృదయం మాత్రమే కాకుండా తన జీవితాన్నే సమాజానికి సమర్పించిన త్యాగి ఆయన. యుగయుగాలుగా భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న వర్ణవిద్వేషాన్ని, కులరుగ్మతను సమూలంగా నిర్మూలించడానికి ఒంటరిగా స్వతంత్ర మార్గంలో పోరాడిన చిత్తశుద్ధిగల మేధావి. ఆయన సామాజిక విప్లవ మూర్తి. మానవత్వం మూర్తీభవించిన మేధావి. ఆయన జీవితం సామాజిక పోరాటానికి తార్కాణంగా నిలచింది.

అంటరానితనం తీవ్రంగా ఉన్న రోజులలో అంబేడ్కర్ ఒక సామాన్య హరిజన కుటుంబంలో జన్మించాడు. డాక్టర్ అంబేడ్కర్ చిన్నతనం నుండే అంటరానితనం, కులతత్వంయొక్క విలయతాండవాన్ని ప్రత్యక్షంగా అనుభవించాడు. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి “తాకట్టులో భారతదేశం”లో అన్నట్లు They are the most exploited, Socially oppressed section of our people in many respects, treated worse than the Negroes in America or the Blacks in South Africa (T. Nagireddy "India Mortgaged" P, 34)* ఇటువంటి అమానుషమైన వ్యవస్థలో జన్మించిన అంబేడ్కర్ ఏ వ్యక్తి, ఏ సంస్కర్తా ఆందోళన చెందని విధంగా చెందారు. సాంఘిక దురాచారాల గురించి ఎంతగానో ఆలోచించి, ఆందోళనకు లోనయి ఆ విషవలయం నుంచి సమాజాన్ని సముద్ధరించాలని ఆ దురాచారాలకు బలయిపోతున్న వారిని ఆదుకొని ఆలోచింప జేసి ఆలోచనారాహిత్యం నుంచి ఆలోచనా పథంవైపు నడిపించడానికి తన జీవితాన్నే అర్పించాడు. అందుకే ప్రముఖ పత్రికా పాత్రికేయుడు, వి.టి. రాజశేఖరశెట్టి అంబేడ్కర్ గురించి ఇలా అన్నాడు. " Dr. B.R. Ambedkar ranks first among the Indipendent India's three greatest Personages followed by Ramaswami Naicker, and Dr Lohice Nobody has Contributed so much for Social Change in the 20th Century than these three greatest Sons of India". ఈ మాటలు నూటికి నూరుపాళ్ళు నిజం.

అంత్యజులను మేల్కొలిపే ప్రయత్నంలో అంబేడ్కర్ అనేక సంఘర్షణలకు గురికావలసి వచ్చింది. తన జీవితాన్ని ఆదర్శప్రాయంగా నడిపించుకొన్న అంబేడ్కర్ అనేక వ్యాసాలు, ఉపన్యాసాలు, పుస్తకాలద్వారా మానవత్వంవున్న ప్రతివారిలో చైతన్యాన్ని రగిలించటానికి, సామాజిక విప్లవానికి వారిని సమాయత్తం చేయడానికి ఎంతో కృషి చేశారు. ఆ ప్రయత్న ఫలితమే గ్రంథస్థమయి అందికలోకి వచ్చిన 1. శూద్రులు ఎవరు? (Who are the Sudras) 2. భారతదేశంలో కులాలు (Castes in India) 3. అంటరానివారెవరు? (Who are the Untouchables) 4. కులనిర్మూలన (Annihilation of caste) 5. కాంగ్రెస్– గాంధీ అస్పృశ్యులకు ఏమిచేశారు (What Congress and Gandhi have done to the Untoncnables) 6. గాంధీ–

అస్పృశ్యుల విముక్తి (Mr Gandhi and the Emaueipation of Untouchables) మొదలైన గ్రంథాలు కులనిర్మూలనకు సంబంధించి అంబేద్కర్' రాసిన వాటిల్లో ప్రధానమైనది. ఇంకా అనేక గ్రంథాలు అనేక విషయాలమీద రాశారు. వాటి ప్రస్థావన ప్రస్తుతం మనకు అనవసరం. వీటిలో "కులనిర్మూలన" గ్రంథం మకుటాయమానమైనది. ఇందులో కులం ఎంత భయంకరమైన రుగ్మతో వివరించారు. తరతరాలుగా సమాజాన్ని కులం అనేది ఎలా ముక్కలు ముక్కలుగా నరికిందో తార్కాణ సయితంగా వివరించారు. ఈనాడు సామాజిక విప్లవానికి తోడ్పడానికి – ముందుకు వస్తున్న వాళ్ళందరూ తప్పక చదవాల్సిన గ్రంథం ఇది.

కులనిర్మూలన గ్రంథంలోనే గాంధీకి సమాధానం కూడా ఇవ్వబడింది. గాంధీ వర్ణవ్యవస్థను సమర్థిస్తూ చేసిన వాదనల్ని (గాంధీ సంపాదకత్వాన వెలువడిన "హరిజన్" పత్రిక 1933 సంIIపు సంచికలు) ఖండిస్తూ ఆయన తాత్విక చింతనలోని తీవ్రమైన తప్పుల్ని ఎత్తిచూపారు డాక్టర్ అంబేద్కర్. భారతదేశంలో తొలిసారి గాంధీ నాయకత్వాన్ని ఎదిరించి ఆయన ఆలోచనలోని అభివృద్ధి నిరోధక సామాజిక వ్యతిరేక భావాల్ని ఎత్తిచూపినవాడు అంబేద్కర్.

కులనిర్మూల నోద్యమంలో అంబేద్కర్, గాంధీలు నిర్వహించిన పాత్రను ప్రతీ సామాజిక విప్లవవాది తెలుసుకోవాల్సిన అవసరం వుంది. గాంధీ అంబేద్కర్ రెండు మార్గాలకు ప్రతినిధులు. కులనిర్మూలనలో అంబేద్కర్ విప్లవవాది. గాంధీ మతసంస్కరణవాది. కులతత్వం యొక్క సామాజిక పునాదుల్ని గాంధీ నిరాకరిస్తాడు. ఆయన దానికి ధార్మికమైన భాష్యం చెప్పాడు. అంతేకాకుండా మౌలికంగా కుల వ్యవస్థ (వర్ణవ్యవస్థ) వుండాలంటారు. కానీ అంటరానితనం వుండకూడదు దాన్ని నిర్మూలించాలంటాడు. ఈ విషయంలో అంబేద్కర్ గాంధీతో తీవ్రంగా విభేదిస్తాడు అంటారానితనం పోవాలంటే తప్పనిసరిగా దానికి మూలాధారమైన కులవ్యవస్థను నిర్మూలించాలన్నది అంబేద్కర్ అభిప్రాయం. ఈ అవగాహనతోనే డాII అంబేద్కర్, గాంధీ కాలం చెల్లిన సంస్కరణతత్వాన్ని తీవ్రంగా గర్హిస్తాడు. గాంధీ నిర్వహించిన అస్పృశ్య వ్యతిరేక ఉద్యమం యొక్క నిజస్వరూపాన్ని అంబేద్కర్ "కాంగ్రెస్–గాంధీ" గ్రంథంలో చక్కగా వివరిస్తాడు. "Mr. Gandhi's anti-untouchability campaign is marked by so many twists and turns, inconsistencies and centradictions, attacks and surrenders, advances and retreats that the whole campaign has become a matter of mystery" (PP. 251. 254). చివరకు ఆయన నిర్వహించిన ఈ ఉద్యమం "matter of mystery" గా మారిపోయిందన్నాడు డాII అంబేద్కర్. వాస్తవంగా 1919వ సంవత్సరంలో భారతదేశ రాజకీయ రంగంలో ప్రవేశించిన గాంధీ 1930 సంII వరకు ఎటువంటి మిలిటెంట్ కార్యక్రమాన్ని తీసుకోలేదు. అయితే అంటరానివారుగా పరిగణించబడుతున్న ఆ అమాయక ప్రజలే 1935లో ఇయొలాలో సత్యాగ్రహ ఉద్యమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో గాంధీ ఏమాత్రం ఈ ఉద్యమాన్ని సమర్థించకపోగా ఖండించాడు. కాంగ్రెస్ తోటి, దానికి నాయకత్వం వహిస్తున్న గాంధీతో విసుగుచెందిన వాళ్ళంతా ఈ పరిస్థితులలోనే కలసి అంబేద్కర్ నాయకత్వాన కులనిర్మూలనోద్యమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. గాంధీలోని వైరుధ్యాల్ని, అవకతవక అభిప్రాయాల్ని ప్రజల ముందుంచటానికి 1945 సంIIలో అంబేద్కర్ "What Congress and the Gandhi have done to the untouchables" అనే గ్రంథాన్ని రచించారు. దీన్ని వ్యతిరేకిస్తూ రామాయాణ సంస్కృతి ప్రతినిధియైన సి. రాజగోపాలాచారి "Ambedkar Refuted" అనే వ్యాసాన్ని రాసి గాంధీ సనాతన భావాల్ని,

హైందవ ధర్మ ఔన్నత్యాన్నీ సమర్థించారు. అంతేకాకుండా అంబేద్కర్‌కు దేశ విముక్తిలో ఆసక్తి లేదని ఆరోపించాడు. అయితే "పాకిస్థాన్" మీద అదే సంవత్సరంలో అంబేద్కర్ రాసిన గ్రంథం ఆయన జాతీయతత్వాన్ని, స్వాతంత్ర్య కాంక్షను తెలియచేస్తుంది. అంబేద్కర్ ప్రధానంగా అంత్యజుల విముక్తికి అంకితమైన వ్యక్తి, ఆయన వారి విముక్తికి ఆటంకంగా కనిపించే ప్రతి ఉద్యమాన్ని రాజీలేకుండా విమర్శించారు. ఈ ధోరణి వల్ల అంబేద్కర్ అగ్రకులస్థుల దాడిని ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ దాడిలో అంబేద్కర్‌ని ఒక కుల ప్రతినిధిగా ఆనాటి జాతీయ కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఈ అభిప్రాయమే ఈ నాటికీ చాలామందిలో వ్యక్తమౌతున్నది. ఇది చాలా విచారించాల్సిన విషయం. కులవ్యవస్థనే జీవితాంతం సమర్థిస్తూ వచ్చిన కాంగ్రెస్ గాంధీతో నిరంతరం పోరాటం సల్పిన అంబేద్కర్‌నే ఆ విధంగా చిత్రించటం కంటే చరిత్ర వక్రీకరణ మరొకటి వుండదు. మరోసారి దాచేస్తే దాగని చారిత్రిక వాస్తవాన్ని సామాజిక విప్లవానికి అంకితమైన కార్యకర్తలు ప్రజానీకానికి తెలియజేయాల్సిన అవసరంవుంది.

కులనిర్మూలనోద్యమంలో అంబేద్కర్ పాత్ర చిరస్మరణీయమైనది. సమాజ ప్రగతిని కాంక్షించే వారందరూ ఆయన నిర్వహించిన ఉద్యమ స్వరూప స్వభావాల్ని క్రమానుగత అభివృద్ధిని సమగ్రంగా అర్థం చేసుకోవాల్సివుంది. భారతీయ సామాజిక – వ్యవస్థలోని విలక్షణతను అర్థం చేసుకోగోరే వారందరికీ ఆయన ఉద్యమం ఒక పాఠ్య గ్రంథంలాంటిది. ఈ పాఠ్యగ్రంథాన్ని అధ్యయనం చేయనివారు, అర్థంచేసుకోలేనివారు అనుకూల-ప్రతికూల అంశాల్ని గ్రహించ లేనివారు నవసమాజ నిర్మాణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించలేరు. ఆయన నిర్వహించిన ఉద్యమం యొక్క పూర్వాపరాన్ని తెలుసుకోవాల్సిన కర్తవ్యం ఈ నాటి యువతరం మీద ఎంతయినా వుంది. అటువంటి అభినివేశాన్ని, అవగాహనను కల్పించటానికి ఈనాడు అంబేద్కర్ ఉద్యమాభిమానులంతా ముందుకు రావాల్సిన తరుణం ఆసన్నమైంది. ఆయన నిర్వహించిన చారిత్రాత్మక ఉద్యమాన్ని ఒక్కసారి స్మరించుకొని, రెట్టింపు చైతన్యంతో ఫ్యూడల్ (భూస్వామ్య) సంస్కృతికి వ్యతిరేకంగా సమగ్రమైన ఆలోచనతో, సరైన మార్గంలో ముందుకు నడుద్దాము.

---

**విశాఖపట్నంలో జరిగిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభ దృశములు**









# బైబిల్ బాగోతం

(గత సంచిక తరువాయి)

- డా॥ కోనా వీరబ్రహ్మం

**17. "స్త్రీలు సంపూర్ణ విధేయతతో నేర్చుకోవాలి. వారు ఉపదేశించరాదు".**

"స్త్రీలు మౌనముగా ఉండి, సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదేగానీ, ఉపదేశించుటకైనను, పురుషుని మీద అధికారము చేయుట కైనను ఆమెకు సెలవియ్యను". I తిమోతి 2:11, 12

**18. "భార్య పురుషుడికి లోబడవలెను".**

"సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడా ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను". ఎఫెసీయులకు 5:24

**19. యౌవనస్థులైన విధవరాండ్రు పెండ్లాడగోరటం క్రీస్తుకు విరోధం అంటున్నారు ఒకవైపు. వారు పెండ్లి చేసుకోకపోతే చెడిపోతారంటున్నారింకోవైపు. ఏంచేయాలి?**

యౌవనస్థులైన విధవరాండ్రు పెండ్లాడగోరటం క్రీస్తుకు విరోధం కాబట్టి వారు పునర్వివాహం చేసికోరాదని Iతిమోతిలో 5వ అధ్యాయంలో 11, 12 వచనాలు చెప్తున్నాయి. ఇలా ఉంది: "యౌవనస్థులైన విధవరాండ్రను లెక్కలో చేర్చవద్దు. వారు క్రీస్తుకు విరోధముగా నిరంకుశలైనప్పుడు తమ మొదటి విశ్వాసమును వదలుకొనిరను తీర్పు పొందినవారై పెండ్లాడ గోరుదురు".

ఇదే అధ్యాయంలో 13, 14 వచనాల్లో యౌవనస్థులైన విధవరాండ్రు ఖాళీగా ఉంటే వారి బుద్ధి, ప్రవర్తన చెడిపోతాయని, కాబట్టి మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని ఉంది. చూడండి. "మరియు వారు ఇంటింట తిరుగు లాడుచు, బద్ధకురాండ్రగుటకు మాత్రమేగాక, ఆడరాని మాటలాడుచు, వదరుబోతులును, పరుల జోలికి పోవువారు నగుటకును నేర్చుకొందురు. కాబట్టి యౌవన స్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని గృహపరిపాలన జరిగించుచు, నిందించుటకు విరోధికి అవకాశమియ్యకుండ వలెనని కోరుచున్నాను".

ఇంతకీ క్రైస్తవ సోదరులు ఏం చెయ్యాలి? విధవా పునర్వివాహం చేయవచ్చా? చెయ్యకూడదా?

**20. "అప్పిచ్చువాడే క్రైస్తవుడు"!**

మత్తయి 5:42లో ఇలా ఉంది "నిన్ను అడుగువానికిమ్ము, నిన్ను అప్పు అడుగగోరు వాని నుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు". కాబట్టి నిజమైన క్రైస్తవులు, ఉత్తమ క్రైస్తవులు తమ వద్ద డబ్బు ఉంటే అప్పు అడిగిన వారికి లేదనకుండా అప్పు ఇవ్వాలి.

**21. క్రైస్తవులు ఎక్కడ ప్రార్థన చేసుకోవాలి? చర్చీల కెళ్ళి ప్రార్థన చేసుకోవాలా? లేక తమ తమ ఇండ్లలో ప్రార్థన చేసుకోవాలా? వ్యర్థమైన మాటలతో విస్తారమైన ప్రార్థనలు చెయ్యవచ్చా? చెయ్యకూడదా?**

"క్రైస్తవులు అన్యజనుల వలె సమాజ మందిరము(చర్చి)ల లోకి పోయి ప్రార్థన చేయగూడదు. ప్రార్థనలో వ్యర్థమైన మాటలు వచించగూడదు. విస్తరించి మాటలాడగూడదు". మత్తయి 6:5-8

కాబట్టి క్రైస్తవ భక్తులు చర్చీల కెళ్ళనక్కరలేదు. తమ ఇండ్లలో ఉండి ప్రార్థన చేసుకోవాలి. సుదీర్ఘమైన ప్రార్థన చేయకూడదు.

**22. క్రైస్తవులు తిండి, బట్టల గురించి చింతించతగదు!**

మంచి క్రైస్తవులు తిండీ తిప్పలు గురించి ప్రాకులాడగూడదు. ఆహారము లేకపోయినా ప్రాణం ఉంటుంది. "ఆకాశ పక్షులకు" తిండి దొరకటం లేదా? అలాగే మీకూ! వస్త్రముల గురించి చింతించకూడదు. అడవి పువ్వులు వస్త్రాలు ధరించకపోయినా అందంగానే ఉండటం లేదా? అలాగే మీరూ!

ఇది మత్తయి 6వ అధ్యాయంలో 25–30 వచనాలలో సెలవియ్యబడ్డ విషయం. దీన్ని బట్టి కనీస అవసరాల గురించి క్రైస్తవులు అనబడేవాళ్ళు ప్రభుత్వాల మీద ఆందోళన చెయ్యాల్సిన పనిలేదు!

**23. ఆకాశ పక్షులా?**

మత్తయి 6:26లో "ఆకాశ పక్షులను చూడుడి" అని ఉంది. పక్షులు అని అంటే సరిపోతుంది కదా! ఆకాశ పక్షులు అని అనాలా? పక్షుల్లో భూపక్షులు, జలపక్షులు, ఆకాశ పక్షులు అనే వర్గీకరణ ఉందా? కోడి, నిప్పుకోడి (ఆస్ట్రిచ్), కివి మొదలగునవి భూ పక్షులేగదా అనే ప్రబుద్ధులు ఉండినా ఉండొచ్చు!

**24. యేసును నమ్ముకుంటే, చనిపోయిన తండ్రిని పాతిపెట్టుకోవటానిక్కూడా ఒక శిష్యుడికి పర్మిషన్ దొరకలేదు!**

"శిష్యులలో మరియొకడు – ప్రభువా, నేను మొదట వెళ్ళి, నా తండ్రిని పాతిపెట్టుటకు సెలవిమ్మని ఆయనను అడుగగా, యేసు అతనిని చూచి – నన్ను వెంబడించుము, మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్మని చెప్పెను". ఇలా మత్తయి 8లో 21, 22 వచనాలలో ఉంది. యేసును నమ్ముకుంటే చాలు. కన్నతల్లిదండ్రుల్ని నట్టేట్లో మునగనివ్వండి. వాళ్ళని అసలు పట్టించుకోనవసరం లేదు! ఏమంటారు? ఇంకా కావాలంటే లూకా 9:59–61 వచనాలు కూడా చూడండి.

**25. చచ్చినవాళ్ళు చచ్చిన వాళ్ళను పాతిపెట్టుకోమనటమేంటి?**

మత్తయి 8:22లో ఇలా ఉంది "మృతులు తమ మృతులను పాతిపెట్టు కొననిమ్మని చెప్పెను". అంటే, తనతోపాటు తిరగని వాళ్ళంతా యేసు దృష్టిలో చచ్చిన వాళ్ళ క్రింద లెక్క. పెళ్ళాం–బిడ్డల్ని, తన వాళ్ళనందర్నీ వదిలేసి బిక్కా ఫకీరుల్లాగా తనతోపాటు తిరిగేవాళ్ళంతా సజీవులు!

కాబట్టి "శిష్యుడా! నాతో తిరుగుతున్న నువ్వు సజీవుడవు. నాతో చేరని మీ కుటుంబంలోని మిగిలిన వాళ్ళు మృతజీవుల క్రిందే లెక్క. మృతి చెందిన నీ తండ్రిని ఆ మృతజీవులే పాతిపెట్టుకుంటారులే. నువ్వు వెళ్ళటం దేనికి? నువ్వు నాతో పాటే ఉండు" అని తాత్పర్యం.

**26. యేసు శిష్యులు ఎందుకు భయభ్రాంతులయ్యారు?**

మత్తయి 8:23–26 ప్రకారం ఆయన దోనెయెక్కి శిష్యులతో కూడా గలిలయ సముద్రం మీద ప్రయాణం చేస్తున్నప్పుడు వచ్చిన తుఫాను అలలకు శిష్యులు భయపడ్డారు. యోహాను 6:19 ప్రకారం యేసు సముద్రం మీద నడచి వచ్చుట చూచి శిష్యులు భయపడ్డారు అని

ఉంది. ఇందులో ఏది నిజం? ఏది కల్పితం? మత్తయి చెప్పింది అతిశయోక్తి అనిపించడంలేదు. **మత్తయి సువార్త ప్రకారం యేసు సముద్రం మీద నడచిరాలేదు. యోహాను సువార్త ప్రకారం యేసు సముద్రం మీద నడచి వచ్చాడు.**

దోనె వేసికొని సముద్రం మీద ప్రయాణం చెయ్యటం సాధారణంగా జరుగుతుందా? దోనె మీద ప్రయాణం చేసి ఉంటే, అది సముద్రం కాకుండా సరస్సై ఉంటుంది. మత్తయి రచనలో యేసుకు మహిమను ఆపాదించటానికి యేసు అల్లకల్లోలమైన సముద్రాన్ని శాసించి, శాంతపరచాడు అని వ్రాయగల్గితే, యోహానైతే యేసు సముద్రం మీద నడిచాడు, తన విశ్వరూపాన్ని చూపాడని మరింత సుందరంగా వ్రాయగల్గాడు. ఇక్కడ ఆయా రచయితల సృజనాత్మకతను, కాల్పనిక శక్తిని ఆస్వాదించాలి. అంతేగానీ నిజాలను వెతుక్కోగూడదు. అన్నీ ఇలాగే ఉంటాయి.

**27. యేసుకు భూతదయ లేదు. యేసుకు ప్రాణులన్నింటియెడ సమదృష్టి లేదు!**

యేసు గదరేనీయుల దేశము చేరగా దయ్యములు పట్టిన ఇద్దరు మనుషులు ఎదురయ్యారు. వారికి దూరములో గొప్ప పందుల మంద మేయుచుండగా, ఆ దయ్యములు "నీవు మమ్మును వెళ్లగొట్టిన ఎడల ఆ పందుల మందలోనికి పోనిమ్మని వేడుకున్నాయి". ఆయన ఎంతో ఉదారంగా దయ్యాల మాటమేరకు అలాగే చేశాడు. అప్పుడా "గొప్ప పందులమంద" యావత్తు "సముద్రము లోనికి వడిగా పరిగెత్తుకొని పోయి నీళ్ళల్లో పడిచచ్చెను". మత్తయి 8:28–32.

సముద్రంలోకి పోయిన తరువాత నీళ్ళలో పడిచావకపోతే, నిప్పుల్లో పడి చస్తాయా? యేసు విడిగా దయ్యాల్ని పట్టుకొని చంపలేడా? చంపలేకపోతే దూరంగా తరిమేయవచ్చు గదా? మధ్యలో పందులేం పాపం చేశాయి. వాటిల్ని సముద్రంలోకి తరిమి చంపటానికి? ఇంతకీ యేసు చంపింది దెయ్యలనా, పందులనా? బైబిలు కథనం ప్రకారం దయ్యాలు వాటంతట అవి ఉండలేవన్నమాట! అవి మనుషుల్నే కాక పందుల్ని, కుక్కల్ని, నక్కల్ని కూడా ఆవహిస్తాయి. పై కథనంలో ఇద్దరు మనుషుల్లో ఎన్ని దెయ్యాలు ఉన్నాయి? అసలు ఆ ఇద్దరిలో విడివిడిగా ఒక్కొక్కరిని ఎన్ని దయ్యాలు పట్టుకున్నాయి? ఆ తరువాత అవి మందలో ఉన్న పందుల్లో (ఎన్ని?) ఒక్కో పందిని ఒక్కోటి ఆవహించిందా? లేక ఎన్నేసి దయ్యాలు ఒక్కో పందిని ఆవహించాయి? లేక మందలో ఉన్న పందులు సంఖ్యే ఎక్కువయితే ఒక్కొక్క దయ్యమే మైటాసిస్ పద్ధతిలో విభజింపబడి అనేక పందుల్ని ఆవహించిందా? ఏమిటీ అర్థంలేని రాతలు?

**28. యేసు అంటే పట్టణస్తులు భయభ్రాంతులయ్యారు. తమ ప్రాంతాలను విడచి పొమ్మని వేడుకొన్నారు. నమ్మలేకపోతే మత్తయి 8:34 చూడండి.**

మన తెలంగాణాలో కొన్ని మారుమూల ప్రదేశాలలో చేతబడి చేసేవారిని ప్రమాదకర వ్యక్తులుగా భావించి, భయంతో జనాలు వారిని ఊరినుండి తరిమేస్తారు. అలాగే యేసును కూడా తమ పట్టణంలోకి పాదం మోపనియ్యలేదు. తమ జీవనాధారమైన పందుల్లోకి ఇద్దరు మనుషులను ఆవహించిన దెయ్యాల్ని పంపించానని చెప్పి వాటిల్ని మందలకొద్దీ చంపిస్తుంటే, అక్కడి సామాన్య ప్రజలకు మామూలుగానే మూఢనమ్మకాలు ఉన్నప్పటికీ తమ నోటి దగ్గర కూడును యేసు తన మహిమల పేరిట తన్నేస్తుంటే, అటువంటి యేసు తమకు వద్దని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఎంతైనా మనిషి ప్రాక్టికల్‌గా హేతువాది!

**29. యేసు పాపులకే అవసరం, నీతిమంతులకు కాదు!**

మత్తయి 9:13లో ఇలా ఉంది. "నేను పాపులను పిలువ వచ్చితిని గాని, నీతిమంతులను పిలువ రాలేదు". ఇందుకు ఇంకా ఉదాహరణలు మార్కు 2:17 మరియు లూకా 5:32.

**30. యేసు ఆజ్ఞ ప్రకారం ఆయన మహిమలను ప్రచారం చెయ్యకూడదు!**

ఇద్దరు గ్రుడ్డివారిని కన్నులు ముట్టి ఆయన చూపు రప్పించాడు. "ఇది ఎవరికిని తెలియకుండ చూచుకొనుడని వారికి ఖండితంగా ఆజ్ఞాపించెను". ఐనా వారు ఆయన ఆజ్ఞను పాటించలేదు. దేశమంతటా ఆయన కీర్తిని ప్రచారం చేశారు. యేసు మహిమలను ప్రచారం చెయ్యకూడదని మత్తయి 9:30, 31లలో ఆదేశించబడినది.

**31. యేసు తన పండ్రెండు మంది శిష్యులను బోధచేయుటకు పంపుచు వారికి ఆజ్ఞాపించినది ఏమనగా!**

"మీరు అన్యజనుల దారిలోనికి వెళ్ళకుడి.......... ఇశ్రాయేలు వంశములోని నశించిన గొఱ్ఱెల యొద్దకే వెళ్ళుడి" (మత్తయి 10:5,6) అప్పట్లో అణచివేతకు గురైన తనవారైన ఇశ్రాయేలీయులు ఉన్న ప్రదేశాలకు వెళ్ళి బోధచెయ్యమన్నాడు. మిగతా చోట్లకు వెళ్లవద్దన్నాడు. కాగా జరిగింది, జరుగుతున్నది ఏమిటి? ఖండఖండాంతరాల్లో క్రైస్తవ మతం ఎలా ప్రచారమైంది? ఎందుకు ప్రచారం చేయబడింది?

**32. యేసు కరుణామయుడు కాదు, ప్రేమ స్వరూపుడు అంతకన్నా కాదు!**

యేసు కారణంగా కుటుంబంలో కలతలురేగుతాయి. యేసు పచ్చి కుళ్ళుమోతు, వట్టి స్వార్ధపరుడు. మత్తయి 10వ అధ్యాయంలో 35 నుండి 37 వరకు గల వచనాలలో ఏముందో చూడండి. "ఒక మనుష్యునికిని వాని తండ్రికిని, కుమార్తెలకు ఆమె తల్లికిని, కోడలికిని ఆమె అత్తకును విరోధము పెట్ట వచ్చితిని. ఒక మనుష్యుని ఇంటివారే అతనికి శత్రువులగుదురు. తండ్రినైనను, తల్లినైనను నాకంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు".

చూశారా కుటుంబ సభ్యుల మధ్య ఉండవలసిన పరస్పర ఆప్యాయతలను, అనుబంధాలను బైబిల్ ఎలా త్రోసిపారేస్తుందో!

**33. యేసుకుగల స్వార్ధానికి, ప్రజలకు గల గ్రుడ్డి నమ్మకానికి, మూఢ భక్తికి పరాకాష్ట ఇదిగోండి!**

తమకు ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు తమ ప్రాణం దక్కించుకోవటానికి క్రైస్తవ విశ్వాసులు ప్రయత్నించకూడదు. మత్తయి 10:39లో ఇలా ఉంది. "తన ప్రాణము దక్కించుకొనువాడు దానిని పోగొట్టుకొనును గాని, నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టుకొనువాడు దానిని దక్కించుకొనును".

మత్తయి 4:6లో సాతాను యేసును శోధించేటప్పుడు "నీవు దేవుని కుమారుడివైతే క్రిందికి (ఆలయ శిఖరం నుండి) దుముకుము" అంటాడు. అప్పుడు యేసు తన తండ్రి నిమిత్తము తన ప్రాణాన్ని పోగొట్టుకొని మళ్ళీ దక్కించు కోవచ్చుగదా! మరి ఎందుకు అలా చేయలేదు? "ప్రభువైన నీ దేవుని నీవు శోధింపవలదని వ్రాయబడి ఉన్నదని", అందుచేత తాను దూకనని చెప్పి తప్పించుకున్నాడు. తనకొక న్యాయము, ఇతరులకొక న్యాయమా? తన తండ్రిని ఘనపరచటం కోసం తానే తన ప్రాణాన్ని పోగొట్టుకోవటానికి ఇష్టపడనప్పుడు, తన కోసం ప్రాణం పోగొట్టుకోవటానికి మాత్రం పిచ్చిభక్తులు సిద్ధంగా ఉండాలంటాడు యేసు!

*(ఇంకా వుంది)*

# మతం గుప్పిట్లో మహిళ

(గత సంచిక తరువాయి)

– కొల్లా వెంకటేశ్వర్లు

**మ**తం పేరిట మానవ సమాజానికి సేవజేస్తున్న వారిని సైతం "అంటరాని వారన్నది". ఈ నాటికీ స్త్రీలపై సంప్రదాయపు సంకెళ్ళను విధించింది. స్త్రీలపై అత్యాచారాలు పురాణకాలం మతవాదులు ప్రారంభించినవే. ఆ వారసత్వం నేటికీ ప్రతిదినం అమలు జరుగుతూనేవుంది.

కళల పేరిట, సాహిత్యం పేరిట గూడా ఈనాటికీ పాతివ్రత్యాన్ని, వ్యభిచారాన్ని ప్రచారం చేస్తుంది. ప్రతిదినం రేడియోలో సంస్కృతం పేరిట ప్రచారమౌతున్న లలిత సంగీతం పేరిట ప్రచారమౌతున్న సాహితీ కార్యక్రమాలన్నీ బూతునే ప్రచారం చేస్తున్నాయి.

**క్రైస్తవ మతం**

హిందూ మతానికి తానేమీ తీసిపోనని నిరూపించుకొంది క్రైస్తవ మతం. కొన్ని సమయాల్లో స్త్రీలను కించపరచడంలో క్రైస్తవ మతమే యెక్కువ మార్కులు సంపాదించుకొందిగూడ. శాస్త్రజ్ఞులను, స్త్రీలను హింసించడంలో క్రైస్తవమతం చాలా ప్రాధాన్యత వహించింది. తన మతం చెప్పిందే నిజం. సైన్సు యెన్ని నిరూపణలు జూపినా నమ్మగూడదంటారు. క్రైస్తవ మతాధిపతులు భూమి బల్లపరువుగా ఉందని చెప్పారు. క్రైస్తవమతం సూర్యుడు భూమి చుట్టూ తిరుగుచున్నాడని చెప్పింది. ఆ అభిప్రాయం తప్పని నిరూపించిన కోపర్నికస్‌ను ముప్పతిప్పలు పెట్టింది. కోపర్నికస్ సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన బ్రూనోను మంటలలో కాల్చి చంపింది.

క్రైస్తవ మతం స్త్రీని నీచప్రాణిగా వర్ణించింది. ఈ మతం దృష్టిలో స్త్రీ ఒక బానిస. స్త్రీ స్వభావాన్ని, మనస్సుని పూర్తిగా నాశనం చేసి మతం ముద్ర గాఢంగా హత్తుకునేట్లు చేసింది. మతాన్ని స్త్రీలచేతనే ఉధృతంగా ప్రచారం చేయించేందుకు వారిలో మత పిచ్చిని నూరిపోసింది. సహజంగా పురుషులకంటే స్త్రీలలో భక్త్యావేశం యెక్కువ అని శ్రీమతి యెమ్మా గోల్డ్‌మాన్ అంటారు. స్త్రీలు తాము నమ్మిన దేవుని! (విగ్రహానికి) సాష్టాంగ దండ ప్రణామం చేస్తారు. ఆ దేవుని కెంతైనా ప్రచారం చేస్తారు. తామెంత హీనంగా చూడబడుతున్నామో ఆలోచించరు. అటువంటి మత్తును వారికి యెక్కించి, తమ మత పిచ్చికి బలి పశువుల్ని చేసారు మతాధిపతులు.

ఈనాడు ప్రపంచంలో అధికంగా ప్రచారం చేయబడుతున్న మతం క్రైస్తవం. దీనజనుల పాలిటవరం అని చెప్పబడుతున్న మతం క్రైస్తవమతం. ఆ క్రైస్తవమత పవిత్రగ్రంథం బైబిల్ "పాపానికి కారణం స్త్రీయే, భగవంతుడు ముందు పురుషుణ్ణి సృష్టించాడు. అతనికి సేవలు చేయడంకోసం, సంతోషపెట్టడం కోసమే అతని ప్రక్కటెముక నుండి స్త్రీని సృష్టించాడు" అని ప్రచారం చేస్తుంది.

"దేవుడు ఆదాంను నిద్రపుచ్చి, అతని ప్రక్కటెముక నుండి ఈవ్‌ను సృష్టించాడు" (జెనిసి" II, 21) అని బైబిలు వాక్యం.

'స్త్రీ మూలంగానే పురుషునికి ఇన్ని కష్టాలు వచ్చాయని" బైబిలు చెబుతుంది.

పవిత్రమైన చర్చిలో ప్రసంగించుట, మాట్లాడుట, తప్పుడు పనులుగా బైబిలు వ్రాసింది. ఇంత హీనంగా స్త్రీలను అవమానపరచిన బైబిలును పవిత్ర గ్రంథంగా ప్రచారం చేయడం, అందులోనూ స్త్రీలే యెక్కువ క్రైస్తవ మత ప్రచారాన్ని తీసుకోవడం అంటే – మతం యెంత హానికరమో అర్థమౌతుంది.

ఆడవాళ్ళకు పురిటి సమయం ప్రాణగండం. వైద్య సదుపాయం లేని ప్రాచీనకాలంలో అనేక మంది స్త్రీలు కాన్పు సమయంలో ప్రాణాలు విడిచారు. స్త్రీలను అటువంటి ఆపదల నుండి తొలగించాలనే సదుద్దేశంతో డా॥ జేమ్స్ యంగ్ సింప్సన్ 'క్లోరోఫారం' కనుకొన్నారు. ప్రసూతి శాస్త్రంలో వీరు క్లోరోఫారం కనుగొనడం ద్వారా స్త్రీజాతి కెంతో మేలుజేసారు.

"గర్భిణీ స్త్రీలను ప్రసవ వేదన పడమని దేవుడు చెప్పాడు. అటువంటపుడు ఆ ప్రసవ వేదనను పోగొట్టడానికి మందు యివ్వడం దైవద్రోహం" అంటూ మత నాయకులు సింప్సన్‌పై విరుచుకుపడ్డారు. గర్భిణీ స్త్రీలకు సింప్సన్ దయ్యాన్ని ఆవహింప జేస్తున్నారని, అందువల్ల ఆయన సాతాను ప్రతినిధి అన్నారు. మత నాయకులు సింప్సన్‌పై దండయాత్ర ప్రారంభించారు. స్త్రీలను పురిటి సమయంలో బాధపడమని దేవుడు శపించాడనీ, ఆ నిర్ణయాన్ని ధిక్కరించే అధికారం సింప్సన్‌కు లేదని అతన్ని బహిష్కరించాలని ప్రయత్నించారు.

"In sorrow thou shalt bring forth Children" అనే బైబిల్ వాక్యం ఆధారంగా సింప్సన్‌పై దండయాత్ర చేయడానికి సిద్ధపడ్డారు.

మతవాదులు పిచ్చికుక్కలకంటే ప్రమాదకారులు. క్రైస్తవమతం యెంతో మంది శాస్త్రజ్ఞులను, వైద్యులను తన పిచ్చితో కాటువేసింది. ఆ జాబితాలోనికి సింప్సన్‌ను గూడ చేర్చాలని ప్రయత్నించింది. ఆయన చేసే ఆపరేషన్ విధానాన్ని వ్యతిరేకించాలంటూ ప్రజల్లో విస్తృత ప్రచారం చేసారు మతవాదులు.

విక్టోరియారాణి తన పురిటి సమయంలో ఈ మందును వాడుకోవడమేగాక, సింప్సన్‌ను తన ఆస్థాన వైద్యునిగా నియమించడంతో మతవాదుల ఆటకట్టింది.

స్త్రీ గర్భస్రావం చేసుకోవడాన్ని కాథలిక్ మతం వ్యతిరేకించింది. గర్భనిరోధం మహాపాపం అన్నారు. గర్భ నిరోధ ఆసుపత్రులను నాశనం చేయాలని కాథలిక్కులు ప్రచారం చేశారు. అమెరికాలోని ఒక రాష్ట్రంలో 2 కోట్ల రూ॥ల విలువైన ఒక గర్భస్రావ కేంద్రాన్ని వీరు తగులబెట్టారు. గర్భస్రావ కేంద్రం అంటే చిత్రహింసల కేంద్రమని కాథలిక్కుల అభిప్రాయం.

డా॥ బయర్డ్ మతాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. "బిడ్డల్ని కనాలా? వద్దా? అని నిర్ణయించుకోవలసింది స్త్రీయే, కాని మతం మాత్రంగాదు" అన్నందుకు ఆయన ప్రారంభించిన గర్భస్రావ కేంద్రాన్ని మతం ముసుగులోనున్న గూండాలు మంటలపాల్జేసారు.

గర్భనిరోధం చేసే డాక్టర్లు పాపాత్ములు, హంతకులని ప్రజల్లో ప్రచారం చేసి డాక్టర్లపై తిరుగుబాటు చేయించాలని మతవాదులు ప్రయత్నించారు. గర్భనిరోధం చేయకుండా ఉండేందుకు చట్టం రూపొందించేలా అమెరికన్ ప్రభుత్వంపై వత్తిడి చేసారు కాథలిక్కులు.

రోమ్‌నగర ప్రధాన మతగురువు గర్భస్రావం చేసికొనే స్త్రీలు, చేసే డాక్టర్లు సమాజం నుండి వెలివేయబడతారని ప్రకటించారు.

క్రైస్తవ మతంలోని మర్మన్‌శాఖ బహుభార్యాత్వం అమల్లో వుండాలి, ఇది దైవాజ్ఞ అంటుంది.

1976లో యేథెన్సులోని మతాధికారి. "గర్భస్రావం చేసికొన్న ఆడవారి కడుపులను కాన్సర్ వ్యాధి పీడించుగాక" అని ప్రార్థించాడు.

"యుద్ధంలో స్త్రీలను, చంటి పిల్లలను వధించినపుడు మగవారి స్పర్శలేని మగువలను మాత్రం నా వద్దకు తీసుకొని రండి" అని బైబిలు వాక్యం. యేపాపం జేసినా పరలోకంలో శిక్ష వుంటుందని, స్త్రీలు ప్రభు ఆజ్ఞ ధిక్కరించి, వైద్యుల సలహాలు వినరాదని కట్టుబాటు చేసారు.

ఇంతటి నికృష్టపు సిద్ధాంతాల్ని బహిరంగంగా ప్రచారం చేస్తున్న క్రైస్తవమతం ఈనాడు ప్రపంచంలోనే తిరుగులేని మతంగా వ్యాపించింది. *(ఇంకా వుంది)*

# ఆరాధనలు, ప్రార్థనలు జీవావసరాలేనా?

(గత సంచిక తరువాయి)

– ఆర్.వి. సుబ్బారావు

**క్రైస్తవం:** ఈ మతానికి కేంద్రమైన ప్రవక్త యేసు క్రీస్తు (కల్పితం) ఉన్న కాలం ఇదని అంచనా. ఆయన పుట్టుకతో యూదుడు అయివుండి, సంస్కరణలతో క్రైస్తవానికి బీజాలు వేయసాగాడు. దానితో రోమన్ గవర్నర్ పాన్షస్ పైలట్ Pontius Pilate ఈయనకు సిలువ శిక్ష విధించాడు. మరణించిన మూడవ రోజున యేసు సజీవుడయ్యాడు. క్రైస్తవులకు యేసు జన్మదినం క్రిస్మస్ పండుగ. సిలువ వేయబడిన రోజు గుడ్‌ఫ్రైడే. సజీవుడైన రోజు ఈస్టర్ పండుగ. క్రైస్తవుల మత గ్రంథం గ్రీకు భాషలోని బైబిల్ కొత్త నిబంధన, బైబిల్ పాత నిబంధనలు యూదుల విశ్వాసాలు. నూతన నిబంధనలు యేసు బోధనలు. ఈ మత సంస్కరణలకై మార్టిన్ లూథరన్ తెచ్చిన చీలికతో ప్రొటెస్టెంట్స్ ఆవిర్భవించారు. క్రైస్తవం ప్రపంచవ్యాప్తంగా అన్ని మతాల కన్నా అధిక జనాభా గలది. ప్రవక్త తెచ్చిన మతమంటూ అనేక విభజనలు పొందింది. దీని ప్రధాన విభజనల్లో కాథలికులు Catholicism, ప్రొటస్టంట్లు Protestantism, పెంతకోస్తులు Pantecostalism, తూర్పు సనాతనులు Eastern Orthodoxy, లూథరన్లు Lutheranism, ఆంగ్లికన్లు Anglicanism కొన్ని.

మరణించిన వారందరికీ తీర్పు దినం అనేది ఒకటి ఉంటుందని, శాశ్వత స్వర్గంగాని, నరకం గాని లభ్యమవుతాయని క్రైస్తవం అంటుంది.

(3) సాధారణ శకం 570 – 632: ఇస్లాం మత స్థాపకుడు మహమ్మద్ కాలం ఇది. ఇస్లాం అంటే దేవునికి లొంగి ఉండటం. ముస్లింలది ఏకదేవతారాధన. అరబిక్ భాషలో వారు దేవున్ని 'అల్లా' అన్నారు. ప్రవక్తలందరూ దేవుని వార్తలు అందించే వారని, వారి అంతిమ ప్రవక్త మహమ్మద్ అని విశ్వసిస్తారు. మహమ్మద్ జన్మస్థానం మక్కా. మహమ్మద్ తన అనుచరులతో 622లో మదీనాకు చేసిన వలసని 'హిజ్రా' అంటారు. అది వారికి నూతన సంవత్సర ప్రారంభం. వారి పవిత్ర గ్రంథాలలో ఒకటి ఖురాన్. మహమ్మదుకు అల్లా చెప్పిన మాటలు గలది హడిత్. ముస్లింలు మక్కా వైపు తిరిగి రోజులో ఐదు సార్లు ప్రార్థనలు చేయాల్సి ఉంది. మక్కాకు ఒక మారైనా వెళ్ళాల్సి ఉంది. వారి 'రామదాన్' నెలలో వారు ఉపవాసం ఉండాల్సి ఉంది. ఈ మత ప్రధాన శాఖలుగా సున్ని, షియాలు ఉన్నాయి.

1469 – 1539: పంజాబ్‌లో సిక్కు మతాన్ని స్థాపించిన గురునానక్ కాలమిది. వీరి మత గ్రంథం పేరు 'గురు గ్రంథ సాహిబ్'. బెనారస్‌కు చెందిన సూఫీ మత సన్యాసి కబీర్ బోధనలకు ప్రభావితుడై గురునానక్ అన్ని మతాల నిలయమైన భగవంతుడు ఒక్కడే అనే ప్రాతిపదికపై రూపొందించిన మతమిది. వీరి ప్రార్థనా మందిరం 'గురుద్వారా'. గురు అర్జున సింగ్ 17వ శతాబ్దం అంతానికి గురునానక్ బోధనల్ని పొందుపరచాడు. ఈ మత ప్రచారం చేసిన సిక్కు మత గురువులు పదిమందిలో చివరి గురువు గోవిందసింగ్. వారి మత గ్రంథమైన 'గురు గ్రంథ సాహెబ్' వారికి 11వ గురువు.

స్త్రీ పురుష సమానత్వంతో పాటు మానవ సమానత్వాన్ని వాంఛించే మతం ఇది.

పై మతాలు ప్రాచీన మధ్యయుగాలివి. మానవుని వివిధ భాషల్లో, వివిధ సుదీర్ఘ కాలాల్లో ఏర్పడ్డాయి. ఆ మతాల్లో దేవునికి ప్రాధాన్యత చూపనివి బౌద్ధం, జైనం, కన్ఫ్యూషియస్ మతాలు. దైవ వాక్కులు గలవి అనబడే మతాలు అలానే నిలువక తరువాత కాలాన మానవుని చేతిలో చీలి పోయాయి. నూతనంగా ఏర్పడేవి ఏర్పడ్డాయి. ఆదిలో ఆరంభమైన ప్రకృతి శక్తుల ఆరాధనలు

వెనుకబడ్డాయి. దేవునికి ఓ స్వరూపమిచ్చి, అలంకరించి, ఆలయాలు నిర్మించినా అందుకు ఆధారంగా నిలిచినవి ఆధునికుని వైజ్ఞానిక ఉత్పత్తులే. నేటి మానవజాతి ప్రపంచవ్యాప్తంగా మతాలుగా, వర్ణాలుగా, కులాలుగా, వర్గాలుగా విడిపోయి ఉంది. మానవుడు ఆర్జించిన జన్యు విజ్ఞానం మానవజాతి అంతా ఒక్కటేనని నిర్ధారించింది. అయినా మతాంతర, వర్ణాంతర, కులాంతర వివాహాలు వెనుకబడే ఉన్నాయి.

మన నివాస భూమిపై కూడా మతానికి సరైన అవగాహన లేదు. భూ ఆకృతి గుండ్రమని, అది ఒక గ్రహం అని, విశ్వ లేదా అంతరిక్ష (ఆకాశ) భాగమని తెలియదు. ఆధునికుడు అంతరిక్షాన పరిశోధనా కేంద్రాల్ని నెలకొల్పాడు. అంతరిక్ష పయనాలు చేస్తున్నాడు. మతం ఉన్నవన్న స్వర్గం, నరకాది లోకాలు కల్పితాలయ్యాయి. 'స్త్రీ లేదా పురుష దేవుడో' లేదా దేవతో ఉనికిలో లేనివయ్యాయి. ఆత్మలు లేవు. దయ్యాలు లేవు.

వైజ్ఞానిక ఆవిష్కరణల రీత్యా అంతరిక్షాన ఉన్నవన్నీ గురుత్వాకర్షణ కలిగి, మార్పులో ఉన్న వస్తు పదార్థాలు. తక్కినదంతా శూన్యం . ఆ వస్తు పదార్థాలే నక్షత్ర కూటమిలు, గ్రహోపగ్రహాలు, గ్రహ శకలాలు, రాయి మరియు ఇనుము కలిగిన ఉల్కలు, ధూళి మరియు వాయువులతో ఉన్న తోకచుక్కలు. అన్నీ పదార్థ గురుత్వాకర్షణ బలాన ఒక దానికి మరొకటి ఆధారంగా ఉన్న విశ్వ వస్తువులు. వాటిని మోసేవి ఉండవు. ఒక గ్రహమైన మన భూమిని మోసే స్తంభాలో, ఏనుగులో, ఉండవు. లేనివి ఉన్నట్లు చెప్పటం దేవుని పవిత్ర మత లక్షణం.

అంచనాగా భూగ్రహం ఏర్పడి 450 కోట్ల సంవత్సరాలయింది. భూగ్రహంపై ఏర్పడిన అనుకూల పరిస్థితుల్లో జీవం ఏర్పడింది. జాతుల ఆవిర్భావం, ప్రకృతి ఎంపిక, జీవ పరిణామాన్ని ఇంగ్లాండ్‌కు చెందిన ప్రకృతి, భూగర్భ, జీవ శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ (1809 - 1882) వెల్లడించాడు. అంతేగాక విజ్ఞానం అందించిన కార్బన్ డేటింగ్ విధానంలో భూ పొరల్లోని మానవ పరిణామ దశల శిలాజాల (దంతం, ఎముక) వయసులు కనుగొనబడ్డాయి. భూమి పుస్తకం అయితే... భూ పొరలు పేజీలు. అక్షరాలు శిలాజాలు. పరిణామం జరిగిందనడానికి శిలాజాలే ఆధారాలు. భూమి ఏర్పడ్డాక జీవ పరిణామ దశల్లోని హోమో సేపియన్ (Homo sapien) దశలో సాధారణ శకానికి పూర్వం 75000 - 10000 మధ్య ఏర్పడిన మంచు యుగాన 40,000 సంవత్సరాలకు పూర్వం ఆఫ్రికాలో తెలివైన జీవిగా మానవుని ఆవిర్భావం జరిగింది. దాదాపుగా ఇప్పటికి పదివేల సంవత్సరాల క్రితం వ్యవసాయం నేర్చి, స్థిర నివాసియై, సామాజిక జీవి అయ్యాడు. దేవుడు మనిషిని సృజించాడన్న మతాలకు ఇది వ్యతిరేకం.

మానవ విజ్ఞానం గాని, నాగరిక జీవనం గాని దైవారాధనలతోనో, యోగ సాధనతోనో, మహిమగానో, మంత్రించినట్లో సిద్ధించింది కాదు. ఏ దేవుని అధీనంలోనిది కాదు. మత శిక్షల్ని అనుభవిస్తూ విజ్ఞాన శాస్త్రజ్ఞులు చేసిన నిరంతర కృషి ఫలితమది.

జీవులన్నీ శ్రమపై ఆధారపడి జీవిస్తున్నవే. ఆరాధనలు, ప్రార్థనలు భౌతిక, అభౌతిక సుఖ జీవనాన్ని ఇచ్చేవి కావు. మత గురువుల జీవితాలైనా, దైవశక్తి వంతులమనే వారి జీవితాలైనా పరుల శ్రమపై ఆధారపడుతున్న జీవితాలే. మానవజీవి కృతజ్ఞతలు, పొగడ్తలు, ప్రార్థనలు, ముడుపులు నేరుగానో, మరో విధంగానో స్వీకరించడానికి, సంతోషించి మారుగా సకల లోక సుఖ జీవనాన్ని అందించడానికి దేవుడు గాని, దైవ శక్తి గాని ఎక్కడా, ఏనాడూ ఉనికిలో ఉన్న జాడలేదు. ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా మత సమానత్వం, సామరస్యం కోరేది కొందరు. మత నిర్మూలన కోరేది మరికొందరు. భౌతిక విజ్ఞానాన్ని, విచక్షణా జ్ఞానాన్ని ఇచ్చే విద్య, పరిశోధనా తత్వం, మతరహిత జీవనం, కృషి నేటి అవసరాలు. అవి అమూల్యాలు. ●

# మేలుకొలుపు

– చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి

**ఈ** జగత్తులోని ప్రతి ప్రాణి అమ్మతనాన్ని ఆవిష్కరిస్తూనే వుంటుంది. అమ్మతనాన్ని; తత్వాన్ని అన్ని ప్రాణులలో ఎవరు ఎంతగా ఆస్వాదిస్తారో అంత ఆనందాతిశయంగానే వుంటుంది.

అమ్మ నాన్నల ప్రేమ – వాత్సల్యాలు, మరులు – మమతానురాగాలు – బంధాను బంధాలు, త్యాగం – రాగం అందరికి ఆదర్శం. వారి తత్వం – సత్వం భాషకందనిది, భావాలకు చిక్కనిది. విస్తృత పరిధి గలిగిన విశ్వజననీ–జనకులు వారు. శాశ్వతమైనవారు, అక్షరమైనవారు, ప్రత్యక్షంగా నయనానందకరంగా కనుల యెదుట నడయాడుతూ... భవిష్యత్తరాలకు నడక – నడత నేర్పుతూ, భవిభషత్తుకు బంగరుబాటలు నిర్మించేవారు, కర్త, కర్మ, క్రియలు అమ్మ – నాన్నలు.

అమ్మ – నాన్నలు అందరి మెప్పులు – డిప్పులు పొందినవారు. అందరికీ అవసరం, అవశ్యం, అంగీకారం – ఆదర్శం అయినవారు. అమ్మా – నాన్నలను ఇలా అందరు అనునిత్యం – అహర్నిశం కొనియాడుతున్నారు! ఎందుకు..?.. అంటే..

మనిషి పుట్టక ముందు, ప్రపంచానికి పరిచయం కాక ముందు ఈ లోకాన్ని చూడాలంటే... అమ్మ కడుపులో తొమ్మిది నెలలు జీవశక్తిని పొంది పెరిగినందుకు!

తొమ్మిది నెలల జీవితంలో అమ్మ ఉదరమనే పాఠశాలలో అమ్మను గురించి, ఆమె తత్వాన్ని గురించి తెలుసుకొన్నందుకు, పుట్టిన తర్వాత అమ్మ మెత్తని పొత్తిళ్ళ వెచ్చదనంలో ఒత్తిగిలి – సత్తువ పొందినందకు!

అమ్మ గుమ్మ పాలు తాలుగూ తన్మయత్వం పొందినందుకు!

అమ్మ ఆలింగనంలో ఆనందాతిశయంతో ఆదమరచినందుకు!

అమ్మ లాలిపాటలు – జోలపాటలు ఆలకిస్తూ పులకింతలతో మైమరిచిపోయినందుకు!

నాన్న నుడులలో అడుగులు వేసినందుకు!

నాన్న మార్గంలో నడయాడి నందుకు!

అమ్మనాన్నల ఆశయాలె ఆదర్శమైనందుకు! అందుకు!

అమ్మ–నాన్నలలోనే జగమంతా గర్భితమై వున్నందుకు! అందుకు కారకులైన అమ్మ నాన్నలు నిత్యసత్యమైనవారు!

ఇలా అమ్మ – నాన్నలు నిత్య సత్యమైన వారుగా ఏకంగా ఉమ్మడిగా తెలుస్తున్న నేపథ్యంలో...

ఆ తల్లిదండ్రుల పిల్లలమైన మనం ఏకంగా లేక, ఉమ్మడిగా వుండలేక చీలి.. చీలికలై పోతున్నాము. పుడుతూ అన్నాదమ్ములు; అక్కా చెల్లెళ్ళుగా పుట్టి–పెరుగుతూ దాయాదులమై పోతున్నాం! గొడవలు పడుతున్నాం! వేర్లుపడి – ఆస్తులు పంచుకొని చీలిపోతున్నాం. ఎవరికి వారే ఎమునా తీరే అవుతున్నాం. అంతటి ఆదర్శనీయమైన అమ్మ నాన్నలను వదలి బతుకుతున్నాం! ఎవరికి నచ్చిన 'మతాన్ని' విశ్వాసాలను – మతమార్మికాలకు లోనై మత మాయ మాటలను నమ్మి జీవిస్తున్నాం! మతం ముసుగులో తెలియరాని విషయాన్ని 'దేవునిగా' నమ్మి, విశ్వసించి అదే పరమానందమనుకొని బతుకును భజనలుగా చేసి; మనసు బానిస కాగా పూజిస్తున్నాం!

మనం తల్లి – దండ్రులమైనా కూడ ఆ తాత్త్వికానందాన్ని దూరం చేసుకొని 'పుణ్యం – పాపం' అని; 'స్వర్గం–నరకం' అని; 'మోక్షం – దేవుడు' అని మత మాయా ఊబిలో పూర్తిగా

దిగబడిపోయి; తల్లిదండ్రులు; 'అన్నాదమ్ములు', 'అక్కాచెల్లెళ్ళు' అనే ఊసేలేక, తలపేలేక... ఏదో వుందన్న... ఏమీకాని... ఏదీ లేని దాని కొరకు ఊహల్లో ఊగిసలాడుతూ వేసారి పోతున్నాం!

ఈ పరిస్థితులకు ఏ పేరు పెడదాం. ఈ విధానాన్ని ఏమని చెపుదాం!

ఎదురుగా ప్రత్యక్షంగావున్న అమ్మనాన్నలను గురించి... పరిశోధనాత్మకంగా మనకు తెలిసిన విషయమే. కాని.. ఏమీ తెలియరాని విషయాన్ని గురించి (దైవం) కష్టనష్టాలను భరిస్తూ... నైవేద్యాలతో, పూలు – పండ్లతో – పూజలతో; భజనలు, యాత్రలు, పుష్కరాలు – కుంభమేళాలతో అనేకానేక అనవసరమైన అనారోగ్యపు పనులు చేసి తృప్తిజెందలేక... ఫలితం కనరాక.., పోగా... వెకిలి – వికటులైన బాబాలు, సాములు, ఫాదర్లు, ఫకీర్లు మొదలగువారిని నమ్మి వారికి కానుకలు – భూములు యిచ్చి పోషిస్తూ– మోసపోతూ వున్నామె కానీ.. అంత భక్తితో మూఢులమై సేవిస్తూ.. పూజిస్తున్న ఆ దైవాన్ని గురించి తెలుసుకోవాలనే ధ్యాసేలేని మత మార్మిక అజ్ఞానంలో నలిగిపోతున్నాం! ఇదా – జీవితమంటే...? ఇదా మనిషిగా జన్మించినందులకు మనం సాధించుకొన్న మంచి మనుగడ మార్గం? కాదు..!

ఇకనైనా తెలుసుకొందాం..! 'రామాయణం'లో.....

శ్లో॥ బీజమాత్రమ్ పితాజన్తోః! శుక్లం రుధిర యేవచ!
సంయుక్త మృతు మన్మాత్రా। పురుష స్యేహ జన్మతత్। *అయోం 108–11 లో చెప్పారు.*

ప్రాణికి తండ్రి బీజము మాత్రమే! తల్లి రుతుమతి అయినపుడు శుక్లము, శోణితము కలవగా పురుషుడు జన్మించుచున్నాడు!

కనుక సృష్టికి మూలం స్త్రీపురుషులనే తెలియజేస్తున్నారు.

ఇలాగే భారతంలో ....... "స్త్రీ పురుష సంయోగం వలన పుట్టిన లోకం యొక్క" భా॥ ఆది–1–1.... అని భారతం మొదటి శ్లోకం ద్వారా తెల్పిన ఈ సత్యాన్ని గమనింపవచ్చు!. ఇలాగే మరొక చోట

గర్భయోనియందు, ఋతుకాలమందలి 'స్త్రీ రజస్సు' తో కూడినదై పురుషుని 'రేతస్సు' కలవగా ఆ గర్భయోనియందు శబ్ద, స్పర్శాదులైన ఐదు తన్మాత్రలు రూపొంది క్రమముగా అవయవాలేర్పడి జీవంపొంది జన్మిస్తారు? – భార – ఆది – 3–221

(స్త్రీ–పురుషుల సంయోగం వలననే ప్రాణులు జన్మిస్తాయని "ఈ సృష్టికి మూలకారణం స్త్రీ – పురుషులేననే సత్యాన్ని ఎల్లెడలా పేర్కొనడం జరిగింది.)

అలాగే సృష్టికి కామమే ప్రధానమని .....

* "కామయజ్ఞే ప్రథమో" అని అధర్వవేదం –9–2–19 తెలియ జేస్తుంది.

* సాంఖ్యులు కూడా 'సృష్టికి మూలం స్త్రీ–పురుషులే" అని చెప్పారు.

కనుక "సృష్టికి స్త్రీ పురుషులే కారణం"! అంతేకాని 'దేవుడు అనే సృష్టికర్త వేరుగా లేడని అన్ని గ్రంథాల ద్వారా తెలుస్తుంది'.

ఇంకా ముఖ్యంగా అంతటా నిత్యపారాయణంగా కీర్తించే భగవద్గీతలో.....

శ్లో॥ అసత్యమ ప్రతిష్ఠంతే । జగదాహు రనీశ్వరమ్।
అపరస్పర సంభూతం । క్రిమన్యత్ కామ హైతుకమ్। – గీత – 16–8

ఈ జగత్తు ఆశ్రయ రహితమైనది. ఈశ్వరుడే లేనిది (స్త్రీ – పురుష) పరస్పర సంభూతమైనది. కామమే కారణం. అన్యం లేనిది.

(ఈ జగత్తు సర్వం ఆశ్రయరహితమైనది. స్వయం సంభూతమైనది. స్వయం కారణం, స్వయం సమృద్ధం, స్వయం సంపూర్ణమైనది. నియమ బద్ధమైనది. దీనికి కారకుడు వేరెవ్వరులేరు. దేవుడనేవాడు లేడని, దేవుడు అసత్యమని, (స్త్రీ–పురుషులు సంయోగము వలననే ఈ జగుత్తు ఉత్పత్తి జరుగుచున్నది. అంతేకాని అన్యకారణం మరొకటి లేదని తేల్చిచెప్పారు.))

దేవుడు లేదు! ఉన్నదల్లా తల్లి–దండ్రులే!

వారే సృష్టికర్తలు! అని చెప్పడానికి ఇంతకన్నా ప్రబల నిదర్శనాలు ఇంకేం కావాలి!

అనేక కోట్ల సంవత్సరాలుగా ఈ విశ్వపదార్థం నుండి జీవోత్పత్తి జరిగి నిరంతర పరిణామశీలిగా వుంది. ఈ విషయాలు మతస్తులకు తెలియక ఊహించి కల్పించి ఇటీవలె వ్రాసుకున్నవి వారి మత గ్రంథాలు. ఇవి "విశ్వమానవ సంబంధాలు కావు". లేని... కల్పిత దైవసంబంధాలే ఈ మత గ్రంథాలు!

ఈ సృష్టికార్య విషయాన్ని 'బైబిల్ – ఖురాన్'లలో పదార్థంలో జరిగే రసాయనిక చర్యల వలన జీవం ఉత్పన్నమవుతుందని భౌతికంగానే ప్రాణులు ఉద్భవిస్తాయని పేర్కొనడం జరిగింది.

ఈ విషయాలకు ముగింపు పలుకుతూ ప్రాచీనంగా – పెద్దలు...

శ్లో॥ నమోక్షో నభసః పృష్టే। పాతాలే నచ భూతలే !
మోక్షోహి  చేతో విమలం। సమ్యక్ జ్ఞాన విబోధితమ్ ।

'మోక్షమనునది ఆకాశములోగానీ, పాతాళంలోగాని, భూలోకంలోగాని లేదు! సమ్యక్ జ్ఞానము వలన కలుగు నిర్మల చిత్తమే మోక్షం' అని... మోక్షం గాని స్వర్గ – నరకాలుగాని ఎక్కడా లేవు! తన జ్ఞానమే మోక్షం, తన సంతోషమే స్వర్గం అని వివరించారు.

అలాగే అభూతకల్పనగా మిగిలిపోయిన దైవాన్ని గురించి...

శ్లో॥  నదేవో విద్యతే కాష్ఠే। నపాషాణే నమృణ్మయే।
భావేషు విద్యతే దేవః। తస్మాత్ బావోహి కారణమ్।

'దైవం' కర్రలోనూ, రాతిలోనూ, మట్టిలోనూ లేదు. మనసులో పుట్టినదే దైవభావం. అందుచేత భావమే కారణం అన్నారు పెద్దలు. దైవం అనేది వాస్తవంగా లేదు. అది ఊహా, అపోహ భావాలకు సంబంధించినదే అని పెద్దల వలన కచ్చితమైన విషయం తేలిపోయింది.

ఇలా వివిధ గ్రంథాలలో తెలియజేస్తున్న విషయాన్ని సత్యాన్ని కాదని – ఆ తర్వాత మతాలవారు మార్మికంగా 'దేవుడు–సృష్టి' అని ప్రచారం చేస్తూ అమాయక ప్రజలను నమ్మించి విశ్వాసులుగా, భక్తులుగా మార్చే వారి దుష్ప్రచారాలను నమ్మక తగిన చికిత్సచేయాలి.

ఆ॥ పుట్టు పుట్టజేయు; పెట్టు పోషణ జేయు
చక్క దిద్దు బతుకు సాగజేయు
కర్త, కర్మ, క్రియల నర్తించు, నడిపించు
సంతరించు మనిషి! సాక్షిమనిషి!

కనుక అసలు సత్యం తెలుసుకోవాలి!.... కరుడుగట్టిన వ్యవస్థీకృత మత భావనా రీతులను, విశ్వాసాలను అధిగమించే అపూర్వ వైజ్ఞానిక వైఖరితో మనిషి ముందడుగు వేయాలి.

మనిషిలో వున్న విజ్ఞాదృష్టి, సత్యదృష్టి, వాస్తవదృష్టి, మానవదృష్టితో మనిషిగా ఎదగాలి.

జీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపుకోవాలి! మనుషులంతా (స్త్రీ పురుషులు) ఒక్కటనే భావనతో సమహోదాలు గలిగి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల జీవనం సాగించాలి! ●

# సమాజం - మూఢనమ్మకాలు - వాస్తవాలు

**– జి. కమలారామ్,** జనవిజ్ఞాన వేదిక

**ఈ** సమాజంలో వందల సంవత్సరాలుగా ఎన్నో మూఢనమ్మకాలు మూఢసాంప్రదాయాలు పాతుకుపోయాయి. వాటిని కొందరు స్వార్థపరులు పెంచి పోషించారు. రాళ్ళూ రప్పలే దేవుళ్ళనీ, గుళ్ళూ గోపురాల వల్ల పుణ్యం వస్తుందని నమ్మించారు. కాని ఈ రాళ్ళకు నోళ్ళోచ్చి గళం విప్పిన రోజు... నిజం చెప్పిన రోజు... ఎవరు తనను సృష్టించారో ఏ స్వార్థానికి తమను వాడుకుంటున్నారో తెలిసిన రోజున చైతన్యం రాకుండా ఉండదు.

ఈ మానవ పరిణామానికి ఒక దైవశక్తే కర్త ఐతే ఈ సమాజంలో ఇన్ని లోపాలు ఎందుకు? ఇన్ని అవకతవకలెందుకు, ఇన్ని అస్తవ్యస్తాలు ఎందుకు? ఇన్ని కులాలు, మతాలు, జాతులు, వర్గాలూ ఎందుకు? ఈ మోసాలు అన్యాయాలు, దుర్మార్గాలు దోపిడీలు హత్యలూ ఎవరు చేయిస్తున్నారు? వీటన్నిటికి కారణం సృష్టించిన వాడేనా! ఏ తండ్రైనా తన బిడ్డలను దొంగలుగా రౌడీలుగా హంతకులుగా నేరస్తులుగా కావాలని కోరుకుంటాడా? ఏ దేవుడైనా తన సృష్టిని తనే అస్తవ్యస్తంగా, అవకతవకలుగా చేసుకుంటాడా? ఆలోచించండి.

మనల్ని దేవుడే రక్షిస్తున్నాడనేది నిజమైతే.. పుణ్యక్షేత్రాలకు, దేవాలయాలకు ప్రయాణిస్తున్న అనేకమంది భక్తులు యాక్సిడెంట్లు – ప్రమాదాలు జరిగి ఎందుకు మరణిస్తున్నారు? దైవకార్యక్రమాల్లో జరిగే తోపులాటల్లో ఎందుకు చనిపోతున్నారు? ఎన్నో దేవాలయాల్లో అనేకసార్లు దొంగతనాలు జరిగి దేవుడి విగ్రహాలను దేవుడి సొమ్ములను దోచుకెళ్ళిన సందర్భాలలో ఎన్నడైనా తనను తాను రక్షించుకోగలిగాడా? దోచుకెళ్ళకుండా తన మహిమలతో ఆపగలిగాడా? తననే నమ్ముకొని తనసేవ చేసుకునే పూజారులను ఆపదలనుండి రక్షించాడా? తనను తాను రక్షించు కోలేనివాడు ఇక మనలనేల రక్షిస్తాడు? మన బాధలనేల తీరుస్తాడు. ఆలోచించండి.

కొందరు స్వార్థపరులు వాళ్ళ అధికారం కోసం, వాళ్ళ స్వప్రయోజనం కోసం దేవుళ్ళను సృష్టించి, దేవాలయాలు నిర్మించి మనిషిలోని అజ్ఞానానికి మూఢత్వానికి పునాదులు వేసి వాస్తవాన్ని సమాధి చేసారు. సామాన్యుడిని కర్మ సిద్ధాంతాల పాలుచేసి అజ్ఞానాంధకారంలోకి తోసి తమ అధికారాన్ని రక్షించుకున్నారు. మీరంతా మాకు బానిసలు, మిమ్మల్ని దేవుడలా సృష్టించాడు, మమ్మల్ని ఇలా పాలకులుగా సృష్టించాడు అంటూ తప్పుడు పురాణాలతో భక్తి మూర్ఖత్వంలో ముంచారు. దానికి పురోహిత వర్గం ఆజ్యం పోసింది, వాళ్ళ కడుపులు నింపుకోవడానికి మనల్ని మూఢనమ్మకాల మత్తులోకి నెట్టారు. మనం ఒక్క నిజం తెలుసుకోవాలి, మన రెక్కల కష్టం దాచుకున్ననాడు తిండి ఉంటుందా? మన శ్రమ దాచుకున్న నాడు బ్రతుకు ఉంటుందా? అలోచన లేకుండా అభివృద్ధి ఉంటుందా? మానవశక్తి, మేధస్సు, కృషి, పట్టుదల లేకుండా సమాజాభివృద్ధి జరుగుతుందా? కష్టపడకుండా ఏదీ ఉచితంగా రాదు, శ్రమలేకుండా ఏదీ జరగదు.

ఏ దేవుడో మనల్ని సృష్టించాడని నమ్ముతున్నాం, కాని మనమే ఆ దేవుడ్ని సృష్టించాము. గుడి కట్టించింది మనమే, విగ్రహాన్ని తయారుచేసింది మనమే, ప్రతిష్టించింది మనమే, నైవేద్యం పెట్టేది మనమే, మడులు మాన్యాలు ఇచ్చింది మనమే, పూజలుచేసేది మనమే, పెళ్ళిళ్ళు చేసేది

మనమే, అన్ని మనం చేస్తూ, మనకేదో చేస్తాడని ఇస్తాడని నమ్మడం మన అజ్ఞానానికి నిదర్శనం. మనం తెల్చుకోవాల్సిన వాస్తవం ఏమిటంటే ఈ మానవ సృష్టికి మూలం ప్రకృతే. అదే అసలైన మహాశక్తి. అది సహజ సిద్ధమైనది, ఎన్నో వేల సంవత్సరాల పరిణామక్రమంలో స్వతహాగా ఏర్పడింది. ప్రకృతి నిష్పక్షపాతంగా సహజ సిద్దంగా ఇచ్చే భూమి, గాలి, నీరు, వెలుతురు, చీకటి, ఎండ, చలి, చెట్లు, వర్షం ఇలా మొత్తం వాతావరణాన్ని మనం ఉపయోగించుకుంటూ, మనకు అనుకూలంగా మలచుకుంటూ, అవసరాలకు సమకూర్చుకుంటూ అనేక మార్పులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాం.

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుంది. దీని వలన రాత్రి పగలు ఏర్పడతాయి. భూమి తన చుట్టూ తాను తిరగటానికి ఒక రోజు కాలం పడితే, సూర్యుని చుట్టూ తిరగటానికి ఒక సంవత్సరకాలం పడుతుంది. ఇవి ప్రకృతిలో సహజ సిద్ధంగా జరిగే చర్యలు, ప్రకృతి తన పని తాను నిర్వర్తిస్తుంటుంది. వీటిని ఏ పూజలు, మహిమలు, మంత్రాలు మార్చలేవు. మహిమలు ఉన్నవి నిజమైతే.. ఈనాడు మనకు ఈ వరదలు, పెనుతుఫాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, వినాశనాలు, మారణహోమాలు జరిగుండేవి కావు. మానవులకు ప్రమాదాల వలన వాహన యాక్సిడెంట్స్ వలన మరణాలు సంభవించేవికావు. రోగాలతో అంటువ్యాధులతో వింత జబ్బులతో మరణించేవారు కాదు. ఎవరో మనుషులు చంపితే చనిపోయేవారు కాదు. మహిమలు, మంత్రాలూ అన్ని కట్టు కథలు, కల్పనలూ మాత్రమే, వాస్తవాలు కాదు. అయితే మానవులలోని కొందరు మేధావులూ, మహనీయులూ తమ సుఖాల్ని, ఆనందాల్ని, కుటుంబాన్ని, తమ ప్రాణాల్ని సైతం లెక్కచేయక తమ మేధస్సుతో శాస్త్ర విజ్ఞానంతో మానవ కళ్యాణంకోసం త్యాగం చేయకపోతే, పరిశోధనలు జరిపి ఎన్నో వస్తువులు కనిపెట్టకపోతే ఈరోజు మనకు వెలుగునివ్వడానికి లైట్లుండేనా, గాలినివ్వడానికి ఫ్యాన్లుండేవా.. ఆరోగ్యానికి మందులుండేవా.. దూరసమాచారానికి ఫోన్లుండేవా? ప్రయాణాలకు బస్సులూ, రైళ్ళు, విమానాలుండేవా? మానసిక వికాసానికి టీవీలూ, డివిడిలూ, సినిమాలు ఉండేవా? పొలం దున్నటానికి ట్రాక్టర్లు ఉంటాయా? ఇవన్ని ఎక్కడివి? ఎలా వచ్చాయి? ఎవరు కనిపెట్టారు? మానవుడు తన సమస్యలకు, తన అనుభవంతో ఆలోచనలతో మేధస్సుతో కృషి చేసి, ప్రయోగాలు చేసి పరిశోధనలు జరిపి సాధించుకున్న విశిష్ఠ సంపద, మేధావులైన శాస్త్రజ్ఞుల అపారమైన జ్ఞానంతో శ్రమతో పొందిన ఘనవిజయం ఇది.

ప్రకృతి, ప్రపంచంలోని అందరికి ఒకే విధమైన ప్రయోజనాన్నిస్తుంది. దానిని మనం ఉపయోగించుకొనే విధానంలో మాత్రమే తేడా వుంటుంది. తొలి దశలో ఆకులు, పండ్లు తింటూ నీరు త్రాగుతూ గాలిపీల్చుతూ చెట్లక్రింద బతుకుతున్న మానవుడు తన అవసరాలతో, ఆలోచనలతో కాలక్రమేణా భూమిని దున్నుకుని పంటలు పండించుకొని, ధాన్యం వండుకుని తింటూ జీవించసాగాడు, మొదట్లో చెట్ల క్రింద బ్రతికిన మానవుడు, ఆ చెట్ల కొమ్మలతో ఆకులతో గుడిసె వేసుకున్నాడు. ఆ తరువాత రాళ్ళు, మట్టితో ఇల్లు కట్టుకున్నాడు. ఇప్పుడు ఇంకా అభివృద్ధి చెంది సిమెంటు, ఇటుకలతో 20 అంతస్తుల భవనాన్ని నిర్మించుకుంటున్నాడు. ఇంకా భూమిలో దొరికే అనేక లోహాలతో, నాగళ్ళు, ట్రాక్టర్లు, వాహనాలు, యంత్రాలు పరిశ్రమలు స్థాపించుకుని జీవిస్తున్నాడు. ఇలా ప్రతి వస్తువును ప్రయోగాలతో పరిశోధనలతో కనుగొంటూ అభివృద్ధి చెందాడు.

మొదటిసారిగా కరెంటును ఓల్టా అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. అలాగే ట్యూబులైట్ను థామస్ అల్వాఎడిసన్, ఫోన్ను – గ్రహంబెల్, రేడియోను – మార్కోని, గడియారాన్ని – హ్యూజెన్స్, రైలును – స్టీఫెన్ సన్, విమానాన్ని – రైట్ సోదరులు అలాగే భూమిగుండ్రంగా ఉందని కొలంబస్, వాస్కోడిగామా కనుగొన్నారు. ఇలా ప్రతి విషయాన్ని అనుభవాలతో, ఆలోచనలతో, ప్రయోగాలతో, పరిశోధనలతో కనిపెట్టి మన తరాలకు ఆదర్శప్రాయులయ్యారు, మనకు మార్గదర్శకులయ్యారు, ఆ మేధావుల కృషి సేవల ఫలితాన్ని ఈనాడు మనం అనుభవిస్తూ, ఆనందిస్తూ, సుఖంగా బ్రతుకుతున్నాం, కానీ ఇంకా రాళ్ళను రప్పలను పూజిస్తూ శాస్త్రవేత్తలను మర్చిపోతున్నాం, మేధావులూ శాస్త్రవేత్తలూ లేకుండా శాస్త్ర విజ్ఞానాభివృద్ధి సాధ్యమవుతుందా? సమాజ అభివృద్ధి జరుగుతుందా....

ఒకనాడు వంట కోసం, కట్టెలు కొట్టుకొని మట్టి పొయ్యి మండించి గొట్టంతో ఊదుకుంటూ ఎన్ని అవస్థలు పడ్డామో తెలుసుగా, ఈ రోజు గ్యాస్తో ఎంతో సులభంగా వంట చేసుకుంటున్నాం. ఆ రోజు బిందెనీళ్ళ కోసం చేదతాడుతో బావి దగ్గరకు వెళ్ళి తోడటానికి ఎన్ని కష్టాలు పడ్డామో. కానీ, ఈ రోజు స్విచ్ నొక్కితే ట్యాంక్ నిండుతుంది. ఆనాడు అరబస్తా ధాన్యాన్ని రోట్లో పోసి దంచటానికి ఎన్ని అవస్థలు పడ్డామో, ఈనాడు పది బస్తాల ధాన్యాన్ని మిల్లులో మర ద్వారా పది నిముషాలలో పొందుతున్నాం. నాడు చీకటి పడితే ఏమీ కనపడక గుడ్డివాళ్ళమయ్యాం, నేడు స్విచ్వేస్తే పట్ట పగల్లా కాంతిమయం, ఆనాడు దూర బంధువులకు ఏదైనా ముఖ్యవిషయం తెలపాలన్నా, మరణవార్త చేరవేయాలన్నా రోజులు పట్టేవి, ఈ రోజు సెల్ఫోన్ ద్వారా క్షణాల్లో తెలుపగలుగుతున్నాం.

ఇవన్నీ మానవుడు సైన్స్ వలన సాధించిన ప్రయోజనాలు, ఇన్ని ప్రయోజనాలు పొందుతూ ఇంకా మనం చెట్లనీ, పుట్లనీ.. రాళ్ళనీ... రప్పలనీ... సన్యాసులను... స్వామీజీలను, దెయ్యాలను, భూతాలను, జాతకాలను, మంత్రాలను, మహిమలను, చేతబడులను అన్నిటిని నమ్మటం అవివేకం కాదా.... విద్య విజ్ఞానం లేనపుడు ఉండే మూఢనమ్మకాలు, ఊహలు భావాలు వేరు, చదువు, విజ్ఞానం పెరిగాక ఆలోచనల్లో మార్పు తెచ్చుకోవాలి. ఆనాటి పరిస్థితులకు, అవసరాలకు తగినట్లుగా ఆ కాలంలో దొరికే వస్తువులను వాడుకున్నాం. వస్తు మార్పిడి విధానాన్ని పాటించాం, సైన్సు పెరిగాక వస్తు తయారీదారులు పెరిగాక వస్తు మార్పిడివిధానం తగ్గి పోయి కొనుగోలు విధానం పాటిస్తున్నాం.

అలాగే విద్య విజ్ఞానం ఆలోచన్లు పరిశోధనలు పెరిగాక మూఢవిశ్వాసాలు తొలగిపోవాలి. అదే శాస్త్రవిజ్ఞాన దృక్పథం, ఒకప్పుడున్న కులహీనభావాలు తగ్గిపోయి ఈ రోజు అన్ని కులాల వారు కలిసి చదువుకుంటున్నారు, అందరూ కలిసి ప్రయాణిస్తున్నారు, కలిసి సహపంక్తి భోజనాలు చేస్తున్నారు, కలిసి జీవిస్తున్నారు. ఒక్కడుగు ముందుకేసి కులాంతర వివాహాలు కూడా చేసుకుంటున్నారు. ఇది కొంత మార్పు, ఇంకా ఆలోచనాసరళిని మార్చుకొని విచక్షణా జ్ఞానంతో నైతికవిలువలను పెంచుకొని మానవులు ఉన్నతంగా ఎదిగితే సమాజం మారుతుంది. సమాజ మార్పు ప్రపంచానికే ఆదర్శమై అందరికీ మార్గదర్శక మవుతుంది. అనతికాలంలోనే అత్యున్నత ప్రగతి సాధ్యమౌతుందని మనస్ఫూర్తిగా ఆశిద్దాం, మార్పును ఆహ్వానిద్దాం, చైతన్యాన్ని స్వాగతిద్దాం, ప్రగతిని సాధిద్దాం, మంచిని అందిద్దాం. ●



# తప్పిపోయిన మనుష్యులను వెతుకుదాం ... రండి ?

## చార్వాక (తోటకూర) వెంకటేశ్వర్లు

– పోలిశెట్టి గోపాలకృష్ణగోఖలే

**రగిలే నిప్పు కణిక :**

**బా**పట్ల జిల్లా చీరాలకు సమీపంలోని సంతరావూరు చార్వాక వెంకటేశ్వర్లుగా ప్రసిద్ధులైన తోటకూర వెంకటేశ్వర్లు స్వగ్రామం. వీరు 1943 అక్టోబర్ 9న జన్మించారు. డిగ్రీ వరకు చదువుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేశారు. విజయవాడలో నివాసం. ప్రచార పటాటోపాలకు దూరంగా అతి సామాన్య జీవితం గడిపిన మహామనీషి. అనేక సభలు నిర్వహించడమే తప్ప ఎప్పుడూ వేదికెక్కి ఉపన్యాసాల జోలికి పోనట్టి కార్యాచరణ ధీశాలి. ముక్కుసూటిగా, నిజాయితీగా, నిఖార్సిగా జీవించడమెంత కష్టమో తెలిసినా, ఆ కష్టాలను ఇష్టాలుగా స్వీకరించి, ఏటికి ఎదురీదిన ధీరోదాత్తుడు. తన కుమార్తె పాస్‌పోర్టు విషయములో లంచమీయకుండా నిలిచి, అవకాశం పోయినా రాజీపడని నిజాయితీకి నిలువుటద్దం.

**రాయ్ ప్రభావం :** ఎం.ఎన్.రాయ్‌గా ప్రసిద్ధులైన మానవేంద్ర నాథ్ రాయ్ సాహిత్యం ఆయన్ని బాగా ప్రభావితం చేయటంతో రాడికల్ హ్యూమనిస్ట్‌గా మారారు. తను నమ్మిన ఆశయాలను త్రికరణశుద్ధిగా ఆచరించిన ఆచరణ జీవి. సాహిత్య పఠన పిపాసి. హాస్యాన్ని ఆనందంగా ఆస్వాదించటం ఆయన ప్రత్యేకత. పాత సినిమా పాటలు వినడం హాబీగా మార్చుకున్న సంగీత ప్రియుడు.

**'చార్వాక' ప్రస్థానం :** ప్రపంచ ప్రసిద్ధ హేతువాది కేరళకు చెందిన అబ్రహం థామస్ కోవూర్ ప్రభావంతో హేతు భావజాల వ్యాప్తికి పత్రికను ఒక దానిని తీసుకురావాలనే ఆకాంక్షతో వివిధ వ్యక్తులను సంప్రదించినా, స్పందన రాని నేపథ్యంలో తానే సాహసించి ఒక పత్రికను తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ పత్రికకు 'చార్వాక' అని పేరు పెట్టాలని సంకల్పించారు. ఆ విషయాన్ని 'రేపు' మాసపత్రిక సంపాదకులు సి. నరసింహారావుగారితో చర్చించగా ఆయన తన ఆమోదం ప్రకటించారు. ఆ రోజులలో నరసింహారావుగారి దగ్గర పనిచేస్తున్న పింగళి దశరథరామ్ కూడా తన మద్దతును తెలిపారు. పింగళి దశరథరామ్ తర్వాత కాలంలో సంచలన ఎన్‌కౌంటర్ పత్రికకు సంపాదకులుగా నిర్వహించారు. అక్షరమే ఆయుధంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో హేతుభావజాలంతో ఉగ్రూతలూగించిన 'చార్వాక' మాసపత్రిక 26 జనవరి 1976న డాక్టర్ సమరంగారి కుమార్తె శ్రీలత తొలిసంచికను విడుదల చేశారు. ఆ విధంగా తెలుగు నేలపై హేతువాద విత్తులను వెదజల్లి అభ్యుదయ భావజాల వెలుగులను ప్రసరింపజేసిన తేజోమూర్తి.

**పత్రిక ప్రభావం :** లబ్ద ప్రతిష్టులైన రచయితలతో, హేతు విజ్ఞాన పరంపరతో వర్ధిల్లిన పత్రిక, అచిరకాలంలోనే పలువురి ప్రశంసలు పొందటమే కాదు, ఎక్కువ మందిని హేతువాదులుగా మార్చి, హేతువాద సంఘాల శాఖల ఏర్పాటుకు దోహద పడింది. వ్యయప్రయాసలకు వెరవకుండా

విజయవాడలో మూడుసార్లు హేతువాద అధ్యయన తరగతులు నిర్వహించి, ఎందరెందరినో హేతువాదులుగా తీర్చిదిద్దిన నిత్య కృషివలుడు. నిరాటంకంగా పత్రికను వెలువరించడానికి తన సర్వశక్తులను ధారబోసిన అసమాన్య మహామనిషి. శ్రమకోర్చి, చెమటోడ్చి పత్రిక ప్రగతి కోసం కృషిచేసిన మహనీయుడు. సంపాదకునిగా తన పేరుని కూడా ప్రకటించుకోని త్యాగధనుడు.

చార్వాక పత్రిక పాఠకులను ఎంత ప్రభావితం చేసిందో చెప్పడానికి ఒక మచ్చుతునక ఏమిటంటే నెల్లూరులో బుక్‌స్టాల్ నిర్వాహకుడు, పరమ ఆస్తికుడైన 'మణి' అనే కేరళీయుడుని నాస్తికునిగా మార్చడమే కాకుండా, అభ్యుదయ సాహిత్య విక్రేతగా మార్చిన ఘనత 'చార్వాక' పత్రికదే. పత్రికలో తమ రచనల ప్రచురణ ద్వారా ప్రాచుర్యం పొందినవారిలో జస్టిస్ ఆవుల సాంబశివరావు, జస్టిస్ పి.ఏ చౌదరి, సినీకవి జొన్నవిత్తుల, గుడివాడకు చెందిన గణేశ్వరం బాబురావు, మత గ్రంథాల మాయాబజార్ రచయిత ఈశ్వర ప్రభు, గాంధేయవాది ఎలమంచిలి వెంకటప్పయ్య, తెనాలికి చెందిన బొల్లిముంత నాగేశ్వరరావు, భీమవరానికి చెందిన కదలి శ్రీరామమూర్తి, ప్రగతిశీల రచయిత చిత్తజల్లు వరహాలరావు (సి.వి), పెళ్లి మంత్రాల బండారం రచయిత వెనిగళ్ళ సుబ్బారావు, విజయవాడకు చెందిన సింగంపల్లి అశోక్‌కుమార్, గుత్తా శ్రీనివాసరావు ఉన్నారు.

**ఆగిపోయిన పత్రిక :** ఎందరికో మార్గదర్శిగా నిలిచిన చార్వాక పత్రిక సిబ్బంది కొరత, ప్రకటనదారులు పైకం చెల్లించకపోవడం, ఆర్థిక యిబ్బందులు మున్నగు కారణాలవలన 1982లో ఆగిపోవడం బాధాకర విషయం.

**సహకారోద్యమ పిపాసి :** స్టేట్ బ్యాంకులో విధులు నిర్వహిస్తూనే సహకార రంగం మీద ఆసక్తితో ఉద్యోగుల కోసం కో-ఆపరేటివ్ సొసైటీ, కో ఆపరేటివ్ స్టోర్స్ స్థాపించి మార్కెట్ శక్తుల బారిన పడకుండా, వినియోగదారుల అదుపులో ఉండాలని ఆకాంక్షించిన ప్రజాపక్షపాతి. కానీ కాసులకు కక్కుర్తి పడే అధికారులు ఆయన నీతి నిజాయితీలను సహించలేక అక్రమ ఆరోపణలతో ఉద్యోగం నుండి తొలగించారు. అయినా వెనుకడుగు వేయకుండా, స్వయంకృషితో న్యాయశాస్త్రం చదివి న్యాయం కోసం తానే సుప్రీంకోర్టులో వాదించిన విజ్ఞానగని. అయినా న్యాయం దక్కలేదు. ఈ పోరాటయోధుడు నేతి బీరకాయలో నేతి కోసం వెతుకుతున్న చందాన న్యాయం గగన కుసుమమయ్యింది. మన న్యాయస్థానాల్లో లోకం గెలుపు గుర్రాల వెనుక పరుగులు తీస్తుంటే, ఈయన విజయం కంటే విలువల విజయం కోసం తన కాలాన్ని, జీవితాన్ని పణంగా పెట్టారు.

**నిరాడంబరతకు చిరునామా :** బ్రతుకులోనే కాదు చావులోనూ నిరాడంబరత చాటుకున్న ఘనుడు. 26 డిసెంబరు 2025 శుక్రవారం వేకువజామున గుంటూరులో గుండెపోటుతో 82వ ఏట తుది శ్వాస విడిచారు. తన చావు కబురు అందరికీ చెప్పి వారిని ఇబ్బంది పెట్టవద్దని, తాను అతి సామాన్యుడనని, మరణం సహజమని, తాను సంపూర్ణ జీవితం గడిపానని, ఏడుపులు పెడబొబ్బలు పెట్టవద్దని, కేవలం కుటుంబ సభ్యులుగా మీ నలుగురే (భార్య, ముగ్గురు కుమారులు) అంతిమ కార్యక్రమం పూర్తి చేయండని మాట తీసుకున్నారు. ఆయన చెప్పినట్లుగానే కుటుంబ సభ్యులు ఆచరించారు. ఈ విధంగానే గతంలో పౌర హక్కుల నేత కన్నాభిరామ్, విజయవాడకు చెందిన చంటి పిల్లల వైద్యురాలు డాక్టర్ పరిమి హేమ ఉన్నారు. ఇంత నిబద్ధత, నిరాడంబరత కలిగిన వారు నేడు అరుదు. ఇక ముందైతే కనిపించకపోవచ్చు.

**నైతికతకు నిలువెత్తు ప్రశ్న :** అధికార అనధికార, న్యాయ అన్యాయ, బంధు అబంధు, సహచర అసహచర, ఉద్యోగ గణాలతో అవిశ్రాంతంగా పోరాడి కన్ను మూసిన ధన్యజీవి. వైఫల్యాలను మెట్లుగా మలుచుకొని విలువల శిఖరాన్ని అధిరోహించిన సగటు మనిషి. సహకార ఉద్యమాన్ని జాగృతం చేసిన ఆయన జీవితం నేటి యువతకు మార్గదర్శి. ఆయన భౌతికంగా నేడు లేకపోయినా, ఆయన వెలిగించిన హేతుభావ కాగడా, సహకార స్ఫూర్తి నిరంతరం ప్రకాశిస్తూనే ఉంటుంది.

**నివాళులు** : సీనియర్ పాత్రికేయులు ఆకుల అమరయ్య ఆయనతో తనకు గల అనుబంధాన్ని ఒక ప్రేరణాత్మక కలయికని శ్రద్ధాంజలి అర్పించారు. సహకార భూమి పత్రిక గౌరవ సంపాదకులు దాసరి కేశవులు, సంపాదకులు అక్బర్ భాషా తమ పత్రికను వెన్నుతట్టి ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి అని, నిజాయితీకి మారుపేరని ఘన నివాళులర్పించారు. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పి.యు.సి.ఎల్) నాయకులు మల్లెల శేషగిరిరావు నివాళులర్పిస్తూ గొప్ప ఆశయాల కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడని అని శ్లాఘించారు.

**ముగింపు** :తన జీవన గమనంలో ఎన్ని ఒడిదుడుకులో, ఎన్నెన్ని సుడిగుండాలో, మరెన్ని మోసాలో, ఇంకెన్ని నమ్మకద్రోహాలో చుట్టుముట్టినా వెనకడుగు వేయలేదు. పట్టును సడలింపు లేకుండా, ధైర్యంతో మనోనిబ్బరంతో మునుముందుకు పయనించిన మహనీయుడు. ప్రజా చైతన్యం కోసం, సదాశయంతో తుదిశ్వాస వరకు పోరాడిన మానవతా మూర్తి, స్ఫూర్తి ప్రదాత మన అపర చార్వాకుడు, అమర జ్యోతి తోటకూర వెంకటేశ్వర్లు. వారికి అరుణ జోతల జోహార్లు. •

---

## తర్కానికి దగ్గరగా వున్న దానినే నమ్మాలి!

**ఏ** మతంలోని శాఖలన్నీ ఒకే నమ్మకాన్ని కల్గిలేవు. హిందూ మతంలో వైష్ణవులకు, శైవులకు గొడవలు సామాన్యశకం మొదటి శతాబ్దాల్లో జరిగాయి. క్రిస్టియన్స్‌లో కాథలిక్స్‌కు, ప్రొటెస్టెంట్లుకు మధ్యన ఇంకా ముస్లిమ్స్‌లో షియాలకు, సున్నీలకు మధ్యన ఎప్పుడూ అంతర్గత గొడవలు నడుస్తుంటాయి. ఆశ్చర్యమేమిటంటే బయటి మతం గొడవకు వస్తే ఈ మతాల్లోని రెండు శాఖలు కలుస్తాయి ఒకే మతంగా కనిపిస్తాయి. ఏ మతం గొడవకి రాకపోతే మళ్ళీ మతంలోని శాఖల గొడవలు షురూ! ఈ గొడవల్లో మతాలు బ్రతుకుతాయి మనుషులు చస్తారు. మనుషులు చస్తూ మతాన్ని బ్రతికిస్తారు కానీ! చనిపోయే ఒక్క మనిషికి కూడా మతం ప్రాణం పోయదు. ప్రాణం పోసినా! అది మత పుస్తకాల్లోని కథల్లో తప్ప నిజంగా బయట జరగదు.

అసలు ఈ మతమేంటి? ఇందులో శాఖలెందుకున్నాయి? మత కథలేంటి? ప్రపంచంలో ఇన్ని మతాలెందుకున్నాయి? ఒకే మతం ఎందుకు లేదు? ఇది సామాజికమా? ప్రాకృతికమా? చచ్చిన మనిషిని మతం ఎందుకు బ్రతికించలేదు? ప్రపంచాన్నంతా ఒకే దేవుడు సృష్టించాడా! లేదంటే ఒక్కో దేశాన్ని ఒకోదేవుడు సృష్టించుకున్నాడా? తన మనుగడ కోసం మనిషి జీవితంలో మతం ఎందుకుండాలి? దేవుడి కాన్సెప్ట్ ఏంటి? ప్రకృతి మనుగడలో దేవుడి ప్రమేయం ఉందా? లేదా? ఇలా సాధారణ ప్రశ్నలు వేసుకుని సమాధానాల కోసం మతేతర పుస్తకాల్లో వెతకాలి. మత పుస్తకం చెప్పే సమాధానం, మతేతర పుస్తకం చెప్పే సమాధానాల మధ్య సంబంధం చూడాలి. ఏది తర్కానికి దగ్గరగా ఉంటే అది నమ్మాలి. తర్కానికి దూరంగా ఉన్నదాన్ని దూరంగా ఉంచాలి. మనిషి మనుగడకు హాని చేసేవాటిని పాటించకూడదు. **– సాయికిరణ్**

# ఘనంగా జరిగిన 34వ జాతీయ నాస్తిక మేళా

నాస్తిక సమాజం ఆధ్వర్యంలో 34వ నాస్తికమేళా ఫిబ్రవరి 14 శనివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నిడమర్రు రావణ మైదానం చార్వాకాశ్రమంలో ప్రారంభమైంది. తొలుత నాస్తిక సమాజం జెండా ఎగురవేసి నాస్తికులకు హేతువాదులకు, భౌతికవాదులకు, మానవతావాదులకు సమాజహితం కోసం కృషిచేసిన శాస్త్రవేత్తలకు నివాళులర్పించారు. మతవాదుల చేతిలో హత్యగావించబడ్డ అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం ప్రారంభమైన నాస్తికమేళాలో 'వైజ్ఞానికతకు మత భావాలకు పొసగని మైత్రి' అనే అంశం పైన డాక్టర్ జయకుమార్ మాట్లాడుతూ... వియత్నాం వంటి చిన్న దేశం మత రహిత దేశంగా అభివృద్ధిలో ఎంతో ముందుకు వెళ్లిందని, మనిషి ఆలోచన నుండి వచ్చేది భాష. భాష నీరైతే ఆలోచన పడవ అని అన్నారు. శాస్త్రవేత్తలు సత్యం కోసం శ్రమిస్తారు కానీ మతవాదులలాగా దాడులు చేయరని అన్నారు. 'ప్రాచీన భారతంలో చార్వాకం' అనే అంశంపైన ఎం.వి.ఎస్. శర్మ మాట్లాడుతూ... వేదాలు నేర్చుకోవడం అంటే బట్టి పట్టడం, అంతేకానీ అందులో ఉన్న జ్ఞానం ఏమీ లేదనీ నాటి చారువాకుల నుండి చెప్తున్నప్పటికీ మత వాదులు నాస్తికులపై భౌతిక దాడులు చేస్తున్నారు. నేటి ఈ సభలకు విచ్చేసిన అందరూ 2600 సంవత్సరాల క్రితం చార్వాకులు చేసిన పోరాటానికి వారసులని గుర్తు చేశారు. వేదాలను తిరస్కరించడమే కాకుండా బ్రాహ్మణిజాన్ని, బ్రాహ్మణీయ వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించింది కేవలం చార్వాకులే అని అన్నారు. చార్వాక సిద్ధాంతం ప్రజల్లో ఒకరి నుండి ఒకరికి తరతరాలకు చేరుకుందని అన్నారు. భారతదేశం ఆధ్యాత్మిక దేశం కాదని అన్నారు. ఆదిభౌతిక వాదులు చార్వాకులు ఆత్మ పరమాత్మ పునర్జన్మ దేవుడు మూఢనమ్మకాలను తిరస్కరించారని అన్నారు. 'పురాణ ప్రలాపం' అనే అంశంపైన లక్ష్మి రెడ్డి; 'దాచేస్తే దాగని సత్యం జీవపరిణామం' అనే అంశంపై, కట్ట సత్యప్రసాద్; 'శాస్త్రీయ దృక్పథ ప్రచారంలో అవలంబించాల్సిన విధానాలు' అంశం పై, డాక్టర్ సి.హెచ్. రవికుమార్, డాక్టర్ శరత్ తరగతులు నిర్వహించారు. 'మనిషి తనం తప్ప ఏమీ తెలియని ఒట్టి చేతల మనిషి చార్వాక రామకృష్ణ' అనే పుస్తకాన్ని డాక్టర్ భాను ప్రసాద్, డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి, సి.హెచ్. శివారెడ్డి ఆవిష్కరించారు.

ఉదయం జరిగిన సమావేశానికి బెనహర్ అధ్యక్షత వహించారు. 'సంక్షోభకాలంలో బుద్ధి జీవుల పాత్ర' అనే అంశంపై వేణుగోపాల్ మాట్లాడుతూ – సంక్షోభం గురించి మార్క్స్ వారసులు, మార్క్సేతరుల నిర్వచనాలను వివరించారు. సంక్షోభ రూపం, సారం వేర్వేరని, రెండింటినీ అర్థం చేసుకోవాలంటే కార్ల్‌మార్క్స్, లెనిన్, గ్రాంసీ ఇచ్చిన వివరణ, వ్యక్తి నుంచి పౌర సమాజం వరకు సంక్షోభాల పరంపరను తెలుసుకోవాలని సూచించారు. సమాజాన్ని, ప్రజలను పురోగతి వైపు నడిపించే మేథావి వర్గాన్ని చరిత్ర ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, ఆ బాధ్యతను బుద్ధి జీవులే పోషించాలని అన్నారు. రెండో సమావేశానికి జన విజ్ఞాన వేదిక నాయకులు కె. లక్ష్మీనారాయణ స్వాగతం పలుకగా, డాక్టర్ టీ.రాజారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ బీవీ రాఘవులు 'భారత సమాజంలో ఫాసిజం' అనే అంశంపై ప్రసంగించారు. నాస్తిక మేళాకు రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, హేతువాదులు, నాస్తికులు, మానవతావాదులు, ప్రగతిశీల వాదులు, హక్కులనేతలు, ప్రజాసంఘాల నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాస్తికమేళాలో అన్ని రకాల సాహిత్య పుస్తకాలు అందుబాటులో ఉంటాయని సాహితీ ప్రియులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

*(34వ జాతీయ నాస్తికమేళా పూర్తి వివరాలు వచ్చే సంచికలో)*

# అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం

**- షేక్.కరిముల్లా**

"పెట్టుబడిదారీ వ్యవస్థ అంతులేని లాభాల కోసం ఆయుధాలను తయారుచేస్తుంది. వాటితో పాటు శవపేటికలు కూడా అమ్ముడు పోవాలని చూస్తుంది. అందులో కూడా లాభాలు గడించాలని యుద్ధాలను తెచ్చిపెడుతుంది" అంటాడు కార్ల్‌మార్క్స్. సామ్రాజ్యవాదుల రక్తపిపాస, పెట్టుబడి లాభాపేక్ష లేకుండా మానవాళి చరిత్రలో జరిగే యుద్ధాలు దాదాపు అరుదు. ఈ యుద్ధజ్వాలల్లో సామాన్యులే సమిధలవుతారు. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ మీద దాడులు చేయడాన్ని చెప్పవచ్చు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అంతకంతకు తీవ్రమవుతున్నాయి. గంటగంటకూ పరిస్థితి మారిపోతుంది. యుద్ధోన్మాదంతో చెలరేగుతున్న అమెరికా, ఇజ్రాయిల్‌ను నియంత్రించేందుకు ఇరాన్ ప్రతిఘటన దాడులు చేస్తోంది.

ఈ సందర్భంగా ఎప్పుడు ఏ యుద్ధం వచ్చినా గుర్తుకు వచ్చే కవిత- "యుద్ధం ముగుస్తుంది. నాయకులు షేక్‌హాండ్స్ ఇచ్చుకుంటారు. నవ్వుతూ ఫొటోలు దిగుతారు. ఒక ముసలితల్లి అమరుడైన యుద్ధవీరుడి కోసం ఎదురుచూస్తుంది. ఒక వివాహిత తన భర్త కోసం ఎదురు చూస్తోంది. పిల్లలు వీర యోధుడైన తమ తండ్రి కోసం ఎదురుచుస్తారు. మన దేశాన్ని ఎవరు అమ్మారో నాకు తెలియదు. కానీ, దీని మూల్యం చెల్లించే వారిని మాత్రం నేను చూశాను" మహమ్మద్ డార్విస్ (పాలస్తీనా కవి) స్వప్నాలు ఛిద్రమై... బతుకులు అస్తవ్యస్తమై... శిథిలమై... రోడ్డున పడ్డ బాధితులు ఎందరో! ఇంత జరిగినా కూడా మానవాళికి ముప్పు తొలగిందా? అంటే లేదనే చెప్పాలి. సామ్రాజ్యవాదం బరితెగింపే దీనికి కారణం. వ్యక్తిగత లాభాపేక్షతో, యుద్ధాలను తెచ్చిపెట్టుకొని, ఎన్నో ఏళ్లుగా మానవుడు సాధించిన ప్రగతి, నాగరికతలను మన చేతులతో మనమే నాశనం చేసుకుంటున్నాం.

అణుబూచిని కారణంగా చూపి అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమైనీ ప్రాణాలు కోల్పోయారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, రక్షణ మంత్రి, మరో 44 మంది ఆర్మీ కీలక అధికారులు, విద్యార్థులు మరణించారు. ప్రతిగా ఆత్మ రక్షణలో భాగంగా ఇరాన్ - అమెరికా, ఇజ్రాయిల్ పశ్చిమాసియాలోని సైనిక స్థావరాలపై భీకర దాడులు జరిపింది. దీంతో ప్రపంచమంతా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శాంతి ఒప్పందాలు జరగని పక్షములో ప్రపంచం మరో పెనుముప్పును ఎదుర్కోక తప్పదు. ఇప్పటికే పశ్చిమాసియా అగ్నిగుండంగా మారింది. అమాయక ప్రజలు ముఖ్యంగా పసిపిల్లలు ఈ యుద్ధంలో చనిపోతున్నారు. ఇప్పటివరకు ఈ రెండేళ్లలో ఇజ్రాయిల్ మధ్య ప్రాచ్యంలోని వివిధ దేశాలపై వేల సంఖ్యలో దాడులు చేసింది.

అమెరికా గత 132 సంవత్సరాలుగా ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ 'వస్తాదు'గా తయారై ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. భద్రత, స్వేచ్ఛ పేరుతో ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుని, ఆ దేశాలలో తమను వ్యతిరేకించే పాలకులను తొలగించడంతో పాటు, ఆ దేశాల్లో కల్లోలాలు సృష్టిస్తున్నది. 2025లో వెనిజులా అధ్యక్షుడిని ఖైదు చేయటం వరకు అదే ధోరణి. అదే బలుపు. అదే ఆధిపత్యం. 1893లో హవాయిలో రాచరికాన్ని కూలదోయటం మొదలు 2023లో ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ను పదవి నుండి

తొలగించి, చంపటం, ఆఫ్ఘనిస్తాన్, సిరియా, పాలస్తీనా పరిణామాలు మొత్తంగా అమెరికా ఇతర దేశాలలో సైనిక జోక్యం చేసుకున్న సందర్భాలు 150కి పైగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో అమెరికా కన్ను పశ్చిమాసియాపై పడింది. అక్కడ ఉన్న చమురు, ఇతర వనరులు దోచుకోవటం లక్ష్యంగా పెట్టుకొని, పశ్చిమ ఆసియాలో తన కీలుబొమ్మ దేశంగా పాలస్తీనా భూభాగాలను ఆక్రమించి, 1948లో ఇజ్రాయిల్ అనే 'టెర్రరిస్ట్' దేశాన్ని ఏర్పాటు చేసింది. అప్పటినుండి పశ్చిమ ఆసియాలో రక్తపాతం సృష్టిస్తున్నది. పాలస్తీనాలో జాతి హననానికి కూడా కారణమైంది. ఇది అమెరికా రక్తచరిత్ర. పశ్చిమాసియాలో ముడి చమురు, ఆయిల్, గ్యాస్ లాంటి ఖనిజ వనరులు కలిగి ఉండటం, మంచి రవాణా మార్గాలు ఉండటం కారణంగా, ఈ ప్రాంతం ప్రపంచంలోకెల్లా అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగింది. ఎగుమతి దిగుమతులకు, ప్రపంచ వాణిజ్యానికి ఆయువుపట్టుగా ఉంది. దీని ప్రాముఖ్యత రీత్యా అమెరికా తన రాజకీయ ఆర్థిక అవసరాలు తీర్చుకోవటం కోసం ఈ మారణకాండను సృష్టిస్తున్నది.

అమెరికా ప్రభుత్వం విదేశాలలో తనకు ఏమాత్రం అధికారం లేనిచోట తన అవసరాల కోసం, తనకు అనుకూల ప్రభుత్వాలను సృష్టించుకుని, పరాయి దేశాల మీద, ప్రభుత్వ నేతల మీద, ఆ దేశ ప్రజల మీద, ప్రజా సంస్కృతుల మీద దాడులు, యుద్ధాలు చేస్తోంది. అలాగే ఆయా దేశాల సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తుంది. అసలు అమెరికా పాలకుల విదేశాంగ నీతే అది. ఇతర దేశాలు, ప్రాంతాలు తమ రాజకీయ, ఆర్థిక అవసరాలు తీర్చాలని అనుకునే విదేశాంగ నీతి అమెరికాది. ప్రపంచంలో మరేదేశం ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు. ఇదంతా బహుళజాతి సంస్థల, సామ్రాజ్యవాద రాజకీయ ప్రయోజనాలు కాపాడే వ్యూహం.

ప్రపంచంలోని వనరులు, సంపద మొత్తం అమెరికన్ బడా బాబులకు దక్కాలి. భూగోళం మీద ఏ మూలనైన మనిషి నెత్తురు, చెమట సంపదగా మారి అది డాలర్‌గా వారి చెంతకు చేరాలనేదే అమెరికన్ కుటిల రాజనీతి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదం మూడు శతాబ్దాలలో కూలిపోయిందిగానీ; ఎప్పటికీ కూలిపోని, రవి అస్తమించని, అమెరికన్ కార్పొరేట్ సామ్రాజ్యాన్ని నెలకొల్పడం కోసం ప్రపంచం మీద ఆకలిని, రోగాన్ని, దుఃఖాన్ని, అసమానతలను, దోపిడీని, పీడనను హింసను ప్రయోగించడమే అమెరికా విదేశాంగ నీతి. ఈ దుర్మార్గం కోసం అమెరికా పాలకులు ఎంతో ఖర్చు చేస్తారు. ఎంతో నీచమైన ఆయుధాల వ్యాపారం చేస్తారు. ఈ ఆయుధాలు అమ్ముకోవడం కోసం దేశాల మధ్య యుద్ధాలు సృష్టిస్తారు.

ఆయుధాల ఉత్పత్తి ఇక్కడ ప్రధాన పరిశ్రమ. అమెరికాను ఆయుధాల వ్యాపారులు శాసిస్తారు. అమెరికా నాటో కూటమి ద్వారా నిరంతరం యుద్ధాలు జరిగేటట్లు చేస్తారు. పేద ప్రజల రక్తంతో హోలీ ఆడుకుంటారు. ఇంత నీచమైన ఈ ప్రవృత్తి సామ్రాజ్యవాద సంస్కృతిది అని మనం గ్రహించాలి. నేడు పశ్చిమాసియాలో ప్రతి అంగుళం ప్రజల రక్తం, కన్నీరుతో తడిసింది. పాలస్తీనా ప్రజలు తమ మాతృభూమిలోనే నిర్వాసితులుగా మారి, జన్మభూమి విముక్తి కోసం పోరాడుతున్నారు. ఈ పాపం అమెరికాదే. పాలస్తీనా జాతి హననం పట్ల ప్రపంచ పౌరసమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా లెక్కచేయకుండా రక్తపాతం సృష్టిస్తుంది. ఇంత విధ్వంసానికి కారణమైన సామ్రాజ్యవాదం నశించాలి. సోషలిస్టు పోరాటాలు విజయవంతమై, సోషలిస్ట్ ఆర్థిక వ్యవస్థలు ఏర్పడటమే మానవాళి విముక్తికి మార్గం. ●

# మాట దాటవేసిన ప్రొఫెసర్!

– నన్నూరి వేణుగోపాల్

**'మీ** దృష్టిలో దేవుడు ఉన్నాడా లేడా?' అంటూ ప్రొఫెసర్ నాగేశ్వర్‌గారిని ఈ మధ్యన ఒక టీవీ యాంకర్ అడిగారు. ఆ అడగడానికి ప్రముఖ సినిమా రచయిత జావేద్ అక్తర్‌ని ఒక నేపథ్యంగా తీసుకొని అడిగాడు ఆ యాంకర్.

డిసెంబర్ 20న, ఢిల్లీలోని 'కన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా'లో జావేద్ అక్తర్‌కీ, ఇస్లామిక్ మతవాది అయిన 'ముఫ్తీ షమైల్ నద్వీ' కీ మధ్యన 'దేవుడు ఉన్నాడా లేడా' అనే అంశంపైన ఒక సుదీర్ఘమైన చర్చ జరిగింది. దీనికి జర్నలిస్ట్ సౌరభ్ ద్వివేది మోడరేటర్. ఇదే ఆ నేపథ్యం. వారిద్దరికీ జరగడం ఇది మొదటిసారే కావొచ్చును గానీ; ఇలాంటి చర్చలు ఆ ఇద్దరికీ కొత్తేమీ కాదు.

దేవుడు ఉన్నాడా లేడా అనే ప్రధానమైన ప్రశ్నతో పాటుగా గాజాలో జరిగిన దానిని ప్రస్తావిస్తూ – "ఇంతటి అన్యాయం, పిల్లల మరణాలు, నిరంతర హింస జరుగుతున్న ఈ ప్రపంచంలో సర్వశక్తిమంతుడైన దేవుడు ఉంటే– ఈ బాధకు అర్థం ఏమిటి?" అనే ఉప ప్రశ్న కూడా జావేద్ వేశాడు. ఇంకా ఇలాంటి వాటి మీద వాళ్ళిద్దరికీ చాలానే చర్చ జరిగినప్పటికీ ప్రధానమైన అంశం మాత్రం దేవుని అస్తిత్వం మీదే!

వామపక్ష మేధావిగా నాగేశ్వర్‌గారికి తెలుగు నేల పైన ఒక గుర్తింపు ఉంది. వామపక్ష వాదులు భౌతికవాదులుగా ఉంటారనే ఉద్దేశ్యంతోనూ, ఆయన మాటలకు కొంత విలువ ఉంటుందనే ఉత్సాహంతోనూ జావేద్ అక్తర్‌ని అడిగినట్లుగానే అదే మాటని నాగేశ్వర్‌గారిని కూడా అలాగే అడిగాడా యాంకర్.

కరెంట్ అఫైర్స్ మీద చెప్పినట్లుగా సూటిగా చెబుతాడేమో అని అతగాడి ఆశ కావొచ్చు.

కానీ నాగేశ్వర్‌గారు చెప్పలేదు. ఇలాంటి వన్నీ 'మెటాఫిజికల్ ప్రశ్నలు' అని చెప్పి, 2,600 ఏళ్ళ నాటి బుద్ధుడి దగ్గరకు వెళ్లి, అక్కడ ఆగి, అతన్ని తోడుగా తెచ్చుకున్నాడు.

బుద్ధుడిని కూడా అప్పట్లో ఇలాగే ఎవరో అడిగితే బుద్ధుడు ఒక కథ చెప్పాడు అంటూ– 'మౌలాంక్యపుత్త కథ' ను నాగేశ్వర్‌గారు చెప్పుకొచ్చారు. మౌలాంక్యపుత్తుడు బుద్ధుని శిష్యుడు. అతనికి కొన్ని తాత్విక సందేహాలు కలిగి, ఈ ప్రపంచం శాశ్వతమా? కాదా? ప్రపంచం సరిహద్దులున్నదా? లేదా అంతులేనిదా? ఆత్మా శరీరమూ రెండూ ఒక్కటేనా? లేక వేరేనా? తథాగతుడు (బుద్ధుడు) మరణానంతరం ఉంటాడా? లేడా? రెండూనా? ఏదీ కాదా? అంటూ కొన్ని అడుగుతాడు. అవి అడిగి, "భగవాన్! ఈ ప్రశ్నలకు మీరు సమాధానం చెప్పాలి. చెప్పకపోతే నేను మీ శిష్యత్వం విడిచిపెడతాను." అని కొంచెం బెదిరిస్తాడు కూడా.

నిజానికి మౌల్యాంక పుత్తుడు అడిగినవి అప్పటికి మంచి ప్రశ్నలే. వాటికి బుద్ధుడు నేరుగా సమాధానాలు ఇవ్వవొచ్చు. కాని బుద్ధుడు ఆలా ఇవ్వలేదు. ఇవ్వక పోగా, ఇంకేదో చెబుతాడు.

దారినపోయే ఒకతనికి బాణం తగిలింది. బాణం గుచ్చుకున్న ఆ వ్యక్తి ముందు వైద్యం చేయించుకోకుండా 'అ బాణం ఎవరు వేశారు, ఎందుకు వేశారు? వేసిన వాళ్ల కులగోత్రాలు ఏమిటి?' వంటి ప్రశ్నలు వేస్తూ వైద్యాన్ని నిర్లక్ష్యం చేసి చచ్చి పోతాడు. కాబట్టి నీవు అలాంటి అనవసర ప్రశ్నల్తో కాలాన్ని వృథా చేయకు.

'ప్రపంచంలో దుఃఖం ఉంది, బాధ ఉంది. దానినుంచి బయటపడటం ముఖ్యం. ప్రపంచం శాశ్వతమా కాదా అన్నది నీ దుఃఖాన్ని తగ్గించదు. కాబట్టి నేను విముక్తికి పనికిరాని ప్రశ్నలకు సమాధానం చెప్పను....' అని బుద్ధుడు తన శిష్యుడి నోరు మూయిస్తాడు.

నిజానికి బుద్ధుని కాలంలోనే మక్కలి గోశాలుడు వున్నాడు. వీరిని అజీవకులు అంటారు. వీళ్ళు నాస్తికులు. బుద్ధుడికన్నా వందేళ్లకు ముందుగా చార్వాకులు ఉన్నారు. వీళ్ళు పూర్తిగా నాస్తికులు. బుద్ధుడిది నాస్తికత్వం కాదు. అజ్ఞేయవాదం. (వున్నాడో లేడో తెలుసుకోలేము అని చెప్పేదే అజ్ఞేయవాదం.)

బుద్ధుని కాలానికి ప్రకృతికి సంబంధించి, సమాజాన్ని గురించి అలాంటి తాత్విక చర్చలు ఎన్నో ఉన్నాయి. ఉన్నాయి కాబట్టే ఆరామాల్లో బుద్ధుని శిష్యులు ఇలాంటి చర్చను తమ గురువైన గౌతముడి దగ్గర లేవనెత్తారు.

రెండు వేల ఆరు వందల సంవత్సరాల క్రితం బుద్ధుడిని మౌల్యాంక పుత్తుడు ఎలాంటి ప్రశ్నలు వేసాడో ప్రొఫెసర్ నాగేశ్వర్‌గారిని కూడా టీవీ యాంకర్ ఇంచుమించుగా అలాంటి ప్రశ్నలనే అడిగారు. బుద్ధుడి కాలంతో పోలిస్తే అప్పటికన్నా ఇప్పుడు శాస్త్ర విజ్ఞానంలోనూ, తత్త్వశాస్త్రంలోనూ ఎంతో అభివృద్ధి జరిగింది. వాటి ఆధారంతో అప్పటికన్నా ఇప్పుడు ఎంతో విపులంగా చర్చించుకోవచ్చు. జవాబులివ్వవొచ్చు.

కానీ నాగేశ్వర్‌గారు ఇవ్వలేదు. ఇవ్వకపోగా 'హ్యూమన్ సఫరింగ్' పేరుతో ఆ రోజున బుద్ధుడు వాటిని ఎలా దాటవేసాడో ఇప్పుడు నాగేశ్వర్‌గారు కూడా 'నేను పెరిగిన టమోటా, దొండకాయ, కోడిగుడ్డు రేట్లు గురించి మాత్రమే మాట్లాడతాను. హ్యూమన్ సఫరింగ్ నాకు ముఖ్యం. దేవుడు వున్నాడో లేడో నాకనవసరం' అంటూ అసలు ప్రశ్నను దాటవేశారు! •

---

## ప్రగతికి ఆటంకం

– పిడుగు వెంకన్న

దేవుడు దయ్యం స్వర్గం నరకం
స్వార్థ మానవుడి సృష్టేరా...
అగ్రవర్ణాల ఆదాయమార్గపు
జీవనోపాధి వ్యాపారమాయే.

చందమామరావే జాబిల్లిరావే అని
గోరుముద్దలు బెట్టి లాలించి ఓదార్చ
బూచోడొస్తుండని బాల్యదశలోనే
భయాలు, భక్తి బీజాలు నాటిరి.

మతాలు ఏవైన పాలకులెవరైన
లౌకికత్వంతో సృజనాత్మకంగా
నమ్మకాలు వేరు – నిజాలు వేరని
శాస్త్రీయంగ చాటి చెప్పాలిరా ॥దేవుడు॥

గతించిన చరిత ఎంత గొప్పదైనా
మళ్లీ తిరిగిరాని వైభవమే
సనాతనధర్మం ఆ గొప్పలకు బోతే
పీడిత ప్రజలకు ఒరిగేదేమీ లేదు.

కులమత ద్వేషాలు మూఢనమ్మకాలు
మాయలు, మంత్రాలు – బాబాల మోసాలు
దేశప్రగతికి అడ్డంకిరా
ప్రజల చైతన్య పరిచి అరికట్టరా ॥దేవుడు॥

# మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తేవాలి!







**స**మాజం నుంచి మూఢనమ్మకాలను రూపుమాపేందుకు మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తేవాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య డిమాండ్ చేశారు. ది. 9.11.2025, ఆదివారం టీఎన్‌జీఓ భవన్‌లో నాస్తిక సమాజం, బీటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మూఢవిశ్వాసాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో సైన్స్ వేగంగా ముందుకుపోతున్న తరుణంలో మూఢనమ్మకాలతో సమాజం వెనుకబడు తుందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం ఇప్పటికే అమలులో ఉందన్నారు. అక్కడ ఉన్నట్లుగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. మూఢనమ్మకాల వల్ల సమాజంలో అమానవీయ ఘటనలు కొనసాగుతున్నాయన్నారు. అందుకు ప్రతిఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. మారుతున్నకాలంతో తామూ మారాలన్నారు. ప్రస్తుతం మన దేశంలో ఆర్.ఎస్.ఎస్. చరిత్రలో అవలక్షణాలను సనాతన ధర్మంరూపంలో కొనసాగిస్తూ, ప్రజలను విడదీస్తూ మెజారిటీ మతోన్మాదాన్ని ఎక్కిస్తూ పాసిజాన్ని సమాజంపై రుద్దుతున్నారన్నారు. వారి ఆధిపత్యం చెలాయిస్తూ ఇదే ప్రజాచైతన్యం.. ఇదే దేశభక్తి అని చాటుతున్నారన్నారు. ప్రజలలో చైతన్యం కలిగించడం ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, నాస్తిక సమాజం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మైత్రియాదయ్య, బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, భాస్కర్, జయకుమార్, పద్మావతి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి విజయకుమార్, బాలరాజు, వామన్ కుమార్, పాలమూరు అధ్యయన వేదిక కార్యదర్శి రాఘవాచారి, జక్క గోపాల్, ఇందిరా, రవికుమార్, యాదయ్య, హనుమంతు, సుధాకర్, సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ సింగిరెడ్డి పరమేశ్వర్, ప్రవీణ్, రామదాసు పాల్గొన్నారు.

# మార్చి - 8 మహిళలకు స్ఫూర్తి కావాలి!

**- అరుణ,** ఉపాధ్యాయురాలు.

75 ఏళ్ళ ఆజాది అమృత్ మహోత్సవంలో ఆమె మరణించింది.
అయినా, ఆమె మానం నుండి రక్తం స్రవిస్తూనే ఉంది.
కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా... అత్యాచారాలకు గురైన
శవాలు ఎందుకో ఈ మట్టిలో ఇంకటం లేదు....
మనువాదం, ఫాసిజం, పితృస్వామ్యం దేశంలో నలుదిశలా ఊరేగుతున్నాయి.
ఆమె మాన ప్రాణాలు ఉక్కు పాదాల కింద నలుగుతూనే ఉన్నాయి.– శ్రీదేవి

"ముళ్ళ పొదల్లో ఓ ఆడశిశువు... చెత్తకుండీల్లో మరో ఆడ శిశువు... ఇద్దరూ అప్పుడే భూమి మీద పడిన పసికూనలు". ఇలాంటి వార్తలు నిత్యం వస్తుంటాయి. 1910 నుండి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు వస్తున్నాయి... పోతున్నాయి... కానీ మహిళల సామాజిక స్థితిగతుల్లో మార్పు రావటం లేదు. ఈ పరిస్థితిలో ఈ అజాదీ ఎవరిది? ఈ ఉత్సవాలు ఎవరివి? అన్న ప్రశ్న వస్తుంది. రోజు రోజుకు స్త్రీలపై హింస రకరకాల రూపంలో పెరిగిపోతూ ఉంది. ఇలా ఎందుకు జరుగుతుంది...? ముందుతరాల వారికి హింసలేని సమాజాన్ని అందించలేమా...? ఆకాశంలో సగమైన స్త్రీలు శ్రమ ఉత్పత్తిలో సగానికి తక్కువ ఏమీ కాదు. కానీ కడుపులో బిడ్డను కనాలన్నా, తాను ఏమి చదవాలి, ఎంతవరకు చదువుకోవాలి, ఎలా జీవించాలనే విషయాలలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ మాత్రం స్త్రీకి లేదు. స్త్రీ నడక, నడత చివరకు నవ్వుపై కూడా ఆంక్షలు విధించారు. ఇలా స్త్రీలంటే చిన్న చూపు, వివక్ష. స్త్రీ ఎప్పుడూ మగవాడి కనుసన్నల్లో జీవించాలి. చిన్నప్పుడు తండ్రి, పెళ్ళి తర్వాత భర్త, ముసలితనంలో కొడుకుల ఆధీనంలో జీవించాలి. ఇలా స్త్రీని బందీని చెయ్యటం ఈ సమాజం యొక్క మొదటి నేరం. ఇక ఘనమైన మన చరిత్ర, సంస్కృతిలో కూడ "కార్యేషుదాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేషు రంభ" అంటూ స్త్రీని పురుషునికి సొంత ఆస్తిగా మలిచారు. ఇలా భూస్వామ్య, పితృస్వామిక సంస్కృతిని వ్యవస్థీకృతం చేశారు. ఈ పరిస్థితి మారాలి. స్త్రీని కనీసం మనిషిగా చూసి గౌరవించే ఒక మానవీయ సమాజాన్ని నిర్మించే కృషి అందరూ చేయాలి.

అమలుకు నోచుకోని చట్టాల కారణంగా స్త్రీలపై కుటుంబ, లైంగిక హింస, రాజ్యహింస రోజు రోజుకు పెరిగిపోతుంది. 1956, 1986 లలో చేయబడ్డ హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆడ, మగ తేడా లేకుండా ఆస్తిలో సమానహక్కు ఇవ్వబడింది. కానీ భూస్వామిక, పితృస్వామ్య వ్యవస్థలో ఏ కుటుంబమూ మహిళలకు ఆస్తిలో సమాన వాటా ఇవ్వటం లేదు. 1961లో వరకట్న నిషేధ చట్టం చేసినప్పటికీ, వరకట్నం గౌరవంగా అమలు చేయబడుతూ ఉంది. పెళ్ళి పేరుతో జరిగే తంతూ ఫక్తు వ్యాపారంగా మారి, మహిళల పట్ల శాపమైంది. ఈ దురాచారానికి ఎంతో మంది స్త్రీలు బలైపోతున్నారు. ఈ దురాచారం కారణంగా ఆడ శిశువుల భ్రూణ హత్యలు జరిగి, ఆడపిల్లలను గర్భంలోనే చంపుతున్నారు. ఫలితంగా దేశంలో స్త్రీల జనాభా తగ్గిపోయి, పెళ్ళి కాని ప్రసాద్‌లు పెరిగిపోతున్నారు. ప్రకృతికి విరుద్ధమైన ఈ చర్యను

నిలువరించటానికి 1994 గర్భస్థ శిశువు పరీక్షల నియంత్రణ చట్టం చేయబడింది. అయినా భ్రూణ హత్యలు ఆగలేదు. ఏ డాక్టరు, తల్లిదండ్రులకు గాని శిక్షలు పడ్డ సందర్భంలేదు. కనీసం కేసులు కూడా రిజిష్టర్ కావటం లేదు. ఆడపిల్లలు లేకుండ కొత్త సహస్రాబ్దంలోకి మనం అడుగుపెట్ట బోతున్నట్లు ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఇది ప్రమాదకరం. ప్రకృతి సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే తరం మూల్యం చెల్లించక తప్పదు. ప్రకృతి పరంగా మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎక్కువ మంది బతుకుతారు. జన్యు పరంగా ఆడపిల్లలు బలంగా ఉండటమే దీనికి కారణం. భారతదేశంలో భ్రూణ హత్యల కారణంగా స్త్రీల జనాభా తగ్గిపోతూ ఉంది. అనేక దేశాలలో పురుషుల కంటే స్త్రీల సంఖ్య అధికంగా ఉంది. చట్టాల అమలులో చిత్తశుద్ధి లేని కారణంగా ఆడపిండాలను గుర్తించి మొగ్గలోనే తుంచి వేస్తున్నారు. డయాగ్నోస్టిక్ పరీక్షా కేంద్రాలు మృత పంజాలుగా మారాయి. దీనికి తోడు 1991 నుంచి దేశంలో ప్రపంచీకరణదశ మొదలై పాశ్చాత్య విషసంస్కృతి పెచ్చరిల్లి స్త్రీ శరీరం సరుకుగా, అంగడి బొమ్మగా, విలాస వస్తువుగ మార్చబడింది. ఫలితంగా స్త్రీలపై లైంగిక హింస పెరిగిపోయింది. ఈ విష సంస్కృతి కారణంగా మన దేశంలో ప్రతి గంటకు ఐదుగురిపై అత్యాచారాలు జరుగుతున్నాయని. గణాంకాలు చెబుతున్నాయి.

బహుళజాతి కంపెనీలు తమ వస్తువులను ప్రచారం చేసుకొని అమ్ముకొని సొమ్ము చేసుకోవటం కోసం బుల్లితెరలో వస్తున్న ప్రోగ్రామ్స్, సీరియల్స్ ఆడవారినే విలన్లుగా చూపిస్తున్నారు. సినిమాల్లో హీరోయిన్ల పాత్ర, అర్ధనగ్నంగా, ఆత్మగౌరవం లేనిదిగా చిత్రీకరిస్తున్నారు. హీరోలైతే జులాయిలగా, అమ్మాయిలను వెంటబడి వేధించటమే ప్రేమగా చూపిస్తున్నారు. చివరకు ఉపాధ్యాయులను కూడా వదలటం లేదు. దీని ప్రభావం నేటి యువతపై పడి మానవీయ సంబంధాలు దెబ్బ తింటున్నాయి. పెరిగిన వస్తు వ్యామోహం, వినిమయం పాశ్చాత్య విష సంస్కృతి మూలంగా మొత్తం మానవ సంబంధాలు మార్కెట్ సంబంధాలుగా మారిపోయాయి. రకరకాల నేరాలు పెరిగి తుదకు విలువలు లేని సమాజం ఏర్పడింది. ఈ పరిస్థితిని నిలువరించాల్సిన పాలకులు బహుళజాతి సంస్థలకు, ధనికులకు అమ్ముడుపోయి బాధ్యతారహితంగా నడుచుకుంటున్నారు. మహిళల సమస్యలు చర్చించుకొని పరిష్కరించుకోవటానికి చట్టసభలలో కనీసం స్త్రీలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఏనాడూ పార్లమెంట్లో మహిళా ప్రతినిధులు 11 శాతానికి మించిలేరు. గత UPA ప్రభుత్వం చట్ట సభలలో మహిళలకు 33% రిజర్వేషన్ ఇస్తూ మహిళా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కానీ ఆమోదం మాత్రం పొందలేదు. ఒకవేళ పొందినా స్త్రీలు చట్టసభలకు ఎన్నికైతే పంచాయితీరాజ్ అనుభవమే పునరావృతం అవుతుంది. స్త్రీలు డమ్మీలుగా మిగిలిపోగలరు. స్త్రీలను ఇంటికే పరిమితం చేసే భూస్వామ్య భావజాలం నేడు రాజ్యమేలుతుంది. ఈ రకంగా మొదటి నుండి రాజకీయపరమైన వివక్ష కొనసాగుతూనే ఉంది. తీవ్ర ప్రజా ఉద్యమం ఫలితంగా UPA ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకు వచ్చిన నిర్భయ చట్టం – 2013 అమలులోకి వచ్చినా స్త్రీల మీద హింసా రూపాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయేగాని తగ్గటం లేదు. పైపెచ్చు ఇప్పటి BJP ప్రభుత్వ చర్యలు ఇందుకు వత్తాసు పలుకుతున్నాయి. బిల్కిస్ బానో కేసులో శిక్షలు పడిన 11 మంది ముద్దాయిలను 'అమృతోత్సవం'

పేరిట వదిలి వేయటం, ముద్దాయిలు హారతులందుకొని మరీ స్వాగత సత్కారాలు పొందటం జరిగింది. అలాగే UP లోని 'హత్రాస్'లో దళిత యువతిని సామూహికంగా అత్యాచారం చేసి తగ్గులు పెట్టారు. కాశ్మీరులో ఆసిఫా అనే ముస్లిం పసికూనను పవిత్ర దేవాలయంలో రోజుల తరబడి అత్యాచారం చేసి చంపిన ముద్దాయిలను అరెస్టు చేస్తే, అక్కడి BJP వారు నిందితులను విడుదల చేయమని ఊరేగింపులు చేయటం లాంటి సంఘటనలతో సభ్య సమాజం నివ్వెరపోయి సిగ్గుపడింది. ఈ సంఘటనలు 'బేటి బచావో 'ప్రభుత్వ [BJP] అసలు రంగు బయటపెట్టింది.

సామాజిక పరిణామంలో మొదట స్త్రీలకు మంచి గౌరవం ఉండేది. మాతృస్వామిక వ్యవస్థ ఇందుకు ఉదాహరణ. ఆ తరువాత వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం ఏర్పడ్డాక స్త్రీలకు ఆస్తి హక్కు లేకుండా పోయింది. దీంతో స్త్రీలకు విలువ పోయి వంటింటి కుందేలు అయిపోయింది. ఇదే నేటివరకు కొనసాగుతూ ఉంది. సరిగ్గా వివక్ష ఇక్కడే మొదలైంది. స్త్రీలను రెండురకాల బానిసలుగా మార్చివేసింది. వర్గ సమాజం ఇంటి బయట జీతమొచ్చే బానిసగా, ఇంట్లో జీతం లేని బానిసగా చేసింది. స్త్రీలు శ్రమ చేయటం తప్ప వారికి ఆస్తిని కలిగి ఉండే హక్కు లేదు. ఇది స్త్రీలను పూర్తిగా బలహీనపరిచింది అప్పటి నుండి నేటివరకు స్త్రీలు అనేక రకాలుగా దోపిడీకి గురవుతున్నారు. కాబట్టి స్త్రీల దోపిడీకి, వివక్షకు మూలం పెట్టుబడిదారీ మార్కెట్ ఉత్పత్తి విధానం. ఆర్థిక అసమానతలతో కూడిన ఈ విధానం నశించాలి. అందుకు మరో స్వాతంత్ర్యపోరాటం జరగాలి. సోషలిస్ట్ వ్యవస్థలు ఏర్పడాలి. సోషలిస్ట్ వ్యవస్థలో సామాజిక ఉత్పత్తిలో శ్రమ విముక్తి జరిగి స్త్రీల భాగస్వామ్యం పెరిగి వారి విముక్తికి దారి తీస్తుంది. ఇదే స్త్రీ విముక్తికి, అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం. ●

---

## 2025 సభల ఆర్థిక నివేదిక

## 33వ నాస్తికమేళా

| | | | | | |
|---|---|---|---|---|---|
| బియ్యం | - | 14,400-00 | పెయింట్స్ | - | 6,600-00 |
| షామియానా | - | 13,000-00 | పోస్టల్ | - | 5,800-00 |
| మైక్& లైటింగ్ | - | 4,000-00 | స్టేషనరీ, పనివాళ్లు | - | 24,400-00 |
| వంటవారికి | - | 15,000-00 | ఇతర ఖర్చులు | - | 8,000-00 |
| గ్యాస్ | - | 7,000-00 | మొత్తం | = | 1,74,735-00 |
| కూరగాయలు | - | 7,423-00 | వచ్చినవి | = | 1,71,250-00 |
| సరుకులు | - | 39,512-00 | మిగిలినవి | = | – 3,485-00 |
| పాలు, పెరుగు | - | 11,600-00 | | | |
| ప్రింటింగ్ | - | 18,000-00 | | | |

# ఆచరణే సత్యానికి మార్గదర్శి

– పిళ్ళా కుమారస్వామి

చీకటి మధ్య తడబడినప్పుడు
ఆకాశాన్ని చూశాడు మనిషి భయపడుతూ
అక్కడ దేవుడున్నాడని,
తనకో రక్షకుడని ఊహించుకున్నాడు మదిలో.
మనసే కోవెలగా మారింది.
రూపం లేని దేవునికి తన రూపం కల్పించుకున్నాడు.
ఆ రూపం చుట్టూ ఎన్నో కథలు అల్లినారు
కల్లబొల్లి ఆచారాలను పుట్టించారు.
నిట్టూర్పు వేసిన గుండెకు,
కలతల మనసుకు అదే బలం అన్నారు
అదే మతం అన్నారు.
మనిషి మతం చుట్టూ తిరగడం ప్రారంభించాడు.
ఒకసారి నమ్మడం ప్రారంభించాక ఎవరేమి చెప్పినా అది నమ్ముతూనే ఉంటాడు మనిషి.
ఒక మనిషి మరో మనిషిని దోపిడీ చేయడం మొదలుపెట్టాక
ఆ దోపిడీకి మతం ఊతమిచ్చింది
నమ్మకాలు ఆసరాగా నిలిచాయి.
శాస్త్రాలు రాశారు
కథలు చెప్పారు
ఇతిహాసాలు రాశారు
అదే నిజమన్నారు
వాస్తవాన్ని మరిచిన జనం
అబద్ధంలో కూరుకుపోయింది
అబద్ధం చుట్టూ అల్లిన అవాస్తవం
నిజమై కూర్చుంది "గీత"లో
"నీ పని నువ్వు చెయ్యాలి" కృష్ణుడు అన్నారన్నారు
అది ఎవరికోసం? ఎవరికి న్యాయం?
సోమరులైన మోసగాళ్ళకు లాభం
నిరంతర శ్రమ చేసే కష్టజీవులకు భారం!
మనుశాస్త్రం కట్టుబాట్లు చేసింది
అదే రాజ్యాంగం అంది
ఒకరు పని చేస్తే ముగ్గురు తినాలని చెప్పింది

పేదలు పని చేశారు కిక్కురు మనకుండా.
ధనికులు పరుగు తీశారు,
ధర్మం పేరుతో దోపిడీ చేశారు.
పేదలు తమ చుట్టూ అల్లిన వలలో చిక్కుకున్నారు.
తాము వలలో చిక్కుకున్నామన్న స్పృహ లేకుండా చేశారు.
అలా ఉండటమే తమ వంటికి మంచిదని నేర్పించారు.
దేవుడు చుట్టూ అల్లిన భావాలు
తయారయ్యాయి
బలహీనులకు గొలుసులుగా!

మతం ఎక్కడైనా, ఎప్పుడైనా,
దోపిడీకి ముసుగు వేసింది.
సత్యం  తెలుసుకోవాలంటే
అంతరంగ పేటిక తెరిచి చూసుకోవాలి!
అజ్ఞానం తొలగించుకోవాలి
జ్ఞానమనే నిప్పును రగిలించుకోవాలి
సత్యాన్ని సత్యంగా చూడాలి
ఎవరో చెప్పినారని ఎక్కడో రాశారని నమ్మరాదు
ప్రతిదాన్ని పరీక్షించు చూడు
ఆచరణలో తేల్చిన సత్యం
అదే జ్ఞానం
అదే నీ చుట్టూ పన్నిన వలను దహించే సాధనం



**34వ జాతీయ నాస్తికమేళాలో హాజరైన ప్రతినిధులు**

# విద్యా సంస్కరణలు సాధించిందేమిటి?

– కె.వి.ఆర్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యాసంస్కరణలు తెచ్చిపెట్టి విద్యారంగాన్ని ఎంతో బాగా అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. వీటివల్ల లాభం ఏమోగానీ.. నష్టాలు మాత్రం ఎన్నో ఉన్నాయని అర్థమవుతుంది.

- నూతన విద్యాసంస్కరణలు అమల్లోకి వచ్చిన తర్వాత బోధనేతర కార్యక్రమాల భారం విపరీతంగా పెరిగిపోయింది. పాఠ్యాంశాల బోధనకు కనీస సమయం కూడా లేని పరిస్థితి దాపురించింది. దీని ఫలితంగా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల స్థాయి బాగా తగ్గిపోయింది.

- వాస్తవానికి నూతన విద్యాసంస్కరణలు అమలు చేసిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పిల్లల సంఖ్య బాగా పెరగాలి గదా! పెరగడానికి బదులు ప్రతి సంవత్సరం లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లను వదిలేసి ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో చేరిపోతున్నారు.. ఇది దేనికి సంకేతం? నూతన విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత విద్యా ప్రమాణాల స్థాయి బాగా పెరగాలి గదా?.. విద్యా ప్రమాణాల స్థాయి ఇంతగా దిగజారి పోవడం ఏమిటి? ఇట్లాగైతే నూతన విద్యాసంస్కరణల వల్ల మనకు కొత్తగా ఒరిగిందేముంది?

- ఎప్పటినుండో కేరళ రాష్ట్రంలో అద్భుతమైన విద్యా విధానం కొనసాగుతుంది.. ఆ విధానాలనే దేశంలోని వివిధ రాష్ట్రాలలో అమలు జరిపి ఉన్నట్లయితే మంచి మంచి ఫలితాలు వచ్చేవి గదా? LKG, UKG లాంటి pre primary విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం.. ఉపాధ్యాయ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయడం.. ప్రతి క్లాస్‌కి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడటం.. ప్రతి స్కూల్లో లైబ్రరీ, లేబరేటరీ, విశాలమైన ఆట స్థలాలు ఉండేలా చూడటం.. విద్యార్థుల ఉపాధ్యాయుల నిష్పత్తి చాలా తక్కువగా ఉండేటట్లు చూడటం... బోధనకే ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం... ఇక్కడలా నామ్‌కే వాస్తే పేరెంట్స్ కమిటీలు కాకుండా Active parents committees ఉండేలా చూడటం. Primary education పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ చూపటం.. Education కోసం బడ్జెట్ కేటాయింపులు ఎక్కువగా ఉండేలా చూడటం... తదితర చక్కటి ప్రభుత్వ విధానాల వల్ల కేరళ విద్యారంగం దేశంలోనే అద్భుతంగా ఈనాటికీ కొనసాగుతూ ఉంది.. ఇలాంటి విద్యా విధానాన్ని కొనసాగించకుండా నూతన విద్యా విధానాల పేరుతో ఏదేదో సంస్కరణలు తెచ్చిపెట్టడంతో చదువుల నాణ్యత తగ్గిపోయి ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరే పిల్లల సంఖ్య బాగా తగ్గిపోయింది.

- విద్యా ప్రమాణాలు పెరగనప్పుడు.. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పిల్లల సంఖ్య పెరగనప్పుడు.. ఉన్న పిల్లలు కూడా రోజురోజుకు తగ్గిపోతున్నప్పుడు.. నూతన విద్యా సంస్కరణలు ఎంతో గొప్ప వని.. ఏదేదో గొప్ప ఫలితాలు సాధించామని ఎట్లా చెప్పుకోగలుగుతారు?

- నూతన విద్యా సంస్కరణలను రద్దుచేసి.. వాటి స్థానంలో కేరళ తరహా విద్యా విధానాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ ప్రవేశపెట్టాలి.. దీనికోసం ప్రభుత్వ విద్యారంగం బాగుండాలని కోరుకునే ప్రగతిశీల పార్టీలు, సంఘాలు, మేధావులు, వ్యక్తులందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

# భారత ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి మిథ్యేనా?

- డా|| చెన్నుపాటి దివాకర్‌బాబు

రాజ్యాంగానికి ప్రాధాన్యతనివ్వకుండా, రాజ్యాంగ వ్యవస్థలకు ప్రాధాన్యతనివ్వకుండా, రాజ్యాంగ వ్యవస్థల్ని అధికార పార్టీ నేతలతో నింపి ఆ వ్యవస్థల యొక్క మౌలిక స్వరూపాన్ని దెబ్బతీస్తున్న సమయమిది. గతంలో ఎన్నికల సంఘం మీద సదభిప్రాయం వుండేది. నేడది లేదు. ఎందుకంటే అధికార పార్టీ ఎవర్ని కోరుకుంటే వారు ఎన్నికల సంఘం కమీషన్ అవుతున్నారు కాబట్టి!

ఓటర్ల జాబితా రూపకల్పనలో అవకతవకలు జరిగాయి. 65లక్షల ఓటర్లను జాబితా నుండి తొలగించారు. ఢిల్లీ మినహా ఇతర రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్‌కు సొంత ఉద్యోగులు లేరు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులే తాత్కాలికంగా దాని ఉద్యోగులుగా వుంటున్నారు. 130వ రాజ్యాంగ సవరణ నెగ్గకూడదు. అది గనక వస్తే మనది కూడా సైనిక పాలన దేశంగా మారుతుంది.

♦ రాజ్యాంగం మీద ఎవరికైతే విశ్వాసం లేదో వాళ్ళు ఈ రోజున పరిపాలన చేస్తున్నారు. ఈ రాజ్యాంగాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది మొదటిది హిందూ మహాసభ కాగా, రెండవది ఆరెస్సెస్. ఇందిరాగాంధీ గరీబి హఠావో కార్యక్రమం ప్రవేశపెట్టినపుడు ఈ ఆర్.ఎస్.ఎస్ వాళ్ళు పేదరికానికి కారణం ఈ రాజ్యాంగమేనన్నారు.

♦ 360 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగం సవరణ చేస్తున్నప్పటికీ, అది రాజ్యాంగ మౌలిక లక్షణాలను మార్చడానికి వీలులేదు అని చెప్పింది. కాని ఆ మౌలిక లక్షణాలకు పూర్తి విరుద్ధంగా నేడు రాజ్యాంగ సవరణలు జరుగుతున్నాయి.

♦ సుప్రీంకోర్టు ఒక తీర్పులో ఎన్నికల కమీషన్‌లోని ముగ్గురు సభ్యులలో - ఒకరు ప్రధాన మంత్రి, రెండవ వారు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ లేదా అతను సూచించిన ఒక న్యాయమూర్తి, మూడో సభ్యుడుగా ప్రతిపక్ష నేత వుండాలని చెప్పింది. కాని నేడు రెండో వ్యక్తిగా ప్రధానమంత్రి తన మంత్రివర్గంలోని ఎవరైనా మంత్రిని నియమిస్తున్నాడు.

♦ ఎన్నికల సమయంలో ఎవరైనా కుల మతాలను రెచ్చగొట్టి మాట్లాడితే వాళ్ళను అనర్హులుగా ప్రకటించాలని ఒక నియమం వుంది. కానీ, గుజరాత్‌లో బిజెపి నాయకుడొకడు 'కాంగ్రెస్ గెలిస్తే హిందూ స్త్రీల మంగళ సూత్రాలను ముస్లింలకు ఇస్తారు' అని మాట్లాడితే ఆ వ్యక్తిపై ఎన్నికల కమీషన్ ఏ చర్య తీసుకోలేదు. ఆ పార్టీకి ఒక నోటీస్ మాత్రమే ఇచ్చింది.

కర్నాటకలోనూ బిజెపి నాయకుడొకడు 'కాంగ్రెస్ గెలిస్తే హిందువుల భూములన్నీ ముస్లింలకు ఇస్తారని' మాట్లాడినా ఎన్నికల కమీషన్ ఆ వ్యక్తిపై ఏ చర్య తీసుకోలేదు. ఎన్నికల కమీషన్, బిజెపికి ఒక న్యాయం, ఇతర పార్టీలకు ఒక న్యాయంలా ప్రవర్తిస్తోంది.

♦ 65 లక్షల ఓటర్లను జాబితానుండి ఏ కారణం చేత తొలగించారో చెప్పమని సుప్రీంకోర్టు అడిగితే, దానికి ఎన్నికల కమీషన్ 'మేం చెప్పాల్సిన పని లేదు' అంటూ రిప్లై ఇచ్చింది!

ముస్లిం ఓటర్లు ఎక్కువగా వున్న నియోజక వర్గాల్లోనూ, గతంలో బిజెపి స్వల్ప మెజారిటీతో నెగ్గిన నియోజక వర్గాల్లోనూ ఓట్లను గల్లంతు చేసింది ఎలక్షన్ కమీషన్. ●

# మత మౌఢ్యం ప్రమాదకరం!

**మ**న దేశంలో పాలకవర్గాల, మతాధిపతుల, బడా పెట్టుబడిదారుల స్వార్థాల వల్లే.. మత మౌఢ్యం, మూఢత్వం వేగంగా విస్తరిస్తోంది! గుప్తనిధుల కోసమంటూ, పసి పిల్లలను బలి ఇస్తారు! తాంత్రిక పూజల పేరుతో కన్నెపిల్లల బతుకులను కాలరాస్తారు! కొందరికి దైవత్వాన్ని, మరికొందరికి అస్పృశ్యతని ఆపాదిస్తారు! పుట్టినప్పటి నుండి, చచ్చేవరకు కూడా.. మూఢ విశ్వాసాల్లో మునిగి తేలుతూ ఉంటారు! ఇదంతా, ప్రజలను మతమౌఢ్యంలో ముంచిన ఫలితంగా ఏర్పడిన సామాజిక రుగ్మతలే!

ఈ మత మౌఢ్యం తలకెక్కిన వాళ్ళు చేసే అమానుషాలు, అర్థం లేని పనులు అంతా ఇంతా కాదు! ఒకవైపు పసి పిల్లలు తిండి లేక, చెత్తకుండీల దగ్గర కుక్కలతో సమంగా పోటీ పడే దుర్భరస్థితి కనిపిస్తూ ఉంటే.. మరోవైపు, బిందెల కొలది విలువైన పాలను, రాతి విగ్రహాలపై పారబోస్తారు! అనేక పోషక విలువలు ఉన్న నెయ్యిని, హోమం పేరుతో మంటల్లో పోస్తారు! ఇక చివరకు జంతువుల పట్ల కూడా, వీరు వివక్ష చూపిస్తుంటారు. కొన్ని జంతువులకు దైవత్వాన్ని, శుభాన్ని ఆపాదిస్తారు. మరికొన్ని జంతువులతో గొడ్డు చాకిరి చేయించుకుంటారు. అశుభాలను కూడా అంటగడతారు!

అన్ని మతాలు కూడా.. రాజ్యాంగంలోని మత స్వేచ్ఛను అడ్డుపెట్టుకొని, సమాజం మొత్తాన్ని మతమౌఢ్యంలో ముంచుతున్నాయి! సమాజ ఆరంభం నుండి కూడా, దోపిడీ స్వభావంతో జీవించే పాలకవర్గాలు, మతాధిపతులు కలిసి, ప్రజల నుండి తిరుగుబాటు రాకుండా ఉండేందుకు, కర్మ సిద్ధాంత భావజాలాలతో కూడిన అనేక మతాలను సృష్టించారు! అందుకే, మతాలు మతాధిపతులు.. పాలకులను, వారి విధానాలను నిరంతరం సమర్థిస్తూ ఉంటాయి, వారిని రక్షిస్తూ ఉంటాయి!

ఉదాహరణకు కోవిడ్ విషయాన్నే తీసుకుంటే.. అన్ని మతాల మతాధిపతులు, ఇంచుమించు ఒకే సారాంశంతో కూడిన ప్రవచనాన్ని చెప్పారు. “పాపం పెరిగిపోయింది, అందుకే ఈ కరోనా వచ్చింది. అంతా దేవుడి చిత్తం ప్రకారమే జరుగుతుంది” అంటూ అందరు మతాధిపతులు ఒకే రకంగా చెప్పారు. నిజానికి కోవిడ్ ను సృష్టించింది.. దేవుడు కాదు, దేవుడు మీదున్న నమ్మకమూ కాదు! ప్రపంచం మీద అన్నిరకాలుగా ఆధిపత్యం చలాయించడం కోసం, మరింత సంపన్న దేశాలుగా బలపడడం కోసం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాలకవర్గాలు, బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు జరిపిన, పర్యావరణ విధ్వంసం ఫలితమే.. ఈ భయంకరమైన వైరస్‌లు, కోవిడ్‌లు! కరోనా పుట్టుకకు సంబంధించి, శాస్త్రీయమైన వాస్తవాలు కళ్ళ ముందు కనిపిస్తూ ఉంటే.. మతాలు, మతాధిపతులేమో, ఈ పాపమంతా దేవుడి మీదకి నెట్టేసి, పాలకులను రక్షించే పని పెట్టుకున్నారు!

మనదేశంలో ఈ పాలక, దోపిడీ వర్గాలు.. వారి కుటిల ఆలోచనల్లో భాగంగానే, రాజ్యాంగంలోని మత స్వేచ్ఛని నెత్తిన పెట్టుకున్నారు! ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచే ‘ఆర్టికల్ 51 A (h)’ ను భూస్థాపితం చేస్తున్నారు! అందుకే, ప్రజలంతా సామాజిక, వైజ్ఞానిక దృక్పథంతో ఎదగాలి. అందుకు ప్రతి ఒక్కరూ శాస్త్రీయ విజ్ఞానాన్ని, సామాజిక రాజకీయ ఉద్యమ చైతన్యాన్ని పెంపొందించే మార్క్సిజాన్ని అధ్యయనం చేయాలి! అప్పుడే ఈ సమాజంలో సామాజిక ఆర్థిక అసమానతలు ఏ స్థితిలో ఉన్నాయో, ప్రజలు ఎంత మతమౌఢ్యంలో కూరుకు పోయి ఉన్నారో అర్థమవుతుంది, తమ కర్తవ్యం బోధ పడుతుంది! – **ముద్దగౌని సుభాష్**

Editor, Printed & Published by : **B. Sudhakar,** Printed at
MYTRI ART PRINTERS, Mahaboobnagar.